ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 14, మార్చి 2025

హైలెస్సో.. హైలెస్సా!

వైభవంగా నిర్మమహేశ్వరుని తెప్పోత్సవం

దక్షిణకాశీగా పేరొందిన పాదిరిలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. దేవస్థాన చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ఆలయ ఈవో నర్రా నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో పుష్కరిణిని మాహాసంప్రోక్షణ చేశారు. భక్తులు కోనేరు దగ్గరకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. 3



పాదిరిలో తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) నిర్మమహేశ్వరుడి ఉత్సవ విగ్రహం


శింగరకొండకు తిరునాళ్ల కాంతులు

అద్దంకి మండలంలోని శింగరకొండ క్షేత్రం కాంతులీనుతోంది. లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రధాన తిరునాళ్ల జరగనుంది.
ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు స్వామివారి దివ్యదర్శనం నిర్విరామంగా కొనసాగించనున్నారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఐదు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. 3



జిల్లాలో ఎక్సైజ్ అధికారులు వసూళ్ల పర్వానికి తెరతీశారు. 'అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండి..' అంటూ మద్యం దుకాణాల లైసెన్స్‌దారులకు ఆఫర్ ఇస్తున్నారు. ఒక్కో షాపునకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ నెలవారీ మామూళ్లు నిర్ణయించారు. అధికార పార్టీ మద్దతు ఉన్న షాపుల యజమానులతో బేరసారాలు సాగిస్తున్నారు. దీన్ని అవకాశంగా చేసుకొని దుకాణాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్నారు. అనేక చోట్ల అర్ధరాత్రి కూడా గ్లాసులు గలగలలాడుతున్నాయి. మద్యం దుకాణం వద్దే సిట్టింగ్‌లు, చీర్స్ కొనసాగుతున్నాయి. బడ్డీకొట్లు కూడా బెల్ట్‌షాపులుగా మారిపోయాయి. మామూళ్ల మత్తులో ఉన్న ఎక్సైజ్ అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్సైజ్.. వసూల్!



మద్యం దుకాణాల నిర్వాహకుల నుంచి నెలవారీ మామూళ్లు

- ఒక్కొక్కరి వద్ద రూ.10వేల నుంచి రూ.20వేలు
- కొందరితో కుదిరిన బేరం.. కొనసాగుతున్న లాలూచీ
- మిగిలిన వారిపై కేసులు.. దాడుల పేరుతో బెదిరింపులు
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నా పట్టించుకోని అధికారులు

ఒంగోలు క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. వ్యాపారుల అక్రమాలను అడ్డుకోవాల్సిన వారే గొడుగుపడుతున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు ఇప్పటికే తడిసిమోపెడైన ఫీజులతో అల్లాడిపోతున్న లైసెన్స్‌దారులు అదనపు భారం మోయలేకపోతున్నారు. అధికారుల పరోక్ష సహకారంతో అక్రమవిక్రయాలకు తెరతీశారు. ఎక్సైజ్ శాఖను గత వైసీపీ ప్రభుత్వం రెండు ముక్కలు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఎస్ఈబీ, పాలనాపరమైన వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్‌ను విభజించింది. ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఆ విధానం అభాసుపాలైంది. అవినీతి రాజ్యమేలింది. ఎస్ఈబీపై లెక్కకు మిక్కిలి ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్‌శాఖలోనూ కొందరు దండిగా సొమ్ము చేసుకున్నారు. ఓ ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ ఏకంగా రూ.2కోట్లకుపైగా ప్రభుత్వ ధనం స్వాహా చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇందులో అధికారుల పాత్ర కూడా ఉండటంతో మిన్నకుండిపోయారన్న చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎక్సైజ్‌ను ఏకతాటిపైకి తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వం రాకముందు ఉన్నట్లే మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది.

మా సంగతేంటి అంటూ బేరాలు

కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ నూతన విధానంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించింది. 20 శాతం కమీషన్ వస్తుందని చెప్పడంతో అనేక మంది కొత్తవారు సైతం మద్యం వ్యాపారం

మిగతా 2లో...

పల్లె గొంతుకు 'బెల్ట్'

ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్లు డిమాండ్ చేస్తుండటంతో వ్యాపారులు అక్రమ విక్రయాలు చేస్తున్నారు. మరోవైపు బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామంలో ఒకట్రెండు బెల్ట్ షాపులను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 191 లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో షాపు యజమాని ఆ పరిధిలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌కు ఎమ్మార్పీకంటే రూ.10 అదనంగా తీసుకొని గ్రామాలకు చేరుస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు దాన్ని రూ.20 నుంచి రూ.50వరకూ అదనంగా అమ్ముకొంటున్నారు. ఒక్కో గొలుసు దుకాణానికి ఐదు వేల వరకూ ఎక్సైజ్ అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల వద్ద ఎలాంటి సిట్టింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అయితే అన్ని షాపుల వద్ద పర్మినెంట్ రూంలను తలపించే విధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకుండా మామూళ్లు పుచ్చుకొని మిన్నకుంటున్నారు.

మద్యం రేషన్‌లో కిరికిరి

మద్యంలోని కొన్ని బ్రాండ్‌లకు, బీరుకు రేషన్ ఉండటం కూడా ఎక్సైజ్ అధికారులకు కలిసి వచ్చింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్న సిండికేట్లకు రేషన్ ఎత్తివేసి అవసరమైన మేరకు సరుకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఐదు లారీల బీర్లు ఒంగోలు మద్యం డిపోకు వచ్చాయి. అదేరోజు బీరుకు రేషన్ లేదంటూ వ్యాపారులకు మెసేజ్‌లు వెళ్లాయి. వారు మెసేజ్‌లు చూసుకుని వెళ్లే సరికి బీర్లు మొత్తం అధికారులకు అనుకూలంగా ఉన్న వ్యాపారులకు ఇచ్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా రేషన్ పేరుతో లబ్ధి చేకూర్చి మా సంగతి ఏంటని వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఒంగోలు నగరంలో 20 మద్యం దుకాణాలు ఉన్నాయి. నిర్వాహకులు రెండు సిండికేట్లుగా విడిపోయారు. కొందరు సిండికేట్‌లో కలవలేదు. అలాంటి వారి నుంచి ఒక్కో దుకాణానికి రూ.20వేల వరకూ నెలవారీ మామూళ్లను ఎక్సైజ్ అధికారులు అడుగుతున్నట్లు తెలుస్తోంది.

మార్కాపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలు ఉన్నాయి. అక్కడ బెల్ట్‌షాపులకు లైసెన్స్‌దారులే మద్యం సరఫరా చేస్తున్నారు. ఈనేపథ్యంలో గొలుసు దుకాణాలతో కలిపి ఒక్కో మద్యం షాపునకు రూ.లక్ష వరకూ నెలవారీ మామూళ్లను అధికారులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

దర్శి సర్కిల్ పరిధిలో 23 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో షాపునకు నెలవారీ మామూళ్లు రూ.20వేలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. బెల్ట్‌షాపునకు ఒక్కోదానికి రూ.5వేలు ఫిక్స్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

'ఓపెన్' కాపీయింగ్‌పై డీఈవో సీరియస్

12 మందికి సంజాయిషీ నోటీసులు

ఒంగోలు విద్య, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో కాపీయింగ్‌పై జిల్లా విద్యాశాఖాధికారి సీరియస్ అయ్యారు. 12మందికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. కనిగిరిలోని మూడు పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులను సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ అక్బర్ అలీఖాన్ డీబార్ చేసిన విషయం విదితమే. ఇటీవల పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా తీవ్ర హెచ్చరికలు చేశారు. ఏదైనా కేంద్రంలో కాపీయింగ్ చేస్తూ పట్టుబడితే ఆ విద్యార్థిని డీబార్ చేయడంతోపాటు అక్కడ ఇన్విజిలేటర్‌ను పరీక్షల విధుల నుంచి సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనేపథ్యంలో విద్యార్థులు డీబార్ అయిన కనిగిరి మోడల్ స్కూలు, అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరిస్తున్న వారు అలా ఒక్కో కేంద్రంలో నలుగురు చొప్పున 12 మందికి బుధవారం రాత్రి డీఈవో నోటీసులు జారీ చేశారు. వెంటనే సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఇంటి నిర్మాణానికి అదనపు సాయం

- ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 వేల నుంచి రూ.లక్ష
- కలెక్టర్ అన్సారియా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పక్కా గృహాలు మంజూరైన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం అదనపు సాయం అందజేస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడించారు. ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకూ ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-47లో భాగంగా జిల్లాలో 2029 నాటికి అందరికీ గృహ నిర్మాణం అన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేందుకు ప్రభుత్వం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు రూ.లక్ష సహాయం అందిస్తుందన్నారు. ఈనెల 15నుంచి 23వతేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. మే అఖరుకు 8,839 గృహాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వతేదీన చేపట్టే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయాశాఖల అధికారులు చిరంజీవి, శ్రీనివాసప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

ఒంగోలు విద్య, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఒంటి పూట బడులు శనివారం నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులకు ఈలోపే మధ్యాహ్న భోజనం కూడా అందించాల్సి ఉంటుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకూ తరగతులు ఉంటాయి. ఇక్కడ పరీక్షలు జరిగే ఏడు రోజుల్లో మాత్రమే ఈ పని వేళలు అమలు చేస్తారు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 20,634మంది హాజరు కాగా 1,290 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల అనంతరం కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొట్టారు. బస్సుల్లో కళాశాలలకు వెళ్తూ తమచేతుల్లోని కాగితాలను చించి బయటకు విసురుతూ స్నేహితులతో సంతోషాన్ని పంచుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు. - ఒంగోలు విద్య, (ఆంధ్రజ్యోతి)



మర్రిపూడి మండలంలోని పృథులగిరి క్షేత్రం లక్ష్మీ నరసింహస్వామి నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు స్వామివారి గరుడసేవ వైభవంగా సాగింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనంలో తరించారు.

జయహో నారసింహ



3



అవధిలేని ఆనందకేళి రంగేళి

3

- చిన్నాపెద్దా అందరికీ సంతోషాన్నిచ్చే రంగుల పండుగ
- అధర్మంపై విజయానికి సంకేతం
- నేడు హోలీ పండుగ

ఎక్సైజ్.. వసూల్..!

(1వ పేజీ తరువాయి)

వైపు మొగ్గు చూపారు. సాంకేతిక కారణాల వలన కమీషన్ 10 శాతం మాత్రమే రావడంతో గగ్గోలు పెట్టారు. విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పరిస్థితిని సమీక్షించి క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచి వ్యాపారులకు 14.5 శాతం కమీషన్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అధికారులు వ్యాపారుల మీద వాలిపోయారు. 'మీకు బాగానే లాభాలు వస్తున్నాయి. నిత్యం రూ.రెండు లక్షలకుపైగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. మా సంగతేంటి?' అని వ్యాపారుల వెంటపడటం ప్రారంభించారు. 'అడిగినంత చెల్లిస్తే మీరు ఏం చేసుకున్నా పట్టించుకోం.. లేకపోతే కేసులు పెడతాం' అని ఎక్సైజ్ అధికారులు కొందరు వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు

మామూళ్ల వ్యవహారంలో ఎక్సైజ్ శాఖలోని ఓ కీలక అధికారి ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో దుకాణానికి ఆయన రూ.50వేలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అయితే కిందిస్థాయిలో అధికారులు దుకాణదారులతో బేరాలు మాట్లాడుకొని నెలవారీ రూ.10వేల నుంచి రూ.20వేలు మామూళ్లు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఒక లైసెన్స్‌దారుడు మాత్రం ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. వారి ఆదేశాల మేరకు విచారణ జరుగుతున్నట్లు సమాచారం. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఎవరో గిట్టని మద్యం వ్యాపారి అలా చేసి ఉంటారని చెప్తూ మామూళ్ల వ్యవహారంలో మునిగి తేలుతున్నారు.

పాలిసెట్‌కు నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు విద్య, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్‌లలో 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశపరీక్ష పాలిసెట్-25 నోటిఫికేషన్ విడుదలైంది. పాలిసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. పదో తరగతి, తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు ఈనెల 17నుంచి ప్రారంభమవుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ఓసీ, బీసీలకు రూ.400, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు రూ.100 హెల్ప్‌లైన్ సెంటర్ల ద్వారా లేదా గేట్‌వే చెల్లింపు ద్వారా దాఖలు చేయవచ్చు. విద్యార్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే నెల 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ గురువాఆరం తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మర్లపాడులో లేగదూడల ప్రదర్శన

టంగుటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపాడులో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన దేశీయ లేగదూడల ప్రదర్శనా కార్యక్రమం నిర్వహించారు. నేటి లేగదూడలే రేపటి పాడిపశువులని, వాటి సంరరక్షణతోనే పాడి లాభదాయకమని, కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్యకార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దూడల ఆరోగ్య నిర్వహణకు రైతులు శాస్త్రీయ పద్ధతులు, సరైన పౌష్టికాహారం, పశువ్యాధుల వ్యాప్తిని నిరోధించడానికి వ్యాధి నిరోధక టీకాలతో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బేబీరాణి తెలిపారు. ప్రదర్శనలో 70 దూడలు పాల్గొన్నగా మేలుజాతి దూడలకు బహుమతులు, లివర్ టానిక్, మినరల్ మిక్సర్, బలవర్ధక మందులు పంపిణీ చేశారు.

రైళ్లలో దోపిడీ ముఠా అరెస్టు

● ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలు

● మత్తు మందు ఇచ్చి బంగారు ఆభరణాలు అపహరణ

● రైల్వే సీఐ మౌలాషరీఫ్ వెల్లడి

ఒంగోలు క్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): రైళ్లలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడే ముఠాను అరెస్టు చేసినట్లు రైల్వే సీఐ ఎస్‌కే.మౌలాషరీఫ్ తెలిపారు. ఈ ముఠాలో ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు చెందిన ముగ్గురు సభ్యులు కాగా కాజల్‌వర్మ, విజయేందర్‌లను అరెస్టు చేశామని, ఇంకా రచీత్‌శర్మ పరారీలో ఉన్నారని చెప్పారు. గురువారం ఒంగోలులో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ పై ముగ్గురు నిందితులు రైళ్లలో తిరుగుతూ ఒంటరిగా ప్రయాణం చేస్తున్న మహిళల పక్కన కూర్చొని వారికి మత్తుమందు ఇస్తారు. అనంతరం వారి వద్ద ఉన్న బంగారం ఆభరణాలను అపహరిచుకెళతారని తెలిపారు. గత ఏడాది నవంబరు 8న పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై నుంచి చీరాలకు టి.అనురాధ బయలుదేరారు. దోపిడీ ముఠాలో కాజల్‌వర్మ ఆమె పక్కన కూర్చొని కర్చీఫ్‌లో మత్తు మందు చల్లి దానిని ఆమె ముక్కు వద్ద పెట్టాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిన తరువాత మెడలోని సుమారు 120 గ్రాముల బంగారం గొలుసును చోరీ చేశాడు. ఈ మేరకు బాధితురాలు చీరాల రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక పరిజ్ఞానంతో ఇరువురుని అరెస్టు చేశారు. కాజల్‌వర్మను రాయపూర్ ఎయిర్‌పోర్టులో జనవరి 22 అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముఠాలో విజయేందర్‌ను హర్యానాలో అరెస్టు చేసినట్లు వివరించారు. ఇంకా రచీత్‌శర్మ పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చీరాల రైల్వే ఎస్సై కొండయ్య, కానిస్టేబుల్ ఖాదర్‌బాషా, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

రైలు కింద పడి బిహార్ యువకుడు ఆత్మహత్య

ఒంగోలు క్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒంగోలు రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్‌కు చెందిన సంజీవ్‌కుమార్(25) అద్దంకిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఒంగోలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి కొత్తపట్నంపై ఓవర్ బ్రిడ్జి కింద నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా పట్టాల మీద నిలబడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందింది. మృతదేహం వద్ద దొరికిన ఆధార్‌కార్డు ఆధారంగా గుర్తించారు. ఈమేరకు ఎస్ఐ అరుణకుమారి సంఘటనా స్థలాని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ ఆక్రమణల కేసుల విచారణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలపై నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి కేసుల విచారణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ అక్రమాలపై నమోదైన కేసుల విచారణను పోలీసులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సంబంధిత రెవెన్యూ, మునిసిపల్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు సత్వరమే విచారణాధికారులకు అందించాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వాసు తదితరులు పాల్గొన్నారు.

17లోపు అన్నిశాఖలు సమగ్ర సమాచారం అందించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 24,25తేదీల్లో కలెక్టర్లతో నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు శాఖల వారీగా సమాచారాన్ని ఈనెల 17వ తేదీలోపు తనకు సమర్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీపీటీ ద్వారా వివిధ అంశాలను, ప్రధానంగా జిల్లాలోని పరిస్థితులను బట్టి టాప్-5శాఖలకు సంబంధించిన వివరాలు, ప్రస్తుత సమస్యలు, మూడు నెలల్లోగా వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను వెల్లడించాల్సి ఉన్నందున అందుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని ఆదేశించారు. ఈనెల 15న నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, ప్రైవేటు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులను భాగస్వాములను కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

శింగరకొండ తిరునాళ్లకు భారీ భద్రత

డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

650 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ

అద్దంకి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్లకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరగనున్న నేపథ్యంలో ఎస్పీ డూడీ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయం క్యూ లైన్‌లు, పోలీస్ అవుట్ పోస్ట్ కంట్రోల్ రూమ్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం దేవాలయంలో క్యూలైన్‌ల ఏర్పాట్లు గురించి ఈవో తిమ్మానాయుడుతో చర్చించారు. ట్రాఫిక్ విధులలో ఉండే సిబ్బంది అప్రమత్తంగా విధుల నిర్వహించాలన్నారు. అజాగ్రత్తగా ఉంటే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దేవాలయం ప్రవేశ ద్వారం వద్ద తోపులాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రభల వద్ద అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు.



శింగరకొండ తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

తిరునాళ్లకు 2.30 లక్షల మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 ఎస్ఐలతో పాటు మొత్తం 650 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేవాలయం ప్రాంతంలో 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని పోలీస్ కంటోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. తిరునాళ్ల ప్రాంతంలో రెండు డ్రోన్‌లతో నిఘా ఉంటుందన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఎస్పీ తుషార్ డూడీని ఈవో తిమ్మానాయుడు, పూజారులు ఆశ్వీరింది సత్కరించారు. చీరాల డీఎస్పీ మెయిన్, ఎస్‌బీ సీఐ నారాయణ, అద్దంకి టౌన్, రూరల్ సీఐలు సుబ్బారావు, మల్లికార్జునరావు, రమణయ్య పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అద్దంకిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యార్థం శింగరకొండ తిరునాళ్లకు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక బస్సులు ప్రతి నిమిషానికి ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బెల్లం రామమోహనరావు గురవారం ప్రకటన ద్వారా తెలిపారు. కేవలం టికెట్‌కు రూ.10 మాత్రమే చార్జీని తీసుకుంటారని తెలిపారు. అద్దంకి, ఇతర ప్రాంతాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

ఆధారం లేదు... ఆదుకోండి

కన్నకొడుకులు పట్టించుకోవడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు

గిద్దలూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కని నవమాసాలు మోసి వారికి జీవితం ఇచ్చిన తల్లిదండ్రులు కొడుకులకు బారం అయ్యారు. వారిని నేడు పట్టించుకోక పోవడంతో అనాథలుగా ఉన్నామంటూ గిద్దలూరు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన గురువారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే గిద్దలూరు మండలం కెఎస్‌పల్లె గ్రామానికి చెందిన శివపురం రామకృష్ణ దంపతులు గ్రామంలోనే సుమారు 20 సంవత్సరాలపాటు చిన్నపాటి హోటల్, ఆ తరువాత బట్టల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగించారు. వీరికి ఇరువురు కుమారులు. వ్యాపారంపై వచ్చిన ఆదాయంతో కుమారులను మంచి చదువులు చదివించారు. ఇరువురు కుమారులు కూడా ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. కుమారులు ఇరువురికి మంచి సంబంధాలు చూసి తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఇరువురు కుమారులు ఒకరు బెంగుళూరులో, మరొకరు హైదరాబాద్‌లో సెటిల్ అయ్యారు. అయితే తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం, వయోభారం పడడంతో ఆర్థికంగా ఇబ్బందులతో సతమతమవుతూ వ్యాపారం చేయలేకపోతున్నారు. గ్రామంలో అప్పులు చేసి ఇబ్బందులు పడడంతో ఒక దశలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న కొడుకులు వచ్చి తల్లిదండ్రులు చేసిన అప్పులను తీర్చారు. వాళ్లకు పూర్వం నుండి ఉన్న ఇంటిని కుమారులు ఇద్దరూ వారిపేర్లపై తల్లిదండ్రుల చేత రిజిష్టర్ చేయించుకున్నారు. ఆ తరువాత తల్లిదండ్రులను వదిలేసి వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు రెండు సంవత్సరాలపాటు గుంటూరు వెళ్లి అక్కడ పనిచేస్తూ జీవించారు.

ఇటీవల ఆరోగ్యం సహకరించక వయోభారం ఉండడంతో తిరిగి స్వగ్రామానికి వచ్చారు. అయినప్పటికీ జీవనం భారంగా మారింది. తమ పరిస్థితి గురించి పలు దఫాలు కుమారులకు తెలియజేసినప్పటికీ, వారు పట్టించుకోకపోవడంతో గురువారం గిద్దలూరు పోలీసులను ఆశ్రయించారు. తమకు ఆధారం లేదని, ఆదుకోవాలని, కొడుకులు తమను చూసుకునేలా సహకరించాలని పోలీసులను వేడుకున్నారు. కుమారులను పిలిపించి మాట్లాడతామని అర్బన్ సీఐ సురేష్ వారికి తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తల్లిదండ్రులు

స్వామిత్వ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేతో ఇళ్ల స్థలాలు డిజిటలైజేషన్ జరుగుతాయని తద్వారా కొనుగోలు, అమ్మకాలు జరుపుకునే వారికి పరిస్థితులు సులువుగా ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి ఎల్.ప్రభాకరరావు అన్నారు. గురువారం మండల కార్యాలయంలో స్వామిత్వ కార్యక్రమంపై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్వేలో ప్రతి ఒక్కరి ఇంటి స్థలాల కొలతలు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో భూ వివాదాలు కూడా దాదాపుగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి మండలంలో ముగ్గురు పంచాయతీ సెక్రటరీలు, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్‌లు, నలుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు బృందాలుగా ఏర్పడి కార్యాచరణ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శివన్నారాయణ, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఈవోఆర్డీ రామకృష్ణ డివిజనల్ పరిధిలోని పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

శివుని అనుగ్రహంతో అందరూ ఆనందంగా జీవించాలి

● వాడరేవులో సాగరహారతి, ప్రత్యేక పూజలు

వాడరేవు(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజలందరూ శివుని అనుగ్రహంతో ఆనందంగా జీవించాలని హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు తాడివలస దేవరాజ్, బండారు జ్వాలా నరసింహం అన్నారు. గురువారం రాత్రి వాడరేవు సముద్రతీరంలోని ఆంజనేయుని విగ్రహం సమీపంలో సాగర హారతి నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు నగేష్‌కుమార్, వెంకటేష్, కార్తీక్ శర్మ, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా గుంటూరు ఆర్ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ కృష్ణ మోహన్ హాజరయ్యారు. ప్రతిపౌర్ణమికి సాగర హారతి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పిక్కి నారాయణ, గురవయ్య, రామకృష్ణ, టీడీపీ గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సాగర తీరంలో పూజలు చేస్తున్న వేద పండితులు



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఒంగోలులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించిన అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిఠాపురంలో శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు జిల్లా నలుమూలల నుంచి జనసైనికులు భారీగా తరలిరావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు కంది రవిశంకర్ ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, రాయని రమేష్, ముత్యాల కళ్యాణ్, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, మనోజ్ రాయల్, ఆకుపాటి ఉష, మదాసు సాయినాయుడు, సుంకర కళ్యాణి, అలా నారాయణ, షేక్ ముంతాజ్, నాగరాజు, అనూష, నక్క ప్రమీల, ఇందుర్తి మస్తాన్‌రావు, చెన్ను నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినులు

సింగరాయకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీన ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీల్లో సత్తా చాటిన కె.నందిని, పి.స్వాతి, ధనలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 14 నుంచి 16వ వరకూ కడప జిల్లా పులివెందులలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.శ్యాంప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఫలితాలలో మార్టూరు యువకుల ప్రతిభ

● ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలు 2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మార్టూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు లభించాయి. వారిలో కనిశెట్టి లీలా అవినాష్‌కు 9వ ర్యాంకు, ముక్తిపాటి శ్రీకాంత్ 818వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా లీలా అవినాష్‌కు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ అధికారిగా, ముక్తిపాటి శ్రీకాంత్‌కు ఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీస్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. వారిలో లీలా అవినాష్ తండ్రి కనిశెట్టి లక్ష్మయ్య గతంలోనే చనిపోగా తల్లి చంద్రమధులత ప్రస్తుతం ఇడుపులపాడులో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నారు. మార్టూరులోని శ్రీహర్షిణి విద్యాసంస్థలో 10వతరగతి, ఇంటర్ చదవగా జేఎన్‌టీయూ నరసరావుపేటలో సీఎస్‌ఈలో బీటెక్ చేశారు. అదేవిధంగా మార్టూరు నేతాజీనగర్‌కు చెందిన శ్రీకాంత్ తండ్రి ముక్తిపాటి సుబ్బారావు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాంత్ 10 వతరగతి వరకు దర్శిలో, ఇంటర్ విజయవాడ నారాయణ కాలేజీలో, గుంటూరులోని ఆర్‌వీఆర్ జేసీ కాలేజీలో బీటెక్ సీఎస్‌ఈ కోర్సు చేశారు. ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన ఇద్దరు యువకులకు చెందిన మార్టూరు గ్రామంలోని వారి కుటుంబాలలో ఆనందాలు వెల్లి విరిశాయి. బంధువులకు, స్నేహితులకు వారి కుటుంబసభ్యులు మిఠాయిలు పంచిపెట్టారు. అంతేగాకుండా పలువురు వారిద్దరి కుటుంబ సభ్యులను అభినందించారు.



కనిశెట్టి లీలా అవినాష్



ముక్తిపాటి శ్రీకాంత్

ఫిషింగ్ హార్బర్‌తో ఉపాధి అవకాశాలు

వాడరేవు(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటైతే నిరుద్యోగులకు, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. గురువారం తీరంలో మత్స్యకారులు, గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు.

ఏడుగురు జాదరుల అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని బోయినవారిపాలెం వాదకు ఆనుకుని ఉన్న పొలాల్లో పేకాడుతున్న ఏడుగురిని ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద రూ.42,480 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకర శుభకర ప్రణవ స్వరూప..

లక్ష్మీనరసింహుడు.. గరుడారూరుడైన వేళ

పృథులగిరికి పోటెత్తిన భక్త జనం

లక్ష్మీనరసింహ నామంతో మార్మోగిన క్షేత్రం


మర్రిపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన గురువారం జరిగిన గరుడసేవ ఉత్సవానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. భక్తులు తలనీలాలు సమర్పించి స్వామి పుష్కరణిలో స్నానమాచరించారు. పొంగళ్లు వండి బోణాలను తలపై ఉంచుకొని స్వామి దర్శనానికి మండుటెండను సైతం లెక్కచేయకుండా పృథులగిరి సోపానాలపై దర్శనం కోసం బారులుదీరారు. ప్రధాన అర్చకులు నారాయణం వెంకట రమణాచార్యులు, మారుతీ ఆచార్యులు, విఖానస ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవ వేళ హోమాలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. రాత్రి అలవల కుటుంబీకుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై మాడవీధులలో ఊరేగించారు. కార్యనిర్వాహక అధికారి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



స్వామిదర్శనం కోసం బారులుదీరిన భక్తులు

శోభాయమానంగా...


రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో పృథులగిరులు శోభాయమానంగా వెలుగొందాయి. వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కొండపై కొలువైన పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మర్రిపూడి వైద్యాధికారి వీరబాబు ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ సోమశేఖర్, ఎస్ఐ రమేష్‌బాబుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పటిష్ట బందోబస్తును ఆయన పరిశీలించారు.



గరుడవాహనంపై విహరిస్తున్న లక్ష్మీనరసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్



పృథులగిరి క్షేత్రం



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

3.70 లక్షల కోట్లు ఏమయ్యాయి.. అధ్యక్షా..!

- వైసీపీ విధ్వంసంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రస్తావన



ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా కేవలం సంక్షేమ పథకాలకు రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేశారు. కానీ 2019 నుంచి 2024 మధ్య మొత్తం రూ.6 లక్షల కోట్లు అప్పులు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మరి మిగిలిన రూ.3.70 లక్షల కోట్ల రూపాయాలు ఏమయ్యాయి..?' అని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌కు అప్పులు రూ.9.71 లక్షల కోట్లు ఉన్నాయన్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాం ముగిసే నాటికి రూ.3.71 లక్షల కోట్ల అప్పులున్నాయన్నారు. విభజిత రాష్ట్రంలో మన రాష్ట్రవాటాగా అప్పట్లో అప్పులే ఉన్నాయన్నారు. కానీ ప్రజలపై, రాష్ట్రప్రభుత్వంపై ఎలాంటి భారం పడకుండా నాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతోజాగ్రత్తగా అనుభవంతో పనిచేశారన్నారు. కానీ ఒక అనుభవరాహిత్యం కల్గిన వ్యక్తికి రాష్ట్ర ప్రజలు పట్టం కడితే ఆర్థిక విధ్వంసం సృష్టించాడని విమర్శించారు. రూ.6 లక్షల కోట్ల మేర ఐదేళ్ల వ్యవధిలో అప్పులు మిగిల్చారన్నారు. ముఖ్యంగా విద్యుత్‌రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి రూ.1.29 లక్షల కోట్ల మేర అప్పులు మిగిల్చిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు ఎంతో అనుభవంతో ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో ముందుకు సాగుతున్నారని చెప్పారు. విద్యుత్ సంక్షోభాన్ని సృష్టించిన వైసీపీ ప్రభుత్వమే నేడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వారి హయాంలో 9 సార్లు ఇష్టారీతిన విద్యుత్‌ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారన్నారు. రైతాంగం, ఆక్వా, ఎస్సీ, ఎస్టీలు తదితర రంగాలకు రాయితీపై కూటమి ప్రభుత్వం విద్యుత్ అందిస్తోందన్నారు. ఇంధన సంస్థ ఆక్వా రంగంతోపాటు నాపరాయి, చీమకుర్తి గ్రానైట్, పలకల పరిశ్రమలపై కూడా దృష్టిపెట్టి రాయితీలిచ్చి ఆదుకోవాలని కోరారు.

దేదీప్యమానంగా శింగరకొండ

రెండవ రోజూ ప్రత్యేక పూజలు

ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహన సేవ

అద్దంకి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వెలుగులతో శింగరకొండ క్షేత్రం దేదీప్యమానంగా వెలుగుతోంది. శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామివార్ల 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం ప్రారంభం కాగా, రెండోరోజైన గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. నిత్యపూజలతో పాటు ప్రసన్నాంజనేయస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. 108 మంది వేద విద్యార్థులతో వేద పఠనం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గురువారం రాత్రి ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహన సేవను ఈవో తిమ్మానాయుడు ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ప్రధాన తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు స్వామివారి దివ్య దర్శనం నిర్విరామంగా ఉంటుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రెండవ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం అన్ని సామాజిక వర్గాల అన్నదాన సత్రాలల్లో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



ప్రసన్నాంజనేయస్వామికి నిర్వహిస్తున్న ఉష్ట్ర వాహన సేవ

తిరునాళ్లకు 5 విద్యుత్ ప్రభలు

తిరునాళ్ల సందర్భంగా 5 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. శింగరకొండపాలెం టీడీపీ ఆధ్వర్యంలో 2 విద్యుత్ ప్రభలు, అద్దంకి పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో 1 విద్యుత్ ప్రభ, టీడీపీ నేత సందిరెడ్డి రమేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ, బీసీవై పార్టీ ఆధ్వర్యంలో మరో ప్రభలు కొలువుదీరనున్నాయి.

పలు రైళ్లకు అదనపు స్టాపేజీలు కొనసాగింపు

విజయవాడ రైల్వేస్టేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు అదనపు స్టాపేజీలను మరో ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 17011 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్, 17012 సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్, 12713 విజయవాడ-సికింద్రాబాద్, 12714 సికింద్రాబాద్-విజయవాడ, 12706 సికింద్రాబాద్-గుంటూరు, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లు ఈ రోజు నుంచి చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 12072 హింగోళిడెక్కన్-ముంబయి సీఎస్ఎన్ టెర్మినస్ అప్ అండ్ డౌన్ రైళ్లు, పర్బూరు, సెలులో 20701, సికింద్రాబాద్-తిరుపతి అప్ అండ్ డౌన్ రైలు మిర్యాలగూడలో, 17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో ఆగుతాయి. 12787 నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 15, 16 తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగుతుంది. 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20న, 17480 తిరుపతి-పూరి ఈ నెల 21న, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఈ నెల 18న, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లు ఈ నెల 16న కొవ్వూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20896 భువనేశ్వర్-రామేశ్వరం రైలు ఈ నెల 21న, 20895 రామేశ్వరం-భువనేశ్వర్ రైలు ఈ నెల 23న, 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23న, 16583 పుదుచ్చేరి-హౌరా ఈ నెల 19వ తేదీన రాజమండ్రి స్టేషన్‌లో ఆగుతాయి. 16583 యశ్వంత్‌పూర్-లాతూర్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు, 16584 లాతూర్-యశ్వంత్‌పూర్ ఈ నెల 15న కమలానగర్ స్టేషన్‌లో ఆగుతాయి. 22151 పూణే-ఖాజీపేట ఈ నెల 21న, 22152 ఖాజీపేట-పూణే ఈ నెల 23న మంచిర్యాల స్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే శాఖ పేర్కొంది.

అవధిలేని ఆనందకేళి 'హోలీ'

చిన్నాపెద్దా అందరికీ సంతోషాన్నిచ్చే రంగుల పండుగ

అధర్మంపై విజయానికి సంకేతం

నేడు 'రంగేళి'

ఒంగోలు కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఏడాది మొత్తంలో అత్యంత ఆహ్లాదకరమైన మాసం వసంత మాసం. ఇప్పటివరకు ఎండిపోయి ఆకులు రాల్చిన చెట్లు వసంతమాసంలో చిగురులు వేసి పచ్చగా శోభాయమానంగా కనిపిస్తాయి. అటువంటి వసంతమాస ప్రారంభానికి స్వాగతం పలుకుతూ, చిన్నా పెద్దా తేడాలేకుండా అందరినీ ఆనందోత్సాహాల్లో ముంచెత్తే రంగుల పండుగ 'హోలీ'. ప్రతి పండుగకూ ఒక పురాణ ప్రాశస్త్యం ఉన్నట్లే హోళీ పండుగకు అధర్మంపై ధర్మం స్థాపించిన విజయానికి చిహ్నంగా గుర్తింపు ఉంది. ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున హోలీ పండుగ జరుపుకోవటం ఆనవాయితీ. దీన్నే మదనోత్సవమని, వసంతోత్సవమని పిలుస్తారు. ఈ పండుగను 'కామదహనం' అని కూడా పిలుస్తుంటారు.

రంగులతో సందడి

హోళీ పండుగ రంగుల పండుగగా కూడా ప్రసిద్ధి. ఈ రోజున తమ కుటుంబసభ్యులు, స్నేహితులపై రంగులు చల్లుతూ, రంగునీళ్లు పోస్తూ, పాటలు పాడుతూ, ఆటలాడుతూ సందడి చేస్తారు. ఈ రంగులు చల్లటానికి ప్రత్యేకమైన 'కలర్ గన్స్'గా పిలిచే గొట్టాలు సైతం ప్రస్తుతం మార్కెట్లో అమ్ముతున్నారు. అదేవిధంగా హోలీ పండుగ సందర్భంగా నగరంలోని ప్రధాన వీధుల్లో అనేక దుకాణాల ముందు వివిధ రకాల రంగులు అమ్మకానికి సిద్ధమయ్యాయి. ఆ రంగులు కెమికల్స్‌తో తయారైన నేపథ్యంలో వీటితో చేసిన నీళ్లు కళ్లలో పడకుండా గాగుల్స్ ఉపయోగించటం మంచిది. అంతేకాకుండా ఈ రంగులు ఎక్కువ సేపు చర్మంపై ఉంటే ఎలర్జీ వచ్చే అవకాశం ఉంది. అందువలన వీలైనంత త్వరగా రంగును కడిగేసుకోవాలి. జాగ్రత్తలు తీసుకుని పండుగను జరుపుకుంటే 'హోలీడే' జాలీడేగా సంతోషాన్ని నింపి, మనసుకు కొత్తవసంతాన్ని ఇస్తుంది.







ధర్మం.. విజయం సాధించిన రోజు

రాక్షసులకు రాజైన హిరణ్యకశిపుడు వరగర్వంతో దేవతలను పీడిస్తుంటాడు. అతనికి శ్రీమహావిష్ణువు అంటే పరమవైరం. అతని కుమారుడు ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు. నిరంతరం విష్ణు నామస్మరణతో ఉన్న కుమారుడిని చూసి హిరణ్యకశిపుడు, విష్ణువు పేరు తన కుమారుడి చేత పలకటం మాన్పించాలని అనేకవిధాలు ప్రయత్నిస్తాడు. కఠినమైన శిక్షలను సైతం విధిస్తాడు. ఆఖరుకి తన చెల్లెలైన హోలిక ఒడిలో ప్రహ్లాదుడిని కూర్చోబెట్టి మంటలను వెలిగిస్తాడు. మంటలు ఎగసే సమయానికి ప్రహ్లాదుడు విష్ణుమూర్తిని ప్రార్థిస్తాడు. హోలిక ఆ మంటల్లో కాలిపోయి, ప్రహ్లాదుడు రక్షింపబడతాడు. అందుకే ఈ పండుగకు హోలీ అనేపేరు వచ్చిందని చెబుతారు. హోలిక మంటల్లో కాలిదహనమవటానికి గుర్తుగా కొంతమంది ఫాల్గుణ పౌర్ణమికి ముందురోజు తమ ఇళ్లముందు భోగిమంటలు వేస్తారు. ఇక మానవులచేత కానీ, దేవతల చేత కానీ, జంతువుల చేతకానీ, భూమిమీద కానీ, ఆకాశంలో కానీ చావు లేకుండా వరం పొందిన హిరణ్యకశిపుడిని ఈ పౌర్ణమి రోజునే శ్రీమహావిష్ణువు నరసింహావతారంలో చంపుతాడు. ఆ విధంగా ఈ హోలీ పండుగ అధర్మాన్ని అంతం చేసిన రోజుగా కూడా పురాణప్రతీతి.

వైభవంగా నిర్మమహేశ్వరుని తెప్పోత్సవం

పొదిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : దక్షిణకాశీగా పేరొందిన పొదిలిలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి తెప్పోత్సవం గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. దేవాలయ అధికారులు భారీ ఏర్పాట్ల మధ్య తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి దేవస్థాన చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ఆలయ ఈవో నర్రా నారాయణరెడ్డిల ఆధ్వర్యంలో తొలిసారిగా అంగరంగ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. ఉభయదాతలుగా గునుపూడి భాస్కర్, గునుపూడి చెంచుసుబ్బారావు, గునుపూడి మధుసుధనరావు, పేర్ల శ్రీనివాసరావు బ్రదర్స్ ఆధ్వర్యంలో పుష్కరిణిలో మాహాసంప్రోక్షణ చేశారు. పుష్కరిణిని ఎంతో అందంగా అలంకరించి విద్యుత్ దీపాల అలంకరణలో పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి తెప్పపై ఉంచారు.

50 ఏళ్ల తరువాత నిర్వహణ

50 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్నపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి అమ్మవార్లతో తెప్పోత్సవాన్ని చూడటానికి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో కోనేరు దగ్గరకు వచ్చి స్వామిని దర్శించుకొని తెప్పోత్సవాన్ని తిలకించారు. పుష్కరిణిలో మోటార్లద్వారా నీటిని నింపి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పగటిపూట ట్రయిల్ వేశారు. 50ఏళ్లలో తెప్పోత్సవాన్ని నిర్వహించిన దాఖలు లేక పోవడం ఈఏడాది నిర్వహించడంతో ప్రజలు, భక్తులు ఆనందం వెలిబుచ్చుతున్నారు. తెప్పపై ఉంచిన స్వామివార్లకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి పూజలు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు.



తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామివార్లు

సంతనూతలపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) సంతనూతలపాడు లోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభించారు. తొలిరోజు స్వామవార్లను పరాంకుశం ప్రసాద్‌చార్యులు, పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. మూడురోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరాయకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : టైలరింగ్‌పై ఆసక్తి ఉన్న బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులానికి చెందిన మహిళలు టైలరింగ్ శిక్షణకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జయమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మండలంలో 135 మందికి ట్రైనింగ్ ఇచ్చి అనంతరం కుట్టు మిషన్లు ఉచితంగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులానికి చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకొనే మహిళలు కులధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలని కోరారు.

గోనె సంచులు మాత్రమే ఉపయోగించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), మార్చి13(ఆంధ్రజ్యోతి): ప్రజలు పాస్టిక్ కవర్లను విడనాడి గోనె సంచులు మాత్రమే వాడాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు కోరారు. ఈ మేరకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. గురువారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, వాటిని పూర్తిగా నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు గ్రామాల్లో ఈనెల 15వ తేదీన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవో ఆర్డీ బాలచెన్నయ్య పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మద్దిపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శివారామయ్య అన్నారు. గురువారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి నూతన వాహన చట్టం అమల్లోకి వచ్చిందని, దాని ప్రకారం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని లేకపోతే జరిమానా విధిస్తామన్నారు. బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి సైతం హెల్మెట్ ఉండాలని, కొత్త వాహన చట్టంపై మండల వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి


మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీస్టడీ సర్కిల్‌లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి అంజల ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మొల్లమాంబ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు కెనాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు డాక్టర్ సుబ్బయ్య, పేరాల చెన్నకేశవులు, శ్రీనివాసులు, ఎ.గంగాధర్, మొగిలిచర్ల సుబ్బారావు, దండు రామాంజనేయులు, దండు శ్రీనివాసులు, కానుగుల నాగేశ్వరరావు, వెంకటరాయలు, తాళ్ళూరి సిద్ధయ్య, డి.మహాలక్ష్మమ్మ, చింతగుంట రమణమ్మ పాల్గొన్నారు.

25 మంది ఎస్ఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల చైర్మన్ యల్లటూరి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎడిగ్లోబ్ అనే కంపెనీ ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. కంపెనీ ప్రతినిధులు ఈశ్వరి, రీతు, ఆకాంక్ష, సుభాని ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.4లక్షల నుంచి రూ.5.5 లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి డిగ్రీతో పాటు ఉద్యోగ కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

పశువులకు గాలికుంటు టీకాలు


టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఒంగోలు(రూరల్), మార్చి13(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలని కరవది పశువైద్యశాల డాక్టర్ కాట్రగడ్డ లక్ష్మయ్య కోరారు. గురువారం ఒంగోలు మండలం వలేటివారిపాలెం గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వల్ల పశువులకు జ్వరం, నీరసంతో ఇబ్బందిపడతాయని, పాడిపశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందని చెప్పారు. కొన్నిసారు పశువులు మృతి చెందే అవకాశం ఉందన్నారు. అందువల్ల పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యసహాయకులు ఆర్.ఆషా, డి.సునీత, జుబెర్, డి.శశికిరణ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

సంతనూతలపాడు, మార్చి 13: సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ హౌసింగ్ డీఈ చెన్నరాయుడు, ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షతన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. 2019-24 సంవత్సరంలో నిలిచిపోయిన గృహాలకు సంబంధించి ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలను కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఇళ్లనిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరంలో ఆగని ఆక్రమణలు

ఐడీఎస్ఎంటీ స్థలాల్లో అనుమతి లేకుండా దుకాణాలు ● వెంగముక్కలపాలెం రోడ్డులోనూ అదే తీరు ● పట్టించుకోని టౌన్ ప్లానింగ్


ఐడీఎస్ఎంటీ లేఅవుట్‌లలో అనుమతులు లేకుండా నిర్మించిన షాపులు


వెంగముక్కలపాలెం వెళ్ళే మార్గంలో రోడ్డు వెంట నిర్మించిన దుకాణాలు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆక్రమణలపై కార్పొరేషన్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సైడు కాలువలను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను ఇటీవల తొలగించగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికారుల ఆదేశాలను ఆక్రమణదారులు లెక్కచేయడం లేదు. తమకున్న పలుకుబడితో ఇష్టారాజ్యంగా షాపులు నిర్మించి వేల రూపాయలకు అద్దెకు కేటాయిస్తున్నారు. ఈక్రమంలోనే స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఐడీఎస్ఎంటీ లేఅవుట్‌లలో ఇటీవల ప్లాటులు కొన్న యజమానులు నిర్మాణాలు చేపడుతుండగా, మరోవైపు ఆ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ రంగం విస్తరించింది. దీంతో హౌసింగ్ బోర్డు కాలనీలో భూములకు మరింత విలువ పెరగడంతో ఆక్రమణదారులు కన్ను ఖాళీ స్థలాలపై పడింది. డ్వామా కార్యాలయానికి వెళ్ళే దారిలో సైడు కాలువను సైతం ఆక్రమించి మూడు దుకాణాలు నిర్మించడం కాలనీలో చర్చనీయాంశమైంది. కార్పొరేషనకు చెందిన మెయిన్ డ్రైన్‌ను సైతం మాయం చేసి దుకాణాలు నిర్మించడంపై అక్కడి ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా, దక్షిణ బైపాస్‌జంక్షన్, వెంగముక్కల గ్రామం వెళ్ళే రోడ్‌లో జోరుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ప్రత్యేకించి ఇరిగేషన్ కాలువ సైతం ఆక్రమించి పట్టాలు పుట్టించి నిర్మాణాలు చేపట్టారు. వాటిని వ్యాపార దుకాణాలుగా మార్చేశారు. ఇక రవాణాశాఖ కార్యాలయం ఎదురు ఇదే తరహాలో ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నా అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారుల ఉదాసీనతతో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నగరంలో రోడ్డులను ఆక్రమించి నిర్మిస్తున్న వాటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలి

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న


మాట్లాడుతున్న ఆర్డీవోలక్ష్మీ ప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఒంగోలు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలలో సమస్యలు, ఓటర్ల జాబితాలలో తప్పులు సరిచేయడం, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందువ్ల రాజకీయ పార్టీల నుంచి ఇందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అనంతరం అంశాల వారీగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో కృష్ణారావు, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, కొత్తపట్నం తహసీల్దార్ పిన్నిక మధుసూదన్, డీటీ సలోమి, రాజకీయ పార్టీల నాయకులు స్వరూప్, డీఎస్.క్రాంతికుమార్, ఎస్‌కే.రసూల్, రమేష్, బి.రాజశేఖర్, రాయపాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలి

చీమకుర్తి: స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.వరకుమార్ కోరారు. నియోజకవర్గస్థాయి రాజకీయపార్టీలు, అధికారుల సమావేశాన్ని గురువారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను తయారీకి అందరూ సహకరించాలని కోరారు. పోలింగ్‌స్టేషన్లలో సమస్యలు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వినతిపత్రాలు అందిస్తే పరిశీలిస్తామని చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయుటతో పాటు సమావేశంలో తహసీల్దార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పులు, సవరణలు చేసుకోవాలి

కొండపి: ఓటర్లు కొత్తవారు ఓటుహక్కు కోసం, మార్పులు, తొలగింపులు, తప్పుల సవరణల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కొండపి నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్ సూచించారు. గురువారం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200 కన్నా ఎక్కువ ఓట్లు ఉన్న కేంద్రాలను గుర్తించాలని తహసీల్దార్‌లకు సూచించారు. ఒకే ఇంట్లో ఉన్న ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉన్నా ఓటరు లిస్టులో వేరేవేరు చోట ఉన్నాయని వాటిని సరిచేయాలని పలువురు సూచించారు.


కొండపిలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో కుమార్

కొత్త ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

● సీపీఎం నాయకుల డిమాండ్


సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు


మద్దిపాడు ఎస్సీకాలనీలోని మురుగును పరిశీలిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న పాత ఫిల్టర్ బెడ్‌ను మరమ్మతులు చేయడంతోపాటు కొత్త ఫిల్టర్‌బెడ్‌ను ఏర్పాటు చేసేలా నగర పాలక సంస్థ చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజాచైతన్యయాత్రలో భాగంగా గురువారం రాజాపానగల్‌రోడ్డు, గద్దలగుంట, మామిడిపాలెం, సీతారాంపురం, జక్కరయ్య కాలనీ, యానాది కాలనీ, కొండమిట్ట ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతో పాటు ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించారు. 57ఏళ్ళ క్రితం ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేయడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయా కాలనీల్లోని ప్రజలను అడిగి సమస్యలను తీసుకున్నారు వాటిని వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.రమేష్, బి.రఘురాం, తంబి శ్రీనివాసులు, బీవీ.రావు, ఎస్‌డీ.హుస్సేన్, మహేష్, షేక్ అమీర్, సీహెచ్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను కల్పించాలి

మద్దిపాడు: దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి కోరారు. గురువారం మద్దిపాడులోని దళితకాలనీని ఆ పార్టీ నాయకులు సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కనపర్తి సుబ్బారావు, ఖాసిం, ఉబ్బా వెంకటేశ్వర్లు, కాకుమాను సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టివేత


అధికారులు సీజ్ చేసిన బియ్యం లారీ

నాగులుప్పలపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంబడించి పట్టుకొన్న సంఘటన ఒంగోలు-చీరాల జాతీయ రహదారిపై గల త్రోవగుంట వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ గురువారం ఉదయం చదలవాడ వద్ద తనిఖీలు చేపట్టారు. చీరాల నుంచి నెల్లూరుకు రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ ఆపకుండా వెళ్లగా దానిని వెంబడించి త్రోవగుంట వద్ద పట్టుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా గోతాలు మార్చని రేషన్ బియ్యం ఉండటంతో అక్కడి నుంచి ఒంగోలు ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. లారీలో 624 బస్తాలు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు డీటీ రాజ్యలక్ష్మి తెలిపారు

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్ట్

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీరాం తెలిపారు. మండలంలోని యర్రబల్లిలో ఈనెల 11వ తేదీ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతనినుంచి 19 బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. విచారణ అనంతరం కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

కొండపి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహాలను వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి పూర్తి చేయించాలని కలెక్టర్ అన్సారియా సూచించారు. ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద ఎస్సీ, బీసీలకు, ఎస్టీలకు అదనంగా ప్రభుత్వం ఆర్థిక సాయం పెంచిన విషయాన్ని లబ్ధిదారులకు చెప్పి త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీలో కొండపి ఎంపీడీవో రామాంజ నేయులు, ఎన్టీఆర్ హౌసింగ్ కొండపి ఏఈ వెంకటస్వామి, పొన్నలూరు ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇం జనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన గురువారం కనిగిరిలో జరిగింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన రవితేజ (32), కనిగిరి ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. యువతి కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించడంతో రవితేజకు తెలిపింది. దీంతో మద్యం సేవించి కత్తితో చేతిని కోసుకోవడంతో కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోసారి తన చేయి కోసుకోవడంతో పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లిన రవితేజ మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

ఆటో డ్రైవర్‌పై మందుబాబుల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపి

ఒంగోలు క్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌పై ఇరువురు వ్యక్తులు మద్యం మత్తులో దాడి చేసిన ఘటన ఒంగోలు నగరం 60 అడుగుల రోడ్డులో గురువారం జరిగింది. సంతపేటలో నివాసం ఉంటున్న కాలువ గోపి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు, ఆయన తన ఆటోను 60 అడుగులరోడ్డులో పక్కన పెట్టి తన పని మీద వెళ్లి వచ్చే సరికి ఇరువురు వ్యక్తులు ఆటోలో కూర్చోని మద్యం తాగుతున్నారు. వారిని దిగాలని గోపి కోరగా మద్యం తాగుతున్న ఇరువురు వ్యక్తులు గొడవపడి ట్యూబులైట్‌తో కొట్టడంతో అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే గోపి చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరి అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


విహరిస్తున్న లక్ష్మీతిరుపతమ్మ ఉత్సవ విగ్రహం

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

చీమకుర్తి, మార్చి13(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పట్టణంలోని దిన్నేపురంలో వేంచేసి ఉన్న లక్ష్మీతిరుపత మ్మ ఆలయంలో తిరునాళ్ల మహోత్సవం కనులపం డువగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి లక్ష్మీతి రుపతమ్మ ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. శుక్రవారం ఆలయంలో పొంగళ్లు నిర్వహించనున్నారు.

16న మాలల సాంస్కృతిక కళాజాత

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయ కళలపై ఆధారడి జీవిస్తున్న కుటుంబాలకు పక్కా ఇళ్ళు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ ఈనెల 16వతేదీన ఒంగోలులో మాలల సాంస్కృతిక కళాజాతలను నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు తెలిపారు గురువారం స్థానిక అర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మాల కుటుంబాలు హిందూ సంప్రదాయ కళలపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి వారికి ప్రభుత్వం నుంచి ఆదరణ లభించడం లేదన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒంగోలులో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 16వతేదీ సాయంత్రం నాలుగు గంటలకు నెల్లూరు బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ కళా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వేమా యల్లయ్య ట్రస్టు చైర్మన్ వేమా శ్రీనివాసరావు, దళితసంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ మురళీమోహన్, వేముల బాబు డానియేలు, వేమా బాలకోటి, మట్టిగుంట రామాంజి, చప్పిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విద్య, ఉపాధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రకాశం జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి విద్య, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర సామాజిక న్యాయ, సాధికార శాఖ సహాయమంత్రి బీఎల్‌వెర్మ సమాధానం ఇస్తూ దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో నాలుగుశాతం, ప్రభుత్వ ఉన్నత విద్యాలయాల్లో ఐదుశాతం, పేదరిక నిర్మూలన- అభివృద్ధి పథకాలలో ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించినట్లుతెలిపారు. దివ్యాంగుల ఉపశమనం రాష్ట్రాల అంశమైనా, కేంద్రం దీనదయాల్ దివ్యాంజన్ రిహాబిలిటేషన్ స్కీం కింద గత ఐదేళ్ళలో ప్రకాశం జిల్లాలో 3,157 మందికి రూ.15.60 లక్షలు ఇవ్వడం జరిగిందని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

ఆస్తి పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల నుంచి 15శాతం పెంచనున్న ఆస్తిపన్నును ఉపసంహరించుకోవాలని పట్టణ పౌరసంఘాల సమాఖ్య జిల్లా నాయకుడు చీకటి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మునిసిపల్ సవరణ చట్టం 44/2020 రద్దు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 0.25శాతం అదనపు అప్పుకు అనుమతి పొందడం కోసం ఈ చట్ట సవరణ చేశారని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. బర్లీ పొగాకు ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత ఏడాదితో పోల్చితే సగానికి సగం తగ్గిన ధరలతో బర్లీ పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించేలా చూడాలని ఆయన కోరారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఒంగోలు విద్య, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం, పైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.కళ్యాణి గణిత శాస్త్రం, భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్, ఖగోళశాస్త్రం, కంప్యూటరింగ్ వంటి రంగాల్లో పై ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గణిత విభాగం ఇన్‌చార్జి కెజియా, బి.శ్రీవాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ఒంగోలు కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినియోగదారుల దినత్సోవం వారోత్సవాలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోల్ కలాం ప్రకాశం ఆధ్వర్యంలో గురువారం న్యాయ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక ఇందిరాప్రియదర్శిని న్యాయ కళాశాలలో వినియోగదారుల హక్కులను కాపాడటంలో న్యాయస్థానాల పాత్ర అంశంపై ఈ పోటీ జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ప్రముఖ విద్యావేత్త డాక్టక్ షాకీర్, విశ్రాంత పోలీస్ అధికారి సుంకర సాయిబాబా, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ మాజీ అధ్యక్షులు మహంకాళి వెంకట శేషయ్యలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రతి న్యాయ విద్యార్థి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నటరాజ్, కరస్పాండెంట్ రామకృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

మద్దిపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సెంటరులోని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను గురువారం పంచాయతీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌కవటేర్ సాయంతో కాలువలో పూడిక తీ పనులు చేపట్టగా మంచినీటి పైపును తగలటంతో ఒక్కసారిగా నీరు పైకి వెదజల్లింది. దీంతో పనులు నిలిపివేశారు. తాగునీరు పైపు పగిలిపోవడంతో తాగునీటికి ఆటంకం కలుగుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పైప్ లైన్ బాగుచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, సిబ్బంది

మద్దిపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి గ్రామంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని గురువారం ఒంగోలు రిమ్స్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు రాజులమెట్టలోని అంగన్‌వాడీ విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. కిడ్నీలు సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుమిత్రాదేవి, అధ్యాపకులు మారుతి, వరలక్ష్మి, ఫాతిమా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

బిజినెస్

ఒంగోలు ● శుక్రవారం 14 మార్చి 2025



హల్దీరామ్స్‌లో టెమాసెక్‌కు 10% వాటా

- రూ.8,500 కోట్లకు కొనుగోలు
- దేశీయ ప్యాక్డ్ ఫుడ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద డీల్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ప్యాక్డ్ స్నాక్ అండ్ స్వీట్స్ కంపెనీ, రెస్టారెంట్ల ఆపరేటర్ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో 10 శాతం వాటాను సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడి సంస్థ టెమాసెక్ కొనుగోలు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం ఈ నెల 11న (మంగళవారం) కుదిరినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా హల్దీరామ్ స్నాక్ ఫుడ్ మార్కెట్ విలువను 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.85,000 కోట్లు)గా లెక్కగట్టినట్లు సమాచారం. అంటే, సంస్థలో 10 శాతం వాటా కోసం టెమాసెక్ 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) చెల్లించనుంది. దేశీయ ప్యాక్డ్ ఫుడ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకిదే అతిపెద్ద వాటా కొనుగోలు ఒప్పందం. అంతేకాదు, హల్దీరామ్ ప్రమోటర్లైన అగర్వాల్ కుటుంబం ప్రస్తుతం సంస్థలో 100 శాతం వాటా కలిగి ఉంది. అగర్వాల్ కుటుంబం వాటా విక్రయించడం ఇదే తొలిసారి. వ్యాపార విస్తరణకు నిధులు సమీకరించేందుకు సంస్థలో వాటా విక్రయించాలని అగర్వాల్ ఫ్యామిలీ గత కొన్ని నెలలుగా బ్లాక్‌స్టోన్, ఆల్ఫావేవ్, బెయిన్ క్యాపిటల్ సహా పలు ఇన్వెస్టర్లతో సంప్రదింపులు సాగించింది. గతంలో మెజారిటీ వాటా విక్రయం కోసం ప్రయత్నించినప్పటికీ మైనారిటీ వాటా ఉపసంహరణతో సరిపెట్టుకుంది.

మరో 5 శాతం వాటా విక్రయం!?

అగర్వాల్ కుటుంబం కంపెనీలో మరో 5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నదని, ఇందుకోసం ఇతర ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌తో పాటు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అంతేకాదు, నిధుల సమీకరణ కోసం హల్దీరామ్ వచ్చే ఏడాది ఐపీఓకు సైతం వచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

1937లో ప్రారంభం: హల్దీరామ్స్ 1937లో రాజస్థాన్‌లోని బికనేర్‌లో కేవలం మిఠాయిలు, చిరుతిళ్ల విక్రయ కొట్టుగా ప్రారంభమైంది. గంగ బిషన్ అగర్వాల్ దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సంస్థగా అవతరించింది. హల్దీరామ్స్ ఉత్పత్తులను ప్రస్తుతం భారత్‌లోనే కాదు, 80కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నారు. 2023-24లో కంపెనీ రూ.12,500 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసింది.

2028 నాటికి భారత్ @3

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే చాన్స్ ● మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5.7 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.495 లక్షల కోట్లు) చేరుతుందని అంతర్జాతీయ ఆర్థిక సర్వీసుల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. 2023లో 3.5 లక్షల కోట్ల డాలర్లున్న భారత ఆర్థిక వ్యవస్థ 2026 నాటికి 4.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని, ఫలితంగా అమెరికా, చైనా, జర్మనీ తర్వాతి స్థానంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని పేర్కొంది.

అత్యంత ఆకర్షణీయ వినియోగ మార్కెట్‌గా మారడం, ప్రపంచ ఉత్పాదకతలో తన వాటా పెంచుకోవడం, విధానపరమైన మద్దతుతో సాధించిన స్థూల ఆర్థిక స్థిరత్వం, మెరుగైన మౌలిక వసతులు ఇందుకు కారణమని తాజా నివేదికలో తేల్చి చెప్పింది. 1990లో 12వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2000 నాటికి 13వ స్థానానికి దిగజారింది. ఆ తర్వాత తిరిగి పుంజుకుని 2020 నాటికి 9వ స్థానానికి, 2023 నాటికి ఐదో స్థానానికి చేరింది. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా ప్రస్తుతం 3.5 శాతం ఉండగా 2029 నాటికి 4.5 శాతానికి చేరుతుందని తెలిపింది.



మరో పావు శాతం రెపో కోత ఖాయం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) క్రమంగా ద్రవ్య విధానంపై పట్టు సడలిస్తోందని పేర్కొంటూ ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినందు వల్ల ఏప్రిల్ సమీక్షలో రెపో రేటును మరో 0.25% తగ్గించవచ్చని పేర్కొంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును ఒక పావు శాతం తగ్గించిన సంగతి తెలిసిందే.

వృద్ధి గమనంలో మూడు ధోరణులు

భారత వృద్ధి గమనాన్ని మూడు ధోరణులుగా మోర్గాన్ స్టాన్లీ వర్గీకరించింది. ఒకటి బేర్, రెండోది బేస్, మూడోది బుల్ దశ. బేర్ దశలో అయితే ప్రస్తుతం 3.65 లక్షల కోట్ల డాలర్లున్న ఆర్థిక వ్యవస్థ 2035 నాటికి 6.6 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంది. అదే బేస్ దశలో అయితే 8.8 లక్షల కోట్ల డాలర్లకు, బుల్ దశలో అయితే 10.3 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని జోస్యం చెప్పింది. 2025లో 2,514 డాలర్లున్న తలసరి జీడీపీ సైతం బేర్ దశలో 4,247 డాలర్లకు, బేస్ దశలో 5,683 డాలర్లకు, బుల్ దశలో 6,706 డాలర్లకు చేరవచ్చని అంచనా వేసింది.

ఈ ఏడాది వృద్ధి 6.3%

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.3%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధి సాధించవచ్చని అంచనా వేసింది. గత కొద్ది వారాల్లో ప్రధాన ఆర్థిక సూచీల కదలికలు మిశ్రమంగా ఉన్నప్పటికీ రెండు నెలల క్రితం పరిస్థితి కన్నా చాలా మెరుగ్గా ఉన్నట్టు పేర్కొంది. రాబోయే కాలంలో రికవరీ విస్తృత స్థాయిలో ఉంటుందని, బడ్జెట్లో ప్రకటించిన ఐటీ కోతలు పట్టణ డిమాండ్‌ను పెంచుతాయని పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వ, గృహ రంగాల్లోని పెట్టుబడులు వృద్ధికి ఊతం ఇస్తున్నాయంటూ కార్పొరేట్ పెట్టుబడులు కూడా క్రమంగా పుంజుకుంటున్నట్టు తెలిపింది.

ట్రంప్ సుంకాలతో ఫార్మాలో అనిశ్చితి

అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలతో భారత ఫార్మా కంపెనీలూ బెదిరిపోతున్నాయి. ఈ హెచ్చరికలతో ఫార్మా రంగంలో ప్రస్తుతం ఔనన్నా కాదన్నా అనిశ్చితి నెలకొందని అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్ 'ఈటీ నౌ' బిజినెస్ న్యూస్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే అమెరికాతో పాటు ఇతర దేశాల మార్కెట్లపైనా దృష్టి పెడుతున్నందున ఈ ప్రభావం తమ కంపెనీపై పెద్దగా ఉండకపోవచ్చన్నారు. తమ ఎగుమతుల్లోని టాప్ 10 ఔషధాల్లో అమెరికా వాటా 20 శాతానికి మించిలేదన్నారు. కాబట్టి ట్రంప్ సర్కార్ సుంకాలు పెంచినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండక పోవచ్చన్నారు.

వృద్ధి ఒక్కటే లక్ష్యం కాదు: వృద్ధి ఒక్కటే తమ కంపెనీ లక్ష్యం కాదని సంతానం స్పష్టం చేశారు. వృద్ధితో పాటు సుస్థిర లాభాలు, టర్నోవర్‌పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. వ్యాపార విస్తరణ కోసం ఇంజెక్టబుల్స్, పెప్టైడ్స్, బయోసిమిలర్స్‌పైనా దృష్టి పెట్టినట్టు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) రెండో త్రైమాసికంలోగా బయోసిమిలర్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని సంతానం చెప్పారు.

జెనరేటివ్ ఏఐతో బ్యాంకింగ్‌కు మేలే

న్యూఢిల్లీ: జెనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) భారత బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలను కూడా షేక్ చేస్తోంది. దీని వినియోగంతో 2030 నాటికి ఫైనాన్షియల్ రంగం ఉత్పాదకత 34 నుంచి 38 శాతం, బ్యాంకింగ్ రంగం ఉత్పాదక 46 శాతం మేర పెరగనుంది. ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఖర్చులు తగ్గించుకుని, ఉత్పాదకత పెంచుకునేందుకు అనేక ఆర్థిక సేవల కంపెనీలు ప్రస్తుతం పెద్దఎత్తున జెన్ ఏఐ బాట పడుతున్నాయి. దీంతో ఆ కంపెనీల కస్టమర్ ఎంగేజ్‌మెంట్, నిర్వహణా సామర్థ్యం, నష్ట భయం (రిస్క్) మదింపు సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయి. ఆర్థిక సేవలు, రిటైల్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఆటోమోటివ్, పరిశ్రమలు, ఇంధన రంగాలకు చెందిన 125 మంది కీలక అధికారులను సంప్రదించి ఈవై ఈ నివేదిక రూపొందించింది.

రికార్డు గరిష్ఠానికి బంగారం

రూ.89,450కి పెరిగిన 10 గ్రాముల ధర

న్యూఢిల్లీ: దేశీయంగా పసిడి ధర గత రికార్డు గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.600 పెరుగుదలతో రూ.89,450కి చేరుకుంది. గత నెల 20న మేలిమి బంగారం ఇదే ధర పలికింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం విషయానికొస్తే, రూ.600 పెరిగి రూ.89,050కి ఎగబాకింది. ఇక కిలో వెండి మరో రూ.1,000 మేర ప్రియమై దాదాపు ఐదు నెలల నాటి గరిష్ఠ స్థాయి రూ.1,01,200కు చేరింది.

జానకి పులపర్తికి ఫోర్బ్స్ అండర్ 40 లీడర్స్ పురస్కారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఐ ఆధారిత డ్రోన్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా ఉన్న అకిన్ అనలిటిక్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ జానకి పులపర్తి 2025 సంవత్సరానికి ఫోర్బ్స్ 40 అండర్ 40 లీడర్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. టెక్నాలజీ పట్ల ఆసక్తి గల బాలిక స్థాయి నుంచి డీప్ టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆమె ఎదిగిన తీరుకు ఈ పురస్కారం ఒక గుర్తింపుగా భావించవచ్చు. 2022లో అకిన్ టెక్నాలజీస్‌ను ప్రారంభించిన ఆమె.. సైనికులను క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసే 125 గ్రాముల బరువుండే నానో రెకాన్ డ్రోన్‌ను అందించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నమో డ్రోన్ దీదీ కార్యక్రమానికి ఉత్తేజితురాలై గ్రామీణ రైతులకు సహాయపడేందుకు ఏఐ ఆధారిత డ్రోన్ స్ప్రేయింగ్ వ్యవస్థను అందించారు.

సెన్సెక్స్ ఐదో రోజూ డౌన్

200 పాయింట్లు నష్టపోయిన సూచీ

ముంబై: స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. రియల్టీ, ఐటీ, ఆటో రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ మరో 200.85 పాయింట్లు కోల్పోయి 73,828.91 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది ఐదో రోజు. నిఫ్టీ విషయానికొస్తే, 73.30 పాయింట్లు క్షీణించి 22,397.20 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 8 రాణించగా.. 22 నష్టపోయాయి. జొమాటో షేరు 1.97 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.95 శాతం వరకు తగ్గాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అర శాతానికి పైగా పెరిగాయి.

ఎల్‌జీ రూ.15,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీకి భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాలో 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృసంస్థ విక్రయించనుంది. తద్వారా రూ.15,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

యూపీఎస్ఐ పరిధి పెంపు — సెబీ

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ.. షేర్ల ధరలను ప్రభావితం చేయగలిగే అప్రకటిత సమాచారం (యూపీఎస్ఐ) పరిధిని మరింత విస్తరించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 11న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. ఏదైనా ప్రతిపాదిత నిధుల సమీకరణ కార్యకలాపాలు, ఈఎస్‌జీ రేటింగ్ మినహా ఇతర క్రెడిట్ రేటింగ్ సవరణ, యాజమాన్యం లేదా కంపెనీ నియంత్రణను ప్రభావితం చేసే ఒప్పందాలు, కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో పరిష్కార ప్రణాళికకు ఆమోదం, వన్‌టైం బ్యాంక్ సెటిల్‌మెంట్, రుణాల పునర్‌వ్యవస్థీకరణ, బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ సమాచారం కూడా యూపీఎస్ఐ పరిధిలోకి వస్తాయి. కాబట్టి, కంపెనీలు ఈ సమాచారాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెంటనే వెల్లడించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు జూన్ 10 నుంచి అమలులోకి వస్తాయని సెబీ స్పష్టం చేసింది.

నేడు మార్కెట్లకు సెలవు

హోలీ పండగ సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. సోమవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	390
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	84
కర్నూలు	78	నెల్లూరు	89
విశాఖపట్నం	79	అనంతపురం	89
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,580 ▲	81,200 ▲	1,10,000 ▲
విజయవాడ	89,500 ▲	84,500 ▲	1,01,000 ▲
విశాఖపట్నం	87,080 ▲	79,820 ▲	99,150 ▼
రాజమండ్రి	88,580 ▲	81,200 ▲	1,00,700 ▲
ప్రొద్దుటూరు	88,250 ▲	81,720 ▲	99,200 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

లక్ష్య సేన్ సంచలనం



అలవోకగా క్వార్టర్స్‌కు
- వైదొలిగిన సాత్విక్ జంట
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీకి షాకిచ్చిన భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్.. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. డబుల్స్‌లో భారీ అంచనాలు పెట్టుకొన్న ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట మ్యాచ్ మధ్యలోనే రిటైరైంది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 21-13, 21-10తో వరల్డ్ నెం:2 జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై వరుస గేముల్లో సునాయాసంగా నెగ్గాడు. క్వార్టర్స్‌లో లి షి ఫెంగ్ (చైనా)తో సేన్ తలపడనున్నాడు. తొలి గేమ్ ఆరంభం నుంచే సేన్ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 4-0తో ముందంజ వేసిన భారత షట్లర్ చివరి వరకు అదే జోరుతో గేమ్‌ను దక్కించుకొన్నాడు. ఇక, రెండో గేమ్ ఆరంభంలో నువ్వానేనా అన్నట్టుగా సాగినా.. ఒక్కసారిగా పుంజుకొన్న సేన్.. ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా పదునైన స్మాష్‌లతో మ్యాచ్‌ను ముగించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్ 16-21, 13-21తో అకానె యమ గూచి (జపాన్) చేతిలో ఓడింది. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో చైనా జంట జి హో నన్-జంగ్ వి హన్‌తో మ్యాచ్‌లో 16-21, 2-2తో వెనుకంజలో ఉన్న సమయంలో సాత్విక్-చిరాగ్ ద్వయం వైదొలిగింది. చిరాగ్‌కు వెన్నునొప్పి తిరగబెటడంతో మధ్యలోనే భారత జంట రిటైరైంది. తొలి రౌండ్‌లో డెన్మార్క్ జంట డేనియల్-మ్యాడ్స్‌పై సాత్విక్ జంట 21-17, 21-15తో గెలిచింది. మిక్స్‌డ్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని ద్వయం 10-21, 12-21తో చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జీ-వి య జిన్ చేతిలో పరాజయం పాలైంది.

'హార్దిక్ గొప్ప ఆల్‌రౌండరేమీ కాదు'



న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా భారత జట్టు విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీలోనూ బ్యాట్, బంతితో సత్తా చాటాడు. పాకిస్థాన్ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్..హార్దిక్ నైపుణ్యాలను మెచ్చుకొంటూనే.. అతడు మాల్కం మార్షల్, వకార్ యూనిస్ స్థాయి బౌలర్ కాదని అభిప్రాయపడ్డాడు. కాగా..హార్దిక్ కన్నా తమ ఆటగాడు అబ్దుల్ రజాక్ మెరుగైన ఆల్‌రౌండర్ అని మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ అన్నాడు.

మతం మారనందుకే.. కెరీర్ నాశనం!



- పాక్ మాజీ క్రికెటర్ కనేరియా

న్యూయార్క్: పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌లో తాను ఎదుర్కొన్న వివక్ష గురించి ఆదేశ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా (44) సంచలన విషయాలు బయటపెట్టాడు. మతం మారనందుకే తన కెరీర్‌ను నాశనం చేశారని ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న కనేరియా వాపోయాడు. మైనారిటీగా పాక్‌లో ఎన్నో కష్టాలు, అవమానాలను ఎదుర్కొన్నానని చెప్పాడు. షాహిద్ అఫ్రీది కెప్టెన్‌గా ఉన్నప్పుడు తనను మతం మారమని తీవ్రంగా ఒత్తిడి చేసేవాడని తెలిపాడు. అయితే ఇంజమామ్ ఒక్కడే తనకు మద్దతుగా నిలిచాడన్నాడు. అఫ్రీది, షోయబ్ అక్తర్ ఎవరూ తనతో కలసి తినేవారు కూడా కాదన్నాడు. పాక్ తరఫున డానిష్ 61 టెస్టులు, 18 వన్డేలు ఆడాడు.

క్వార్టర్స్‌లో హైదరాబాద్

బీసీసీఐ మహిళల వన్డే ట్రోఫీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న బీసీసీఐ మహిళల అండర్-23 వన్డేట్రోఫీలో హైదరాబాద్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన వన్డేలో హిమాచల్‌ప్రదేశ్‌పై హైదరాబాద్ 108 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 8 వికెట్లకు 205 రన్స్ చేసింది. కెప్టెన్ మమత అర్ధ శతకం (76)తో రాణించింది. ఛేదనలో స్పిన్నర్ ధ్రుతి కేసరి (4/23) చెలరేగింది. హిమాచల్‌ప్రదేశ్ 32.4 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. ఈనెల 21వ తేదీన గువాహటిలో క్వార్టర్స్ జరగనుంది.

స్పోర్ట్స్

పారా అథ్లెట్ రవికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో పతకం లభించింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం ముగిసిన ఎఫ్ 40 విభాగం షాట్‌పుట్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారుడు ఆర్.రవి కాంస్యం సాధించాడు. డెనిస్ గ్నెజ్డిలోవ్ (రష్యా) స్వర్ణం, ఐయాల్ సివెట్సావ్ (అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ) రజతం నెగ్గారు.

నేటి నుంచి వైజాగ్ ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): సాగరతీరంలో ఐపీఎల్ సందడి మొదలైంది. ఈ ఐపీఎల్‌లో విశాఖపట్నం రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుండడం తెలిసిందే. ఈనెల 24 రాత్రి 7.30 గంటలకు విశాఖలో జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)-లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మ్యాచ్ టిక్కెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌లో విక్రయించనున్నారు. ఈ సీజన్‌లో ఢిల్లీ తమ తొలి మ్యాచ్‌ను విశాఖలోనే ఆడనుంది. ఈనెల 30వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనున్న రెండో మ్యాచ్ టిక్కెట్లను ఎప్పటి నుంచి విక్రయించనున్నారో డీసీ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

ఢిల్లీ.. కాచుకో

- ఫైనల్లో ముంబై ఇండియన్స్
- సివర్, మాథ్యూస్ హాఫ్ సెంచరీలు
- ఎలిమినేటర్‌లో గుజరాత్ చిత్తు
- మహిళల ప్రీమియర్ లీగ్



హేలీ మాథ్యూస్ (77 పరుగులు, 3 వికెట్లు)



నాట్ సివర్ (77)

ముంబై: అదిరే ఆటతో ముంబై ఇండియన్స్ మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో ప్రవేశించింది. గురువారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో విజృంభించిన హర్మన్ సేన 47 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. దీంతో శనివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు సాధించింది. నాట్ సివర్ (41 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 77), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77), కెప్టెన్ హర్మన్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 36) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. గిబ్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో 166 పరుగులకు కుప్పకూలింది. గిబ్సన్ (34), లిచ్‌ఫీల్డ్ (31), భారతి (30) మాత్రమే రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాథ్యూస్‌కు మూడు, అమెలియాకు రెండు వికెట్లు దక్కాయి.

నిలకడలేమితో..: భారీ ఛేదనలో గుజరాత్ పూర్తిగా తేలిపోయింది. ముంబై బౌలర్ల జోరుకు ఓపెనర్ బెత్ మూనీ (6), హర్లీన్ (8), కెప్టెన్ గార్డ్‌నర్ (8) తొలి ఆరు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడం ప్రభావం చూపింది. అయితే మరో ఓపెనర్ గిబ్సన్‌తో పాటు మిడిలార్డర్‌లో భారతి పుల్మలి, లిచ్‌ఫీల్డ్ వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ సరైన సమయంలో వీరిని పెవిలియన్‌కు చేర్చడంలో ముంబై సఫలమైంది. 15వ ఓవర్‌లో సిమ్రన్ 4,4,6.. తర్వాతి ఓవర్‌లో పుల్మలి 4,4తో గుజరాత్ 8 బంతుల్లోనే 27 పరుగులు సాధించి కాస్త ఉత్కంఠ పెంచింది. కానీ పుల్మలిని మాథ్యూస్ అవుట్ చేయడంతో ఇక జెయింట్స్ కోలుకోలేదు.

బాదుడే బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగింది. ఆరంభంలో ఓపెనర్ మాథ్యూస్-నాట్ సివర్ జోడీ.. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫినిషింగ్‌కు స్కోరు అవలీలగా 200 దాటేసింది. ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా ఈత్రయం క్రీజులో కదం తొక్కడంతో జెయింట్స్ బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దీనికితోడు ప్రత్యర్థి ఫీల్డింగ్ వైఫల్యం కూడా ముంబైకి జత కలిసింది. ఓపెనర్ యాస్తిక (15) ఐదో ఓవర్‌లో వెనుదిరిగింది. ఇక ఐదు పరుగుల దగ్గర జీవదానం లభించిన మాథ్యూస్ 8వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో బ్యాట్‌కు పనిజెప్పింది. 36 బంతుల్లోనే తను ఫిఫ్టీ పూర్తి చేయగా, సివర్ రెండు వరుస సిక్సర్లతో 29 బంతుల్లోనే ఈ ఫీట్ అందుకుంది. అలాగే 57 పరుగుల వద్ద మాథ్యూస్ రెండో క్యాచ్‌ను కూడా వదిలేశారు. ఈ చాన్స్‌తో తను 16వ ఓవర్‌లో వరుసగా 6,6,4తో 19 రన్స్ రాబట్టింది. తర్వాతి ఓవర్‌లోనే మాథ్యూస్‌ను కశ్వీ అవుట్ చేయగా, అప్పటికే రెండో వికెట్‌కు 71 బంతుల్లోనే 133 పరుగుల భాగస్వామ్యం జత చేరడం విశేషం. మరో ఎండ్‌లో హర్మన్ వచ్చీ రాగానే విరుచుకుపడింది. తనూజ ఓవర్‌లో 6,4,4,6తో ఏకంగా 22 రన్స్ సాధించింది. సివర్ 19వ ఓవర్‌లో వెనుదిరగ్గా, ఆఖరి ఓవర్‌లో హర్మన్ మరో రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించి రనౌటైంది.

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 213/4. (సివర్ 77, హేలీ మాథ్యూస్ 77, హర్మన్‌ప్రీత్ 36; గిబ్సన్ 2/40)
గుజరాత్ జెయింట్స్: 19.2 ఓవర్లలో 166 ఆలౌట్ (గిబ్సన్ 34, లిచ్‌ఫీల్డ్ 31, భారతి 30; మాథ్యూస్ 3/31, అమెలియా 2/28)

1 — డబ్ల్యూపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ముంబై ఇండియన్స్. ఓవరాల్‌గా లీగ్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు.

ఒకే సీజన్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన ప్లేయర్‌గా సివర్

భారత్.. ఒకేరోజు మూడు ఫార్మాట్లలో ఆడగలదు



సిడ్నీ: భారత క్రికెట్‌లో అద్భుత ఆటగాళ్లకు కొదవ లేదని ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ కొనియాడాడు. 'ఒకే రోజు ఆసీస్‌తో టెస్టును, ఇంగ్లండ్‌తో వన్డేను, దక్షిణాఫ్రికాతో టీ20 ఆడి పోటీనివ్వగల సత్తా భారత జట్టుకు ఉంది. ప్రపంచంలో మరే జట్టుకూ ఈ అవకాశంలేదు ఐపీఎల్ ద్వారా వారికి నైపుణ్యం కలిగిన క్రికెటర్లు లభిస్తున్నారు. అందుకే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. కానీ దుబాయ్‌లో వారికి లబ్ధి చేకూరిందని చెప్పలేం. ఎందుకంటే భారత్ మినహా ఇతర దేశాల ఆటగాళ్లు ప్రపంచంలోని అన్ని వేదికల్లో జరిగే లీగ్‌ల్లో ఆడతారు. కానీ భారత ప్లేయర్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కనిపిస్తారు' అని స్టార్క్ తేల్చాడు.

కొకైన్ కేసులో మెక్‌గిల్ దోషి



సిడ్నీ: నిషేధిత కొకైన్ సరఫరాలో పాల్గొన్నందుకు ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్‌ను న్యూసౌత్‌వేల్స్ డిస్ట్రిక్ట్ కోర్టు దోషిగా తేల్చింది. 54 ఏళ్ల మెక్‌గిల్‌కు కొకైన్ సేవించే అలవాటు ఉంది. దాదాపు రూ.2 కోట్ల విలువైన కొకైన్ మార్పిడిలో మెక్‌గిల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు వాటిని మాజీ స్పిన్నర్ ఖండించినప్పటికీ ప్రాసిక్యూషన్ తోసిపుచ్చింది. 2021నాటి ఈ కేసులో మెక్‌గిల్‌కు శిక్షను మేలో ఖరారు చేయనున్నారు.

540 కోట్ల మంది వీక్షించారు

జియో హాట్‌స్టార్ రికార్డు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీవీక్షణలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఓవరాల్‌గా టోర్నీని 540 కోట్ల మంది తిలకించినట్టు పేర్కొంది. అలాగే భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ఏకంగా 124.2 కోట్ల మంది తిలకించారని జియోస్టార్ సీఈవో పేర్కొన్నారు.

బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో వైదొలగిన ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ కఠిన చర్యలు చేపట్టింది. అతడు రెండేళ్లపాటు ఐపీఎల్ ఆడకుండా నిషేధం విధించింది. ఈ మేరకు తన నిర్ణయాన్ని బీసీసీఐ గురువారం ప్రకటించింది. అంతేకాదు..బ్రూక్‌పై చర్యల విషయాన్ని ఆ క్రికెటర్‌తోపాటు, ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డుకు కూడా తెలియజేసింది. గత ఏడాది నవంబరులో జరిగిన వేలంలో రూ. 6.25 కోట్ల ధరకు హ్యారీని ఢిల్లీ క్యాపిటల్ కొనుగోలు చేసిన విషయం విదితమే.



నాని నమ్మకం నిజమైంది

ప్రశాంతి తిపిర్నేని



'హిట్' సిరీస్ చిత్రాల నిర్మాత ప్రశాంతి తిపిర్నేని తాజా చిత్రం 'కోర్ట్'. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిర్మాత ప్రశాంతి, సహ నిర్మాత దీప్తి మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ "ఈ కథను దర్శకుడు రామ్‌జగదీశ్ చాలా బాగా రాశారు. చాలా లేయర్స్ ఉన్న ఈ సినిమా స్ర్కీన్‌ప్లే అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. పెయిడ్ ప్రీమియర్స్‌కు అద్భుత స్పందన వస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌ను ప్రేక్షకులు విపరీతంగా ఇష్టపడుతున్నారు. ప్రీమియర్స్‌కు వచ్చిన కొందరు లాయర్స్ సినిమా చాలా సహజంగా ఉందని మెచ్చుకున్నారు. సినిమాల విషయంలో నాని జడ్జిమెంట్ తప్పు కాదని 'కోర్ట్'తో మరోసారి రుజువైంది. ఇందులో ప్రియదర్శి పాత్ర ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. మంగపతిగా నటించిన శివాజీ పాత్రనూ ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. 'హిట్ 3' విడుదల తర్వాత కొత్త ప్రాజెక్ట్స్‌ను ప్రకటిస్తాం" అని అన్నారు. సహ నిర్మాత దీప్తి మాట్లాడుతూ "రామ్ జగదీశ్ మంచి ప్రతిభావంతుడు. ఈ కోర్ట్ రూమ్ డ్రామాను చాలా ఆసక్తికరంగా మలిచాడు. సినిమాలోని ప్రతీ పాత్ర గుర్తుండిపోతుంది. సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. భావోద్వేగాలు, కోర్ట్ సన్నివేశాలు, సంగీతం సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.

చాలా బాగుంది శ్రుతీ






కథానాయికగా దక్షిణాదిన సత్తా చాటిన శ్రుతీహాసన్ కొన్ని హిందీ చిత్రాల్లోనూ కనిపించారు. 'ద ఐ' చిత్రంతో ఆమె హాలీవుడ్ అరంగేట్రం చేయబోతున్నారు. ఇటీవలే చిత్ర బృందం శ్రుతి పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను షేర్ చేసిన నయనతార 'చాలా బాగుంది శ్రుతీ' అంటూ ప్రశంసించారు. ట్రైలర్‌లో శ్రుతి నటన అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. 'ద ఐ'తో హాలీవుడ్‌లో శ్రుతికి శుభారంభం దక్కాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 'ద ఐ' చిత్రాన్ని ప్రదర్శించారు. 'నా కెరీర్‌లో ఇదో డిఫరెంట్ మూవీ అవుతుంది' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మార్క్‌రౌలీ కీలకపాత్ర పోషించారు. భర్త ఫెలిక్స్ కోసం అన్వేషిస్తూ సాగించే ప్రయాణం నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో శ్రుతి డయానా అనే పాత్ర పోషించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో ఆమె నటిస్తున్నారు.



జీవితంలోనూ ఛాంపియన్



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాకు ప్రదీప్ అద్వైతం దర్శకుడు. ఇప్పటికే విడుదలైన చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. రోషన్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్‌ను పరిచయం చేశారు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా, ధైర్యంగా నిలబడడం ఆకట్టుకుంది. మైదానంలోనే కాదు జీవితంలో కూడా నిజమైన ఛాంపియన్‌గా ఎదగడానికి చేసే పోరాటంగా ఈ చిత్రం ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలిచింది. తోట తరణి కళా దర్శకత్వం ఈ చిత్రం గొప్పతనాన్ని మరింత పెంచుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్ సంస్థలు నిర్మిస్తున్నాయి.


ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాం

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రూబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, సారెగమ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ప్రేమ, స్నేహంతో పాటు కుటుంబ విలువలు కలగలసిన అద్భుతమైన కథ ఇది. కథనం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు విశ్వ కరుణ్ సినిమాలో రాసిన డైలాగ్స్, సన్నివేశాలు ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాయి. యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌కు కనెక్ట్ అయ్యే చిత్రమిది. నటుడిగా నన్ను మరో మెట్టు ఎక్కించే ఈ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకం. సినిమా తప్పకుండా అందరికీ మంచి వినోదాన్ని అందిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. దర్శకుడు విశ్వకరుణ్ మాట్లాడుతూ "మనుషుల మధ్య తగ్గిపోయిన విలువలు, బంధాలను ఈ సినిమా తిరిగి గుర్తుచేస్తుంది. మంచి లవ్‌స్టోరీతో పాటు మాస్ ప్రేక్షకులను మెప్పించే ఫైట్స్ ఇందులో ఉన్నాయి. ఈ సినిమా ట్రైలర్ చూసిన దర్శకులు పూరి జగన్నాథ్, మెహర్ రమేశ్ ఫోన్ చేసి అభినందించారు. కిరణ్‌ను కొత్తగా చూపించే చిత్రమిది" అని అన్నారు. హీరోయిన్ క్యాతీ డేవిసన్ మాట్లాడుతూ "ఇందులో మ్యాగీ పాత్రను పోషించాను. ఇటువంటి మంచి రోల్ దక్కడం నా అదృష్టం. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ భావోద్వేగానికి లోనవుతారు" అని తెలిపారు.

శక్తిమంతమైన లుక్‌లో...



తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న తాజా చిత్రం 'భద్రకాళి'. ఆయనకు ఇది 25వ చిత్రం కావడం విశేషం. అరుణ్ ప్రభు దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఇందులో ఫ్యామిలీ మ్యాన్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా, ఉన్నతాధికారిగా పలు శక్తిమంతమైన లుక్స్‌లో కనిపించారు. సంభాషణలు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా విజయ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: రేమండ్ డెరిక్ క్రాస్టా, సినిమాటోగ్రఫీ: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోని.



కడుపుబ్బా నవ్వించే చిత్రం



కమెడియన్ సప్తగిరి కథానాయకుడిగా అభిలాశ్ రెడ్డి గోపిడి తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. దిల్‌రాజు సమర్పణలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతుంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. "36 ఏళ్లు వచ్చినా పెళ్లికాని ఓ వ్యక్తి కథ ఇది. సినిమా కడుపుబ్బా నవ్విస్తుంది. సప్తగిరి మార్క్ వినోదం గ్యారంటీ" అని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, రోహిణి, ప్రియాంక శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: సుజాత సిద్ధార్థ్, సంగీతం: శేఖర్ చంద్ర.

ఆమెతో డేటింగ్‌లో ఉన్నా



తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌తో ఏడాదిన్నరగా డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. ఆమెతో తనది పాతికేళ్ల పరిచయం అన్నారు. ప్రస్తుతం గౌరీ తన ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. నేడు ఆమిర్‌ఖాన్ 60వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో ఆయన గౌరీ స్ప్రాట్‌తో తన అనుబంధాన్ని మీడియాతో పంచుకున్నారు. గౌరీ స్ప్రాట్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారనీ, ఆమెకు గతంలో పెళ్లైందనీ, ఆరేళ్ల కుమారుడు కూడా ఉన్నాడని చెప్పారు. నాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఆమెతో అనుబంధం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా నా స్నేహితులు షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌కు ఇచ్చిన పార్టీకి కూడా గౌరి హాజరయినట్లు తెలిపారు. గతంలో రీనాదత్తా, కిరణ్‌రావును వివాహం చేసుకొన్న ఆమిర్ కొన్నాళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు.





అవీ..ఇవీ

పుస్తక రచన అభినందనీయం



పుస్తకాలు రచించిన విద్యార్థులతో సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులోనే పుస్తక రచన అభినందనీయమని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. స్థానిక కమలా హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు వివిధ అంశాలపై 35 పుస్తకాలు రచించారు. ఈ సందర్భంగా గురువారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. పుస్తకాలు రచించడం అనేది అంత సులువైన విషయం కాదన్నారు. విద్యార్థులు పుస్తకాలు రచించడం ఎంతో అభినందనీయం అన్నారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసి పుస్తకాలు రచించటంలో సహకరించిన యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమలా విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ టి.సింధూజ, ప్రిన్సిపాల్ డా. స్వరూప్ రంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో సదుపాయాలు కల్పిస్తాం



భోజనం రుచిచూస్తున్న బీజేపీ నేతలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో అవసరమైన సదుపాయాలు తమ వంతుగా కల్పిస్తామని బీజేపీ మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ పీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను బీజేపీ బృందం గురువారం పరిశీలించి భోజనం చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్న క్యాంటిన్లు పేద కార్మిక వర్గాలకు ఎంతో ఉపయోగకరం అన్నారు. క్యాంటీన్‌లో అవసరమైన భోజనం టేబుల్స్, చిన్న పిల్లల టేబుల్స్, మంచినీటికి అవసరమైన 10 వాటర్ బబుల్స్, విద్యుత్ ఇన్వర్టర్ అవసరమని గుర్తించి వాటిని తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాదర్తి అంజనేయులు, మద్దెల లక్ష్మీ, సతీష్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకట్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గంటవానిపల్లె విద్యార్థినికి డాక్టరేట్



నందిని (ఫైల్)

పెద్దదోర్నాల, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటవానిపల్లెకు చెందిన నందిని డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం సంఖ్యాశాస్త్ర విభాగంలో విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జీవీఆర్ ఆంజనేయులు పర్యవేక్షణలో ఆమె డాక్టరేట్ పూర్తి చేశారు. 'ఆన్ డిఫరెంట్ ఇంపరెన్షియల్ మెథడ్స్ ఆఫ్ పారామీటర్స్ ఫర్ న్యూ వెయిటెడ్ ఎక్సోనెన్షియల్ డిస్ట్రిబ్యూషన్‌'కు పీహెచ్‌డీ డిగ్రీ వచ్చినట్లు తెలిపారు. 2021లో ఆమెకు జాతీయ స్థాయిలో 'నేషనల్ ఫెలోషిప్ ఫర్ హైర్ ఎడ్యుకేషన్' అవార్డు కూడా అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిభా పురస్కారం అందుకున్నారు. పలు పరిశోధన వ్యాసాలు వివిధ జర్నల్స్‌లో ప్రచురితమైనట్లు ఆమె వివరించారు. ఆమెను డీన్ ఫిజికల్ సైన్సెస్ ఓఎస్‌డీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌వీ ఎస్ రవికుమార్, విభాగపతి ఆర్.శ్రీనివాసరావు, చైర్మన్ సత్యనారాయణ, కుటుంబసభ్యులు అభినందించారు.

మసీదులో సీసీ కెమెరాలు ధ్వంసం

● బైండోవర్ కేసులు నమోదు

కంభం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కందులాపురం గ్రామపంచాయతీలోని హజరత్ బిలాల్ మసీదు పరిధిలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన వారిపె కంభం తహసీల్దార్ వద్ద బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కంభం ఎస్సై నరసింహారావు తెలిపారు. హజరత్ బిలాల్ మసీదు పరిధిలో ముస్లింలు రెండు వర్గాలుగా ఏర్పడి ప్యానల్ ప్రెసిడెంట్‌గా తామంటే తాము ఉండాలని ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. వారిలో ఒకరు సీసీ కెమెరాలు ధ్వంసం చేయగా నిందితులపై బైండవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేస్తున్న ఫాతిమా సంస్థ ప్రతినిధులు

గిద్దలూరుటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంశెట్టిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫాతిమ స్వచ్ఛంద సేవాసంస్థ పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు. విద్యార్థులకు పరీక్ష అట్టలతోపాటు పెన్సిళ్లు, పెన్నులు అందచేశారు. ప్రశాంత వాతావరణంలో చదివి పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాశింవలి, ఉపాధ్యాయులు షేక్ ఖాశింవలి, మంజురేఖ తెలిపారు.

ఎగువ చెర్లోపల్లిలో...

పెద్దదోర్నాల : మండలంలోని ఎగువచెర్లోపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పాఠశాల పూర్వపు విద్యార్థి రామునాయక్ పదవ తరగతి విద్యార్థులకు తన వంతు సాయంగా పరీక్ష అట్టలు, పెన్నులు అందజేయగా హెచ్ఎం బాలగురువులు పంపిణీ చేశారు. రామునాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది బాదూర్ నాయక్, సీఆర్పీ షణ్ముక్ నాయక్, రాజేష్, గ్రామపెద్ద బాలరాజు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాల

గిద్దలూరు : పట్టణంలోని ఆది ఆంధ్రా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు అటవీశాఖ సిబ్బంది నిత్యవసర వస్తువులు, విద్యాసామగ్రి పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ మధుప్రియాంక, డిప్యూటీరేంజ్ ఆఫీసర్‌లు జి.రంగారెడ్డి, బాలాజీనాయక్, మాల్యాద్రి, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు అబ్దుల్‌గఫూర్, రాజేష్, క్రాంతితేజ, సయ్యద్ ఇమ్రాన్, సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. బర్లీ పొ గాకు ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నార న్నారు. గత ఏడాదితో పోల్చితే సగానికి సగం తగ్గిన ధరలతో బర్లీ పొగాకు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం గి ట్టుబాటు ధరలు కల్పించేలా చూడాలని ఆయన కోరారు.

కంభం పంచాయతీ.. కంపు కంపు

● డ్రైనేజీ, ఇరిగేషన్ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు ● దోమలతో ప్రజలకు ఇబ్బందులు

కంభం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కంభం మేజర్ పంచాయతీలోని పలు వీధులు కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే ముక్కు మూసుకోవలసిందే. మరికొన్ని చోట్ల మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. కంభం మేజర్ పంచాయతీలోని సంగ, తెలుగు, గాంధీబజార్, ఆర్టీసీ బస్టాండ్, విక్టరీ హాలు వెనుక వైపు ఉన్న ఇరిగేషన్ కాలువలు, రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో ఆంజనేయస్వామి దేవాలయం వెనుక వైపు ఉన్న కాలువ, బోర్డు స్కూలు పక్కన ఉన్న కాలువల్లో నెలల తరబడి చెత్త పేరుకుపోయి మురికినీటి నిలువతో భయంకరమైన కంపు కొడుతోంది. దీనికితోడు మూడు నెలల క్రితం ఇరిగేషన్ అధికారులు కాలువల శుభ్రం పేరుతో వ్యర్థాలన్నింటిని తీసి గట్లపై పడవేసి ఇప్పటికీ తీయకపోవడంతో కంపు మరింత ఎక్కువైంది. రోడ్ల వెంబడి వెళ్లే పాదాచారులు, వాహనదారులు ముక్కులు మూసుకుని వెళ్ళాల్సి వస్తోంది. సాయంత్రం 6 గంటలకు అయిందంటే మురుగు కాలువల్లోని దోమల దెబ్బకు ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయడమేకాక చెత్తను ఎత్తివేసి కంపునుంచి, దోమల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.




పట్టణంలోని మురుగు కాలువలో, ఇరిగేషన్ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



తురిమెళ్లకు వెళ్ళే రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

బాధితులకు సొత్తు అందజేత

సీసీ కెమెరాల సాయంతో కేసును పరిష్కరించిన పోలీసులు



బాధితులకు సొత్తు అందజేస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగదు, బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న బాధితులకు సాంకేతికత సాయంతో మార్కాపురం పోలీసులు 24 గంటల వ్యవధిలోనే కేసును పరిష్కరించి వారికి న్యాయం చేశారు. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు కథనం మేరకు పెద్దదోర్నాల మండలం రామచంద్రకోట గ్రామానికి చెందిన వెన్నా కాశిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు బుధవారం మధ్యాహ్నం పట్టణానికి వచ్చారు. స్థానిక అరవింద స్కూల్ సమీపంలోని ధనలక్ష్మి అక్క కుమారి ఇంట్లో ఉన్నారు. అదేరోజు రాత్రి 7.45 గంటలకు కాశిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో అరవింద స్కూల్ నుంచి విశ్వేశ్వర థియేటర్, రాధాకృష్ణ థియేటర్, తూర్పువీధి మీదుగా కమలా వెడ్డింగ్ మాల్ వద్దకు వెళ్లేసరికి వారి వెంట తెచ్చుకున్న నగదు, బంగారు ఆభరణాల సంచి పోయినట్లు గుర్తించి వెంటనే పట్టణ పోలీసలకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అన్నిచోట్ల బుధవారం రాత్రి వెదికారు. అయినా నగదు, ఆభరణాల జాడ దొరకలేదు. దీంతో పోలీసులు గురువారం ఉదయం వాగ్దేవి జూనియర్ కాలేజీ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కాశిరెడ్డి దంపతుల బ్యాగు కాలేజీకి సమీపంలోనే పడిపోయింది. అటుగా వెళ్తున్న తూర్పువీధికి చెందిన ఓ మహిళ ఆ బ్యాగును తీసుకుంది. పోలీసులు సదరు మహిళను గుర్తించి ఇంటికి వెళ్లి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో వున్న నగదు, బంగారు ఆభరణాలను గురువారం సాయంత్రం బాధితులు వెన్నా కాశిరెడ్డి దంపతులకు అందించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ద్వారా పోయిన సొత్తు దొరికేందుకు సాయపడిన వాగ్దేవి కాలేజీ అధినేత గొలమారి పవన్‌ను అభినందించారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి, సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విద్యార్థులతో సబ్‌కలెక్టర్

మార్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం ద్వారా దేశభక్తి, సేవాగుణం అలవర్చుకోవా లని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠ శాల హెచ్ఎం మునగాల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూలులో గురువారం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పాఠశాల స్కౌట్స్ ట్రూప్ అయిన చంద్రయాన్ స్కౌట్స్ ట్రూప్‌లో విద్యార్థులకు దీక్షా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎమ్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవాకార్యక్రమాల్లో విరివిగా పాల్గొని దేశానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. స్కౌట్ మాస్టర్ సయ్యద్ సమీవుల్లా బాష విద్యార్థులకు స్కౌట్ నియమాలు, సర్టిఫికేట్ కోర్సుల గురించి క్షుణ్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని గణపవరం బాలుర గురుకుల పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాధాన్యతను, విశిష్టతను ఎంఈవోలు కేటీ.మల్లిఖార్జుననాయక్, టి.రాజశేఖరరెడ్డి విద్యార్థులకు వివరించారు. అనం తరం విద్యార్థులకు స్కౌట్ యూనిఫాం, క్యాప్, స్కార్ఫ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జి.మోహనరెడ్డి, మేడపి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు, స్కౌట్ మాస్టర్ బి.ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

26 మందికి రూ.42లక్షల విలువైన చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ఆరోగ్య సమస్యలపై చికిత్స పొందిన 26 మందికి, సుమారు రూ.42 లక్షల విలువైన చెక్కులను టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అందజేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఐదు మండలాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులకు ఆయా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎరిక్షన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బారావు, ఎంసీహెచ్ మంత్రునాయక్, కంచర్ల సత్యనారాయణగౌడ్, వెంగళరెడ్డి, కె.నారాయణరెడ్డి, చెవుల ఆంజయ్య, సుబ్బారెడ్డితో పాటు ఐదు మండలాల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురంలో కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ



మొల్లమాంబ విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న వసంతలక్ష్మీ


మార్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామయణ మహా గ్రంథాన్ని రచించిన కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం తర్లుపాడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద నిర్వహించారు. విగ్రహాన్ని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాలి వాహన సామాజికవర్గానికి చెందిన కవయిత్రి మొల్ల రామాయణ మహా గ్రంథాన్ని రచించార న్నారు. ఆమె మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దొడ్డా రవణమ్మ, శాలివాహన సంఘం మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

గిద్దలూరు : కవయిత్రి మొల్లమాంబ 585వ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు, తమిళ రాష్ట్రాలకు సన్నిహిత సంబంధాలతో సరళమైన పదాల తో ఆమె రాసిన రామాయణం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, వివిధ సంఘాల ప్రతినిధులు రామిరెడ్డి, అద్దంకి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, విద్యుత్ ప్రభ



కొనకనమిట్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మునగపాడు గ్రామంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా పాల్గుణ శుద్ధ పౌర్ణమిరోజున అమ్మవారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా గుడికి రంగులు వేసి సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాలతో అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. చౌడేశ్వరిఅమ్మవారి తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పగలు పూజలు నైవేద్యాలు సమర్పించారు. తిరునాళ్లకు పరసర గ్రామాల ప్రజలతో పాటు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం, పొదిలి, దర్శి, దొనకొండ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని ఆత్మ సాక్షిగా పూజించి కోర్కెలు కోరితే తప్పక నెరవేరుతుందని భక్తులు నమ్ముతారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వివిధ రాజకీయపార్టీల ఆధ్వర్యంలో నాయకులు ఏడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభలపై వివిధరకాల పటకచేరీలు, పౌరాణిక నాటకాలు, పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తుల కోసం ఆలయ కమిటీవారు కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు తిరునాళ్లకు వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



స్వామివారి మూలవిరాట్

సీఐటీయూ జెండా తొలగింపుపై నిరసన



జెండాను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్మిక సంఘాల నేతలు

కంభం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కందులాపురం కూడలిలో కార్మిక సంఘాల సీఐటీయూ జెండాను నేషనల్ హైవే అథారిటి సిబ్బంది తొలగించడంపై కంభం మండల సీఐటీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ నాయకులు అన్వర్ మాట్లాడుతూ తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే జెండాను, కర్రను పీకివేయడంపై ఆందోళన చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అయితే ఎస్సై నరసింహారావు సిఐటియు నాయకులను, హైవే అధికారులను పిలిపించి రెండు రోజుల్లో జెండాను అదేచోట పాతిస్తామని హామీ ఇవ్వకుండా ఆందోళన విరమించినట్లు, శుక్రవారం జెండాను పాతని పక్షంలో తాము ఆందోళన చేపడతామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు తిరుపతిరావు, మండల నాయకులు షేక్ ఖాజావలి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర మహోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి జన్మ నక్షత్ర మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షులు తాడువాయి గోపాల మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

గ్లకోమాపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

గిద్దలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్లకోమా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 80 బిలియన్ల మంది గ్లకోమా వ్యాధితో బాధపడుతున్నార న్నారు. మనదేశంలో 12 మిలియన్ల మేర ప్రజలు గ్లకోమావ్యాధి, కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. కంటిలో నీటి ఒత్తిడి క్రమంగా పెరుగుతూ కంటి నరాలను క్షీణింపజేసి చివరకు అంధత్వాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కంటిలో దృష్టి లోపం ఏర్పడితే వెంటనే వైద్యచికిత్సలు చేయించు కోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు తమ ఆసుపత్రి ఆవరణలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కంటి స్కానింగ్, గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిం చారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన పైపులైన్ ఏర్పాటు



పైపులు బిగిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది

మార్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్ట ణంలోని 32వ వార్డులోని రాముడు బజారులో తాగునీటి సమస్యకు అధి కారులు పరిష్కారం చూ పారు. గురువారం మున్సి పల్ ఇంజనీరింగ్ అధికా రులు సిబ్బంది నూతన పైపులైన్ ఏర్పాటు చేశారు. అంతకు మందు స్థానికులు సమస్యపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే

పెద్దదోర్నాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డే ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి సంజీవ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కేకును కట్ చేశారు. వైద్యశాలలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న చిరంజీవిని వైద్య సిబ్బంది శాలువాకప్పి సత్కరించారు. వైద్యాధికారులు ఆంజనేయులు, మెర్సీ లావణ్య, సిబ్బంది మణికుమార్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

● జీసీడీవో హేమలత



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతిలో నూరుశాతం మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్రశిక్ష జీసీడీవో కే.హేమలత అన్నారు. స్థానిక కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలను జిల్లా సమగ్రశిక్ష జీసీడీవో కే.హేమలత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థులకు వినియోగించే కూరగాయలు, పండ్లు, పాలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. అనంతరం పదవతరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆమె పర్యవేక్షించారు. కొద్దిరోజుల్లోనే పరీక్షలు ఉన్నందున శ్రద్ధగా చదవాలని మంచి మార్కులతో ఉత్తీర్ణత చెందాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎల్.అనూష, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

గిద్దలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. మూడు పరీక్ష కేంద్రాలలో 827 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 72మంది గైరుహాజరయ్యారు. 755 మంది పరీక్షలు రాసినట్లు ఆయా కేంద్రాల చీఫ్‌లు విజయ్‌శంకర్, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు.

ముఖాముఖి

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

ఎస్.మల్లికార్జునరావు, ఎస్ఐ, తాళ్లూరు



ప్రశ్న: మండలంలో శాంతి భద్రతలకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. విలేజ్ పోలిసింగ్ నిర్వహిస్తూ నిత్యం కానిస్టేబుళ్ల గ్రామాల్లో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉంటున్నారు.

ప్ర: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నారా?

జ: మండలలోని అన్నిగ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు ప్రజల సహకారంతో 80 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశాం. వీటి అవసరాలపై ప్రజలకు అవగాహన కల్పించాం.

ప్ర: రోడ్డు ప్రమాదాలపై ఎలాంటి అవగాహన కల్గిస్తున్నారు?

జ: రోడ్డు భద్రత, ప్రమాదాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాం. నిత్యం వాహనాలను తనిఖీ చేస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్ర: సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్గిస్తున్నారా?

జ: ప్రస్తుతం సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. యువతకు ఆన్‌లైన్ గేమ్‌లు, లోన్ యాప్‌లు, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై అవగాహన కల్గిస్తున్నాం. సెల్‌ఫోన్‌ల ద్వారా తెలియని వ్యక్తులు సమాచారం అడిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలి.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

దర్శి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయితీలో ఈనెల 15 నుంచి ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రజల రెవెన్యూ సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర పంచాయతీలో వార్డులవారీగా ప్రతిరోజు ఒక వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. దర్శి పట్టణ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలి

పామూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణలో పండుగలు జరుపుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. శుక్రవారం హోలీ పండుగ, రంజాన్ నెలలో రెండో శుక్రవారం ప్రార్థనలు ఒకేరోజు రావడంతో ఇరువర్గాలు మతసామరస్యంతో ఉండాలని కోరారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఉన్నాయని తెలిపారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, అలాగే శాంతి భద్రతల సమస్యలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వామివార్లకు ఊంజల్ సేవ

పామూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లీభుజంగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్లకు ఊంజల్ సేవా కార్యక్రమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివపార్వతులకు శాంతి కల్యాణం నిర్వహించి నేటికి 16 రోజులయిన సందర్భంగా స్థానిక శివాలయంలోని అద్దాల మండపం వద్ద స్వామివార్లకు ఊంజల్ సేవా, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, బండ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా హోలీ జరుపుకోవాలి

పీసీపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలని ఎస్సై జి.కోటయ్య పేర్కొన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకుండా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. ఎవరైనా ఇతరులను కించపరిచేలా వ్యవహరించినా, మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

నిధుల దుర్వినియోగంపై రేపు విచారణ

దొనకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): దొనకొండ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలపై ఈనెల 15న ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించనున్నట్లు సమాచారం. నిధుల దుర్వినియోగంపై దొనకొండకు చెందిన షేక్ రసూల్‌బాషా ఇటీవల ఆశాఖ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన అధికారులు శనివారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపేందుకు ఫిర్యాదుదారుడైన రసూల్‌బాషాతో పాటు సర్పంచ్, విస్తరణాధికారి, గ్రామ కార్యదర్శులు పూర్తి రికార్డులు, ఆధారాలతో విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేశారు.

వరి.. వర్రీ

- నెలాఖరుకు సాగర్ నీరు నిలిపివేత
- దర్శి ప్రాంతంలో 5వేల ఎకరాల్లో సాగు
- పంట చేతికందే సమయంలో తడులు అవసరం
- ఆందోళన చెందుతున్న రైతులు

దర్శి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపైరు చేతికందుతుందో, లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెలాఖరు వరకు మాత్రమే సాగునీటిని పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆతర్వాత నీటి సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. దీంతో లేత వరిపైరు దక్కే పరిస్థితి కనిపించటం లేదు.

దర్శి ప్రాంతంలో రబీ సీజన్‌లో సుమారు ఐదువేల ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పైరు కంకితీసే దశలో ఉంది. సుమారు నెలరోజులు సాగు నీరు సరఫరా చేస్తేనే ఆ వరి పైరు పండుతుంది. నెలాఖరుకు నీటిని నిలిపివేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరిపైరు పంట చేతికందే సమయంలో నీరులేక ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నిరోజులుగా సాగర్ కాలువలకు నీటి సరఫరా అరకొరగా జరుగుతుంది.



దర్శి ప్రాంతంలో సాగవుతున్న వరిపైరు

అన్నీ మేజర్లకు నీరు సక్రమంగా అందటం లేదు. చివరి ప్రాంతాలకు నీరు చేరటం లేదు. దీంతో ఆయకట్టు చివరి భూముల రైతులు ఆలస్యంగా వరిపైరు సాగు చేశారు. కొంతమంది రెండో పంట కింద రబీలో వరి నాట్లు వేశారు. కనీసం ఏప్రిల్ 15 వరకు నీరు సరఫరా చేస్తే అన్నీ పంటలు దక్కుతాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కూడా సాగర్ కాలువలకు అరకొరగానే నీటిని విడుదల చేస్తున్నారు. అనేక మేజర్లకు ఇప్పుడు కూడా నీరు సక్రమంగా అందటం లేదు.



దర్శి బ్రాంచ్ కాలువలో అతితక్కువగా సరఫరా అవుతున్న నీరు

అధికారుల లెక్కల ప్రకారం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు (ప్రకాశం బార్డర్) 1632 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 601 క్యూసెక్కులు, పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 361 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రస్తుతం విడుదలవుతుంది. ఒంగోలు బ్రాంచ్ కాలువకు కనీసం 800 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తేనే అన్నీ మేజర్లకు నీరందుతుంది. కనీసం ఈచివరి దశలో నైనా మేజర్లకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తే పైర్లకు పుష్కలంగా నీరు పెట్టుకునే అవకాశం ఉంది.

అయితే, అధికారులు వారబందీ అమలుచేస్తున్నారు. దీంతో కొన్ని మేజర్లకు వారం రోజులు, మరికొన్ని మేజర్లకు అతర్వాత వారం నీరు విడుదలవుతుంది. ఈ లోపు మార్చి నెలాఖరు గడువు వస్తుండటంతో ముందుగా కొన్ని మేజర్లకు నీరందే పరిస్థితి కనిపించటం లేదు. ప్రస్తుత్తం పంటల పరిస్థితి గుర్తించి అన్నీ పంటలు దక్కేలా ఏప్రిల్ 15 వరకు సాగర్ నీటిని సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా ఓటరు జాబితా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని ఓటర్ల జాబితాల్లోని తప్పులను సవరించటం జరుగుతుందన్నారు. కొత్త ఓటర్లను చేర్పించే ప్రక్రియ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయపార్టీల నేతలు తమ దృష్టికి వచ్చిన సమస్యలను పోలింగ్ సిబ్బందికి తెలపాలన్నారు. త్వరలో పోలింగ్ బూత్ సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నేత శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రవిశంకర్ పాల్గొన్నారు.

కొత్తపేట.. నీటికి కటకట

- వాడుకకూ తప్పని అవస్థలు
- ట్యాంకర్‌ల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు

కనిగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో సంపన్నుల పేట నీటికోసం కటకటలాడుతుంది. భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లలో నీరురావడంలేదు. దీంతో కొత్తపేట వాసులకు మున్సిపాల్టీ సరఫరాచేసే నీరే దిక్కయింది. అదికూడా ఐదురోజులకొకమారు ట్యాంకర్ ద్వారా సరఫరాచేస్తున్నారు. ఈనీరు సరిపడక స్థానికులు పడరానిపాట్లు పడుతున్నారు. గతపాలకులు ఇంటింటికి నీటి సరఫరా చేస్తామని ప్రచారాలు చేసి పట్టించుకోలేదని కొత్తపేట ప్రజలు విమర్శిస్తున్నారు. అరకొరగా పనిచేసే బోరు మోటర్‌ల నుంచి కేవలం పది బిందెలు కంటే వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది చివరి మాసాల్లో కురిసిన వర్షాలకు నాగులచెరువుకు నీరొచ్చి భూగర్భ జలమట్టం పెరిగి బోర్లు మళ్ళీ వాడుకలోకి వస్తాయని భావించిన ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. ప్రతిఇంటి ముందు పెద్ద, పెద్ద ట్యాంకులు, పీపాలు దర్శనమిస్తూ ప్రజలు పడుతున్న అవస్థలకు సాక్ష్యంలా నిలిచాయి.



మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లముందు ఉన్న పీపాలు

కనిగిరి పట్టణంలోని కొత్త పేటలో బహుళ అంతస్థులు వెలిశాయి. ఒక్కో అంతస్థుకు సరాసరిన రోజుకు వెయ్యి లీటర్లు వినియోగించుకునే పరిస్థితి. కొత్తపేట ప్రాంతంలో గృహ యజమానుల కంటే ఎక్కువ మంది బయటి ప్రాంతాల నుంచి వచ్చి అద్దెలకు నివసిస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. కొత్తపేటలో దాదాపు మూడువేల మంది జనాభా ఉన్నారు. 1800 వందల కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. రెండు సచివా లయాల పరిధిలో విస్తీర్ణంలో కొత్తపేట ఏర్పాటయింది. అత్యధిక జనాభా కల్గిన ప్రాంతంగా కొత్తపేట పేరొందింది. కాశినాయన గుడి దాటి నాగులచెరువు అలుగు వరకు ఇళ్ళు విస్తరించాయి. ఈ ప్రాంతం నుంచి ఏడాదికి సగటున దాదాపు రూ.20 లక్షల వరకు ఇంటి పన్నుల రూపంలో మున్సిపాల్టీకి చెల్లిస్తున్నారు. గత పాలకుల వైఫల్యం కారణంగా వాడుక నీటి కోసం కొత్తపేట ప్రజలకు అవస్థలు మాత్రం తప్పటం లేదు.



కొత్తపేటలో నీటి కోసం ఏర్పాటు చేసుకున్న ట్యాంకులు, పీపాలు

ఐదు రోజులకోమారు ట్యాంకరుతో సరఫరా

కొత్తపేటలో మున్సిపల్ ట్యాంకరుతో ఐదు రోజులకోమారు నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్కో ఇంటికి రెండు నుంచి మూడు పీపాలు మాత్రమే ఇచ్చే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా బంధువులు వస్తే మాత్రం నీరు చాలకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ వాటర్ సరఫరా కాంట్రాక్టర్ ట్రిప్పుల్లో మోసం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నెరవేరనున్న పేదల సొంతింటి కల

- గత వైసీపీ పాలనలో అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు
- చాలీచాలని నిధులతో ఇబ్బందులు పడిన లబ్ధిదారులు
- చేయూత ఇస్తున్న కూటమి ప్రభుత్వం
- ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు సాయం
- త్వరలో పూర్తికానున్న గృహాలు



బాదాపురంలోని జగనన్న లేఅవుట్‌లో అరకొరగా గృహ నిర్మాణాలు

దొనకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎస్సీ, బీసీ, ఎస్టీలకు మంజూరైన గృహాలను చాలీచాలని నిధులతో అసంపూర్తిగా వదిలేశారు. వీటికి అదనపు నిధులు మంజూరుచేసి పూర్తయ్యేలా కూటమి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

గత వైసీపీ ప్రభుత్వంలో దొనకొండ మండలానికి దాదాపు 1394 గృహాలు మంజూరయ్యాయి. అందులో 746 గృహాలు పూర్తయ్యాయి. 522 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 126 మంది నిర్మాణాలు ప్రారంభించ లేదు. అసంపూర్తి నిర్మాణాలకు సంబంధించి ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు అదనంగా మంజూరు చేసేలా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం పేదలు నిర్మించుకునే గృహాలకు రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్ల పేరుతో అనువుకాని ప్రదేశాల్లో, గ్రామాలకు దూరంగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. దీంతో చాలామంది ఇళ్ల నిర్మాణాల గురించి పట్టించుకోలేదు.

పలు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వీటిని పూర్తి చేయించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణాలు పూర్తి చేసుకోని ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు చేయూతనిస్తుంది. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా గృహ నిర్మాణ శాఖ క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

మండలంలో ఎస్సీ లబ్ధిదారులు 376 మంది, బీసీ లబ్ధిదారులు 139 మంది, ఎస్టీ లబ్ధిదారులు ఏడుగురు.. మొత్తం 522 మందికి లబ్ధి చేకూరనున్నట్లు సమాచారం. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామాల్లో పేదలు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసేలా తీసుకున్న నిర్ణయం పట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

హనుమంతరావు, హౌసింగ్ ఏఈ, దొనకొండ

2016-17లో కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన పీఎంఏవై పథకం, 2019-24 మధ్యకాలంలో గృహాలు మంజూరై నిర్మాణాల్లో వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థికసాయం అందించనుంది. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బిల్లుల మంజూరులో ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి.

మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఆత్మ డీపీడీ విజయనిర్మల అన్నారు. స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాలులో గురువారం కిచెన్ గార్డెన్, మిద్దె తోటల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బీకే, డీఆర్‌డీఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాగస్వామ్యంతో ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి విజయవంతంగా నిర్వహించాలన్నారు. కంపోస్టు తయారీ గురించి మిద్దె తోటల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. తోట పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలివ్వాలన్నారు.

కార్యక్రమంలో డీటీసీ రామ్మోహన్, సీఏడీఏజే వెంకట్రావు, డీఆర్‌సీ వ్యవసాయ అధికారులు వి.వెంకటశేషమ్మ, ఏ.శైలజారాణి, ఏడీఏ ఈవీ రమణ, ఏవో అంజలీ భాయి, ఆరు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీడీ విజయనిర్మల

భూవివాదంలో వాగ్వివాదం

ముండ్లమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో తహసీల్దార్ ఎదుటే ఇరువర్గాలు గొడవపడ్డారు. ఈఘటన గురువారం ముండ్లమూరులో తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. మండలంలోని తమ్మలూరుకు చెందిన చొప్పరపు శివలింగయ్య, ఉమామహేశ్వర అగ్రహారంకు చెందిన మీనగ సముద్రయ్య వారి బంధువుల మధ్య వివాదం నడుస్తోంది. తమ్మలూరు రెవెన్యూలోని 84/1, 84/3సీ, 84/3ఏలో ఉన్న 2.01 సెంట్ల పొలంలో ఆన్‌లైన్‌లో ఒకరు, సాగులో మరొకరు ఉండటంతో గత కొన్ని రోజుల నుంచి వివాదం నడుస్తుంది. గురువారం తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఇరువురికి నోటీసులు ఇచ్చి పిలవటంతో విచారణకు హాజరయ్యారు. ఈక్రమంలో వీరిరువురు తహసీల్దార్ వద్ద తీవ్రవాగ్వివాదంతో గొడవ పడ్డారు. అరగంట పాటు అరుపులు, కేకలతో కార్యాలయం దద్దరిల్లి పోయింది. ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఏం జరుగుతుందోనని అక్కడికి వచ్చారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ జోక్యం చేసుకొని ఇరువర్గాలను బయటకు పంపించివేశారు.

అమెరికా తెలుగు మహాసభలకు కదిరికి ఆహ్వానం



కదిరికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాట్స్ అధ్యక్షుడు మదన్

సీఎస్‌పురం(పామూరు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో జూలై 4, 5, 6 తేదీల్లో జరగనున్న తెలుగు మహాసభలకు (నాట్స్) హాజరుకావాలని అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు మదన్ పాములపాటి గురువారం మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. సీఎస్‌పురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో కదిరిని మదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాట్స్ ఆధ్వర్యంలో అమెరికా తెలుగు మహాసభలు ఎంతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. కదిరిని కలిసినవారిలో సీఎస్‌పురం గ్రామ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షుడు నాయుడు నారాయణ, గ్రంధి హేమ సుందరం, మురం కాశిరెడ్డి, తోట వెంకటేశ్వర్లు, కదిరి రమణయ్య, చావా వెంకటేశ్వర్లు ఉన్నారు. అలాగే, సీఎస్‌పురం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డిని పామూరులో కలిసి అమెరికా తెలుగు మహసభల కు రావాలసినదిగా కోరుతు అహ్వాన పత్రం అందజేసినట్లు తెలిపారు.

దాతల సహకారంతో పరీక్ష సామగ్రి అందజేత

సీఎస్‌పురం(పామూరు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు దాతల సహకారంతో గురువారం పరీక్ష సామగ్రిని అందజేశారు. పామూరు ఉన్నత పాఠశాలలో అధ్యాపకుడు డి.మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం మిత్ర బృందం మల్లి జెరాక్స్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.రామస్వామి, విద్యా కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పఠాన్ కాజారహంతుల్లా విద్యార్థులకు పెన్నులు అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేసి పరీక్షలు బాగా రాసేలా పలు సూచనలు చేశారు.

తాళ్లూరులో ఆరు పరీక్షా కేంద్రాలు

తాళ్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. బొద్దికూరపాడు -ఏ పరీక్షా కేంద్రంలో 130 మంది, బొద్దికూరపాడు-బి పరీక్షా కేంద్రంలో 120 మంది, శ్రీసరస్వతీ హైస్కూలు పరీక్షా కేంద్రంలో 140 మంది, వీకేజీహెచ్ తాళ్లూరు పరీక్షాకేంద్రంలో 173 మంది, తూర్పుగంగవరం జిల్లా పరిషత్‌హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 162 మంది, తూర్పుగంగవరం జాహ్నవి హైస్కూల్‌లో వంద మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా పేపర్లను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన గురువారం కనిగిరి పట్టణంలో చోటుచేసుకుంది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన రవితేజ (32), కనిగిరి ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించాడు. యువతి కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించడంతో, ఆవిషయాన్ని రవితేజకు తెలిపింది. దీంతో మద్యం సేవించి కత్తితో చేతిని కోసుకోవడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మరోసారి కత్తితో చేతిని కోసుకోవటంతో పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తీసుకెళ్లాల్సిందిగా స్థానిక ప్రభుత్వ వైద్యులు సూచించారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన రవితేజ మృతి చెందాడు. ఈవిషయంపై పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తాళ్లూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వీకేజీహెచ్ ఎస్‌ఎంసీ చైర్మన్ అనపర్తి సత్యవర్ధన్‌రావు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరవుతున్న స్థానిక హైస్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులకు గురువారం పరీక్షల సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజేశ్వరి, దేవప్రియ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు స్వశక్తితో రాణించాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి, తదితరులు

వెలిగండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల దశ నుంచే బాలికలు తమ తెలివితేటలతో స్వశక్తితో పైకి రావాలని దాత మైనింగ్ రిటైడ్ డిప్యూటీ డైరెక్టర్ పగడాల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్, పందువ నాగులవరం జిల్లా పరిషత్ పాఠశాలకు ఎనిమిది కుట్టు మిషన్లు బహూకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాఘవచారి, ఉపాధ్యాయులు చేతల వెంకటరామయ్య, దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవికుమార్, నందాని బాషా, తదితరులు పాల్గొన్నారు.


ప్రాథమిక పాఠశాలకు రోటరీ క్లబ్ వితరణ

ముండ్లమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులోని ప్రాథమిక పాఠశాల మెయిన్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో గురువారం రూ.22 వేలు విలువచేసే ఉయ్యాల బల్లను అందజేశారు. హెచ్‌ఎం బాచిన పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయిని ఏ.రజిని ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలకు అనేక సేవా కార్యక్రమాలతో పాటు పాఠశాలల అభివృద్ధికి వివిధ వస్తువులు అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరు మురళీ సుధాకరరావు, కోశాధికారి మల్లాది శ్రీనివాసరావు, ఎంఈవో - 1 ప్రసాదరావు, ఎంఈవో - 2 వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ దేవపాలన, పీవీఎల్ నరసింహారావు, లెవి ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్ట్

కనిగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీరాం తెలిపారు. మండలంలోని యర్రబల్లిలో ఈనెల 11వ తేదీ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అతనినుంచి 19 బాటిళ్ళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.




ఓవర్ లోడ్ కారణంగా తెనాలి వైకుంఠపురం బ్రిడ్జి వద్ద రోడ్డుపై పడి ప్రమాదకరంగా మారిన ఇసుక

మార్చిలోనే మంటలు

1 మొదలైన భానుడి ప్రతాపం 1 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
1 మే నెలను తలపించేలా ఎండలు
1 ఉదయం 9 నుంచే వేడి.. జనం ఉక్కిరిబిక్కిరి

(గుంటూరు(తూర్పు), నరసరావుపేట,ఆంధ్రజ్యోతి)

మార్చి రెండో వారంలోనే భానుడు ప్రతాపం చూపుతు న్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతు న్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరుగుతున్న ఎండలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనులకు మాత్రమే ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వస్తున్నారు. రానున్న వారం రోజులు ఇదేస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. సాధారణ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు కాగా 7 డిగ్రీలు అధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాలలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోద య్యాయి. గుంటూరు జిల్లాలో అత్యధికంగా 41 డిగ్రీలు, బాపట్ల జిల్లాలో అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



గురువారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
రెంటచింతల	42
మాచర్ల	42
గురజాల	42
దాచేపల్లి	42
నరసరావుపేట	42
పిడుగురాళ్ళ	42
వినుకొండ	42
సత్తెనపల్లి	41
చిలకలూరిపేట	40
గుంటూరు	41
మంగళగిరి	41
తాడేపల్లి	41
తెనాలి	39
బాపట్ల	37
చీరాల	37
రేపల్లె	33

జాగ్రత్తలు తీసుకోవాలి..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయ టకు వెళ్లే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు నీటిని ఎక్కువగా తాగాలని, రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిదంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎండలో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. మజ్జిగ కొబ్బరి నీళ్ల పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచి స్తున్నారు. ద్విచ క్ర వాహనంపై ఎక్కు వ దూరం ప్రయా ణించ రాదన్నారు.


మరమ్మతుల కోసం ఫ్రిజ్‌లను తరలిస్తున్న దృశ్యం

ఉచితం.. అనుచితం

ఇష్టారీతిన ఇసుక వినియోగం

బంగారంలాంటి ఇసుక వృథా అవుతోంది. ఉచితం పేరుతో కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఇసుకను కొందరు దుర్వినియోగం చేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.వేలకు వేలు వెచ్చించి కొనుగోలు చేసిన ఇసుక ఇప్పుడు అందుబాటు ధరలో లభిస్తుండటంతో ఇష్టం వచ్చినట్లుగా వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇసుక కారణంగా నిర్మాణదారులు పడిన కష్టాలు తీర్చేందు కోసం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టి సామాన్యులకు సైతం అందుబాటులో ధర ఉండేలా చేస్తే కొందరు దానికి విలువ లేకుండా చేస్తున్నారు. తక్కువ ధరకే ఇసుక లభిస్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తున్నారు. రియల్టర్లు వెంచర్లను మట్టికి బదులు ఇసుకతో మెరక చేసుకుంటున్నారు. వాహనదారులు పరిమితికి మించి ఇసుకను నింపుకుని వెళ్తుండటంతో అదంతా జారిపోయి రోడ్లన్నీ ఇసుకతో నిండిపోతున్నాయి. ఈ ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఇసుక దుర్వినియోగం అవుతున్నా.. వృథాగా రోడ్డు పాలవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుకను దుర్వినియోగం, వృథా చేసిన వారిపై కేసులు నమోదు చేయగా ప్రస్తుతం ఆ ఊసే ఎక్కడా కనిపించడం లేదు.


ఉచిత ఇసుకతో ప్లాట్ల మెరక

తెనాలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఇసుక కష్టాలతో నిర్మాణ దారులు అల్లాడిపోయారు. ఇసుక అందు బాటులో లేక కూలీలకు పనులు కూడా దొరకలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసి నిర్మాణ దారులకు ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంది. భవన నిర్మాణాలకు ఇసుక కావాలంటే గత వైసీపీ ప్రభుత్వంలో రూ.లక్షలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఉంటే ప్రస్తుతం కేవలం నామమాత్రపు కూలి ఖర్చులు చెల్లించి, సీనరేజ్ లేకుండా అందుతోంది. గతానుభవాల దృష్ట్యా ఇసుకను జాగ్రత్తగా వాడుకోవాలి. అయితే కొందరు దానిని దుర్వి యోగం చేస్తుండగా.. మరికొందరి నిర్లక్ష్యం కారణంగా వృథా అవుతోంది. తక్కువ ధరకే ఇసుక లభిస్తోండటంతో ఇష్టమొచ్చినట్లు వాడేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు పలికింది. ఇప్పుడు అదే ఇసుక రూ.6 వేల నుంచి రూ.9 వేలలోపు వచ్చేస్తుండటంతో దానికి విలువ లేకుండా పోయింది. సాధారణంగా రియల్టర్లు వెంచర్ల మెరక కోసం ఎర్రమట్టి లేక బుసక మన్నును వినియోగిస్తుంటారు. అయితే మట్టి, బుసక ధరకే ఇసుక వస్తుండటంతో దానినే మెరకకు వాడుతున్నారు. దీంతో బంగారం లాంటి ఇసుక కట్టడాలకు ఉపయోగపడకపోగా, భూగర్భంలో కప్పబడిపోతోంది. అనుచితంగా ఉపయోగించేస్తుండటంతో భవిష్యత్‌లో కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.

వృథాతో పాటు ప్రమాదాలు

ప్రకాశం బ్యారేజి దిగువున గుండిమెడ, పెదకొండూరు, అత్తలూరివారిపాలెం, బొమ్మువానిపాలెం రీచ్‌లు గడువు ముగిసి మూతపడగా ప్రస్తుతం గాజుల్లంక రీచ్‌కు ఒక్కదానికే అనుమతులు

(మిగతా 2వ పేజీలో)

వాల్టా ఉల్టా

రీచ్‌ల్లో కూలీలతో వాహనాలకు ఇసుకను లోడ్ చేయాల్సిన కాంట్రాక్టర్లు లారీలను నేరుగా నదిలోకి దింపేసి ఎక్స్‌కవేటర్లతో తోడి పోసేస్తున్నారు. వాల్టా చట్టం ఉల్టా అవుతుండగా గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు నదిలో కలసిపోతున్నాయి. అయినా అధికారులు రీచ్‌ల వైపు కన్నెత్తి చూడటంలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలు పూర్తిగా తుంగలో తొక్కారనుకుంటే, ఇప్పుడు వాటికి మించి ఉల్లంఘనలు జరుగుతున్నాయి. నదిలోని నీరు బయటకు వచ్చేలా పది నుంచి 15 అడుగుల వరకు లోతుపెట్టి తవ్వేస్తున్నారు. దీంతో నదీ తీర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి వేసవి మొదలు కాకముందే నీటికి కటకట ఏర్పడుతోంది.

1 తక్కువ ధరకు వస్తుందని వెంచర్ల మెరకలకూ..
1 పరిమితికి మించి లోడింగ్‌తో రోడ్లపై జారిపోతున్న ఇసుక
1 ఇసుక మయంగా మారిన రహదారులపై నిత్యం ప్రమాదాలు
1 టీడీపీ ప్రభుత్వంలో దుర్వినియోగం చేసిన వారిపై కేసులు
1 అధికారుల నిర్లక్ష్యం.. రీచ్‌ల్లో ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు


ఓవర్ లోడ్‌తో ఇసుక లారీ

కాసులిస్తే.. కావల్సినంత

నదిలోని ఇసుకను కూలీలతో ట్రాక్టర్లకు లోడ్ చేయించి ఒడ్డుకు తీసుకొచ్చి నిల్వ పోసి ఎక్స్‌కవేటర్‌తో లారీల్లో నింపాలనేది నిబంధన. ఇలాగైతే ఇసుకను పరిమితికి మించి పోయకుండా కొలత ప్రకారం పోసి డబ్బు తీసుకునేవారు. కానీ కూలీలతో పనిలేకుండా భారీ యంత్రాలను నేరుగా నదిలోకే దింపేసి, ఇసుకను ఇష్టమొచ్చినట్లు పోస్తున్నారు. అది ఎంతగా అంటే మార్గమధ్యలో లారీల నుంచి రోడ్లపైకి కారిపోయేటంత. ఆరు చక్రాల లారీకి 18 టన్నులు, 10 చక్రాల లారీకి 24 టన్నుల వరకు అనుమతిస్తుంటే, 6 చక్రాల లారీలో 25 నుంచి 30 టన్నుల వరకు, 10 చక్రాల లారీలో 40 టన్నుల వరకు, ఇక 12 చక్రాల లారీల్లో అయితే 40 నుంచి 60 టన్నులపైనే ఇసుక పోసేస్తున్నారు. అదనంగా పోసిన ఇసుకకు అదనంగా డబ్బు దోచేస్తున్నారు.

గ్రానైట్.. పట్టించుకోరూ!

ఆదుకుంటేనే పరిశ్రమ పునర్వైభవం
గత ప్రభుత్వంలో మనుగడ ప్రశ్నార్థకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల వైసీపీ హయాంలో జిల్లాలో కొత్తగా ఒక్క పరిశ్రమ తెచ్చిన దాఖలాలు లేవు. అయితే వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమను కోలుకోకుండా దెబ్బ తీసింది. గ్రానైట్ రంగాన్ని కేవలం ఆదాయం పిండుకునే వనరుగానే చూసిందే తప్ప యజమానుల ఇక్కట్లు, కార్మికుల వెతలపై కనీస స్థాయిలో కూడా సమీక్ష జరిపిన పాపాన పోలేదు. గ్రానైట్ లీజుల తనిఖీల పేరిట అధికారులను ఉసిగొల్పడం, భారీ జరిమానాలతో బెదిరించి వారిని దారికి తెచ్చుకుంది. కొవిడ్ మహమ్మారితో కునారిల్లిన గ్రానైట్ రంగం, జగన్ ప్రభుత్వ కక్ష పూరిత వైఖరితో మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వంలో రీ సర్వే కోసం రూపొందించిన లక్షల రాళ్లు మూలన పడేయాల్సిన పరిస్థితి రావడంతో మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు గ్రానైట్ పరిశ్రమల పరిస్థితి తయారైంది. సరిహద్దులు దాటేటప్పుడు లారీల వద్ద ప్రైవేటు సైన్యంతో వసూళ్ల దందాల పర్వం వైసీపీ హయాంలో నడిచింది. రూ.22000 రాయల్టీ చెల్లించాల్సిన సాధారణ గ్రానైట్ రకాన్ని గెలాక్సీ రకంతో సమానంగా క్యూబిక్ మీటర్‌కు రూ.27,000 వసూలు చేసి యజమానులను చావుదెబ్బ కొట్టింది. గ్రానైట్ పరిశ్రమలకు విద్యుత్‌ను రాయితీపై అందిస్తానని గద్దెనెక్కిన వైసీపీ అది ఇవ్వకపోగా యూనిట్ చార్జీలు పెంచింది. కొవిడ్ సమయంలో మూడు నెలల విద్యుత్ బిల్లులను తిరిగి ఇస్తామన్న నాటి ప్రభుత్వం ఆ ఊసెత్తలేదు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గతేడాది మార్చిలో వారం రోజుల పాటు పరిశ్రమలను మూసేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో వైసీపీ పాలన ముగింపుకొచ్చే సరికి దాదాపు 30 శాతం గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయి. పాలిషింగ్ ఫ్యాక్టరీలు అయితే దాదాపు 150 వరకు తిరోగమన బాటలో ఉన్నాయి. పదివేల మంది కార్మికుల ఉపాధికి వైసీపీ ప్రభుత్వం గండికొట్టింది. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడంతో గ్రానైట్ పరిశ్రమకు జవసత్వాలు వస్తాయని యజమానులు ఆశపడ్డారు. ఇప్పటికే వారి సమస్యలపై ప్రభుత్వానికి పలుమార్లు వినతులు అందించారు. ప్రత్యక్షంగా వేలమందికి, పరోక్షంగా లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమపై ప్రభుత్వం దృష్టిసారించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాలో సంతమాగులూరు, మార్టూరు, బల్లికురవ మండలాల పరిధిలో గ్రానైట్ పరిశ్రమలతో పాటు వాటి అనుబంధ రంగాలు విస్తరించి ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 142 గ్రానైట్ పరిశ్రమలు ఉండగా, 575 వరకు పాలిషింగ్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. నెలకు రూ.400 కోట్ల వరకు టర్నోవర్ జరుగుతుంది. ప్రభుత్వానికి ఈ రంగం నుంచి ఏడాదికి పన్నుల రూపంలో రూ.110 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఈ పరిస్థితుల్లో గత సమస్యల పరిష్కారంతో పాటు వడ్డనలు, విద్యుత్ చార్జీల తగ్గింపు విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని యజమానులు కోరుతున్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన విద్యుత్ బకాయిలను కూడా వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. పరిశ్రమల పోత్సాహకం కింద ఇచ్చే నగదును గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆ నిధులపై దృష్టి పెట్టాలంటున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (శుక్రవారం)
సహరి : 5.00 (శనివారం)


వేమవరం వద్ద ఉన్న ఫ్యాక్టరీల్లో అమ్మకాలు లేక నిల్వ ఉన్న గ్రానైట్

భారంగా నిర్వహణ



నిర్వహణ పెనుభారంగా మారడంతో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. విద్యుత్ చార్జీలు, మైనింగ్ రాయల్టీ తగ్గిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. వాటి అమలు దిశగా చర్యలు చేపట్టాలి. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. కరెంట్ కట్‌తో ఇప్పటికే 20 పరిశ్రమలలో పనులు నిలిచిపోయి ఉన్నాయి. ఈ రంగం తిరిగి నిలదొక్కుకోవడం అనేది కూటమి ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.

-చిట్టిపోతు మస్తానయ్య, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షుడు, బల్లికురవ మండలం

గిట్టుబాటు కావడం లేదు



గ్రానైట్ పరిశ్రమల్లో అమ్మకాలు చాలా తక్కువగా ఉన్నాయి. పని రెగ్యులర్‌గా లేక గిట్టుబాటు కావడం లేదు. గడచిన మూడు, నాలుగేళ్ల నుంచి ఈ పరిస్థితి ఉంది. రాజస్థాన నుంచి వచ్చిన దాదాపు వెయ్యి మంది ఇక్కడ పరిశ్రమల్లో పనిచేస్తున్నాం. తిరిగి వెళ్లిపోదామని అనుకుంటున్నాం.

-కిషన్ రామ్, కార్మికుడు,రాజస్థాన్

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

u పురుడు పోసుకుంటున్న అమరావతి ఐకానిక్ ప్రాజెక్టు
u కీలక ప్రాజెక్టుపై తాజాగా అసెంబ్లీలో మంత్రి నిమ్మల ప్రకటన
u గత ప్రభుత్వంలో ఐకానిక్ బ్రిడ్జిలకు చంద్రబాబు శంకుస్థాపన
u ఉద్దేశపూర్వకంగా జగన్ ప్రభుత్వం నాడు రద్దు.. నేడు పెరిగిన నిర్మాణ వ్యయం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి, అమరావతి)

రాజధానికి గేట్ వేగా.. అమరావతివాసులకు తాగునీటి వనరుగా.. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రంగా.. వరదనీరు సముద్రంలోకి వృథాగా పోకుండా.. కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద గత టీడీపీ ప్రభుత్వం నిర్మించాలనుకున్న బ్యారేజి ఎట్టకేలకు పట్టాలెక్కనున్నది. అత్యద్భుత అమరావతి.. భావి అవసరాలు.. రాష్ట్రాభివృద్ధి ప్రణాళికల నేపథ్యంలో నాడు చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిన కీలక ప్రాజెక్టులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణానదిపై వైకుంఠపురం వద్ద బ్యారేజి కమ్ బ్రిడ్జిని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో 2019 ఫిబ్రవరి 13న ఇప్పటి ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పవిత్రసంగమం(ఫెర్రీ)-గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం లింగాయపాలెం గ్రామాల మధ్య ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నవయుగ కనస్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రాజధాని అమరావతితో పాటు ఈ బ్యారేజి నిర్మాణాన్ని కూడా ఉద్దేశపూర్వకంగా రద్దు చేసి అటకెక్కించింది. ఇంతటి కీలక ప్రాజెక్టుపై తాజాగా కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. వైకుంఠపురం బ్యారేజి నిర్మాణంపై గురువారం అసెంబ్లీ సమావేశాల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. బ్యారేజి విషయంలో అన్ని అనుమతులను సాధించి టెండర్లను పిలిచి పనులను కూడా కొంతమేర ఆరంభించామని గుర్తుచేశారు. బ్యారేజీ నిర్మాణాన్ని పట్టాలెక్కించేందుకు కొత్తగా డీపీఆర్‌ను తయారు చేయనున్నట్లు ప్రకటించారు. 15 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకునేలా బ్యారేజిని నిర్మించాలనుకుంటున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. నవ్య రాజధాని అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తున్న క్రమంలో ఈ బ్యారేజి అంశం తెరపైకి రావడంతో రాజధానివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాడు రూ.2,400 కోట్లు.. నేడు రూ.4 వేల కోట్లు

ఆరేళ్ల జాప్యం జరుగుతున్న కారణంగా బ్యారేజి నిర్మాణఖర్చు తడిసి మోపెడవనున్నది. ఇంచుమించే ఈ వ్యయం యాభైశాతాన్ని మించిపోయే అవకాశం ఉంది. జగన్ నిర్వాకం కారణంగా ఈ అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రజలు మోయక తప్పని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. గతంలో రూ.2,400 కోట్లతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు రూ.4 వేల కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు.

నిర్మాణం జరిగితే ఎంతో మేలు..

రాజధాని అమరావతికి గేట్ వేగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై తలపెట్టిన ఐకానిక్ బ్రిడ్జి ప్రకాశం బ్యారేజికి ఎగువున 23 కి.మీ, అమరావతికి దిగువున 7కి.మీ దూరంలో

(మిగతా 2వ పేజీలో)



ఐకానిక్ బ్రిడ్జి ఊహచిత్రం


2019లో బ్యారేజికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్ వెంకటమురళి


స్వచ్ఛాంధ్రపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో పర్యావరణాన్ని పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వాహణపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ ఉద్గారాలను పూర్తిగా నిషేధించాలని, విక్రయాలను అరికట్టాలన్నారు. భూమిలో కుళ్ళిపోయే పదార్థాలను మాత్రమే వినియోగించేలా ప్రజలను చైతన్యం చేయాలని తెలిపారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి కార్యక్రమం సూర్యలంక బీచ్ వద్ద శనివారం ఉదయం జరుగుతుందని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాల ద్వారా పర్యావరణానికి, ప్రజలకు కలిగే మేలుపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, సీపీవో కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సైడు కాల్వలకు శంకుస్థాపనలో టీడీపీ నాయకులు

కోలలపూడిలో కాలువకు శంకుస్థాపన

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం సైడు కాల్వల నిర్మాణానికి టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. గ్రామంలో కొండమీద బజారుకు సిమెంటురోడ్డు, సైడు కాల్వలు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15లక్షల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మంజూరు చేయించారు. దాంతో టీడీపీ నాయకులు తొలుత కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తరువాత సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడతామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. సతీష్ కుమార్, తాటినాగేశ్వరరావు, తాటి నాగార్జున, కందిమళ్ల కొండలరావు, వసంతరావు, మోహనరావు, పీఆర్ ఏఈ శాస్త్రి పాల్గొన్నారు.


లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

నీటి పథకాల మరమ్మతులకు శ్రీకారం

పర్చూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఆరు తడులు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను గత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. చిన్నపాటి మరమ్మతులతో వినియోగంలోకి తెచ్చే ఎత్తిపోతలను నిర్లక్ష్యం చేశారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలకు మరమ్మతులు చేయించి వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంకల్పించారు. రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారుల నేతృత్వంలో ఆయా స్కీమ్‌లను పరిశీలించి ఎస్టిమేట్‌లను తయారు చేసేలా బృందాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఆ బృంద సభ్యులు పర్చూరులోని శ్రీవెంకటేశ్వర, నివేదిత లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శ్రీరాం ప్రసాద్, ఆచంట సుబ్బారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, వెలగా శ్రీనివాసరావు, తులసి శంకర్, శిరిగిరి నాగేశ్వరరావు, శృంగవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కిడ్నీల పనితీరు మెరుగు పడేలా ఆరోగ్య సూత్రాలను పాటించాలని ఉప్పుటూరు హోమియా వైద్యుడు దాసరి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం గంగమ్మ గుడి ప్రాంగణంలో కిడ్నీ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిడ్నీల పనితీరు, అవి పాడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పాలేటి సుబ్బయ్య, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు


చినగంజాం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిగా నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన చినగంజాం గ్రామ సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారి రొంపేరు వంతెన సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన కథనం మేరకు బాపట్ల మండలంలోని చిల్లరగొల్లపాలెం గ్రామానికి చెందిన అతిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, కాట్ర రమేష్‌బాబు కారులో ఒంగోలు వెళ్లి తమ తిరిగి బాపట్ల వస్తున్నారు. చీరాల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు చీరాల నుంచి ఒంగోలు వెళ్తుంది. ఈ క్రమంలో రొంపేరు వంతెన సమీపానికి వచ్చే సరికి కారును బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, కారు డ్రైవర్ పుల్లెల జగన్‌కు తలపై తీవ్రగాయమైంది. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు, రమేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరరావు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ట్రాక్టర్ అపహరణ

చినగంజాం, మార్చి, 13 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ని అపహరించిన ఘటన మండలంలోని సంతరావూరు గ్రామ పరిధిలో జరిగింది. చినగంజాం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కారంచేడు మండలం కేశవరపాడు గ్రామానికి చెందిన సీహెచ్ అంకసుబ్బారావు సంతరావూరు గ్రామ పరిధిలోని పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. 2025 ఫిబ్రవరి 6న తన ట్రాక్టర్‌తో పొలాలకు నీరు పెట్టుకొని స్వగ్రామం వెళ్లారు. ఫిబ్రవరి 7న మధ్యాహ్నం సమయంలో అంకసుబ్బారావు పొలాల వద్దకు వచ్చి చూసేసరికి ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో పలు ప్రాంతాల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తేలికైన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పేరాల(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే తేలికైన ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని పలువురు మహిళా మండలి సభ్యులు అన్నారు. గురువారం పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో ఆరోగ్యం ఆనందం అను అంశంపై విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు కూరగాయలు ప్రదర్శనగా ఉంచి ఉపయోగాలను వివరించారు. ప్రతినిధులు నాగేంద్రమ్మ, పార్వతి, జయమ్మ, చాందిని, అరుణ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బ్యారన్‌లో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ధైవాలరావూరులో పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.4 లక్షల ఆస్తినష్టం

మేదరమెట్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బ్యారన్ దగ్ధమైన ఘటన మండలంలోని ధైవాలరావూరులో గురువారం ఉదయం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రావిపాటి వెంకటసుబ్బయ్య బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ జరుగుతుండగా ఒక్కసారిగా మంటలు రేగాయి. మంటలను అద్దంకి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ఆర్పింది. ఈ ప్రమాదంలో ఇంచుమించు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. పొగాకు బోర్డు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

శింగరకొండ తిరునాళ్లకు భారీ భద్రత

డ్రోన్లు, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

650 మంది పోలీసులతో బందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ

అద్దంకి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్లకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరగనున్న నేపథ్యంలో ఎస్పీ డూడీ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయం క్యూ లైన్‌లు, పోలీస్ అవుట్ పోస్ట్ కంట్రోల్ రూమ్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం దేవాలయంలో క్యూలైన్‌ల ఏర్పాట్లు గురించి ఈవో తిమ్మానాయుడుతో చర్చించారు. ట్రాఫిక్ విధులలో ఉండే సిబ్బంది అప్రమత్తంగా విధుల నిర్వహించాలన్నారు. అజాగ్రత్తగా ఉంటే ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడే అవకాశం ఉందన్నారు. దేవాలయం ప్రవేశ ద్వారం వద్ద తోపులాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రభల వద్ద అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. తిరునాళ్లకు 2.30 లక్షల మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున నలుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 46 ఎస్‌ఐలతో పాటు మొత్తం 650 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేవాలయం ప్రాంతంలో 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. తిరునాళ్ల ప్రాంతంలో రెండు డ్రోన్‌లతో నిఘా ఉంటుందన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఎస్పీ తుషార్ డూడీని ఈవో తిమ్మానాయుడు, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. చీరాల డీఎస్పీ మెయిన్, ఎస్బీ సీఐ నారాయణ, అద్దంకి టౌన్, రూరల్ సీఐలు సుబ్బారావు, మల్లికార్జునరావు, రమణయ్య పాల్గొన్నారు.


శింగరకొండ తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించి సూచనలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

తిరునాళ్లకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అద్దంకిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సౌకర్యార్థం శింగరకొండ తిరునాళ్లకు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ప్రత్యేక బస్సులు ప్రతి నిమిషానికి ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బెల్లం రామమోహనరావు గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. కేవలం టికెట్‌కు రూ.10 మాత్రమే చార్జీని తీసుకుంటారని తెలిపారు. అద్దంకి, ఇతర ప్రాంతాల ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

స్వామిత్వ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేతో ఇళ్ల స్థలాలు డిజిటలైజేషన్ జరుగుతాయని తద్వారా కొనుగోలు, అమ్మకాలు జరుపుకునే వారికి పరిస్థితులు సులువుగా ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి ఎల్.ప్రభాకరరావు అన్నారు. గురువారం మండల కార్యాలయంలో స్వామిత్వ కార్యక్రమంపై డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్వేలో ప్రతి ఒక్కరి ఇంటి స్థలాల కొలతలు ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో భూ వివాదాలు కూడా దాదాపుగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి మండలంలో ముగ్గురు పంచాయతీ సెక్రటరీలు, ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్‌లు, నలుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు బృందాలుగా ఏర్పడి కార్యాచరణ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో శివన్నారాయణ, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఈవోఆర్డీ రామకృష్ణ డివిజనల్ పరిధిలోని పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

భూ ఆక్రమణ కేసుల విచారణ వేగవంతం చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలపై నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావుతో కలిసి కేసుల విచారణ పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ ఆక్రమాలపై నమోదైన కేసుల విచారణను పోలీసులు వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సంబంధిత రెవెన్యూ, మునిసిపల్, రిజస్ట్రేషన్‌శాఖ అధికారులు సత్వరమే విచారణాధికారులకు అందించాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వాసు తదితరులు పాల్గొన్నారు.

17లోపు అన్నిశాఖలు సమగ్ర సమాచారం అందించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 24,25తేదీల్లో కలెక్టర్లతో నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు శాఖల వారీగా సమాచారాన్ని ఈనెల 17వ తేదీలోపు తనకు సమర్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో గురువారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీపీటీ ద్వారా వివిధ అంశాలను, ప్రధానంగా జిల్లాలోని పరిస్థితులను బట్టి టాప్-5శాఖలకు సంబంధించిన వివరాలు, ప్రస్తుత సమస్యలు, మూడు నెలల్లోగా వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను వెల్లడించాల్సి ఉన్నందున అందుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని ఆదేశించారు. ఈనెల 15న నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో సీపీవో వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఉచితం.. అనుచితం

(1వ పేజీ తరువాయి)

దక్కాయి. దీంతో ఇక్కడ మూడు నుంచి ఐదు ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుకను నదిలోకి తీసుకెళ్లి లారీలకు నేరుగా తోడేస్తున్నారు. పరిమితికి మించి ఇసుకను లారీల్లో నింపుతున్నారు. ట్రక్కులో కాకుండా చివరకు డ్రైవర్ క్యాబిన్‌పైన కూడా కొండలా ఇసుకను నింపేస్తున్నారు. పరిమితికి మించిన ఇసుక లారీల నుంచి వంతెనలు, మలుపులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద జారిపోయి గుట్టలుగా పడిపోతోంది. దీంతో గాజుల్లంక-తెనాలి, గాజుల్లంక-రేపల్లె, కొల్లిపర-తెనాలి, కొల్లిపర-గుంటూరు, పెదకొండూరు-మంగళగిరి, విజయవాడ రోడ్లు ఇసుక మయంగా మారాయి. తెనాలి వైకుంఠపురం మార్గంలో రైల్వే ట్రాక్ వంతెనకు దిగువగా గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఓవర్ లోడుతో వస్తున్న లారీల్లోని ఇసుక వాటికి పట్టి కిందికి జారిపోతోంది. వంతెన వద్ద ఇసుక కారణంగా ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. ఈ వద్దే గడచిన పది రోజుల్లో 28కిపైగా ప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. రేపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ కుటుంబం జారి పడి తీవ్రంగా గాయపడిన తండ్రి, చిన్నారి ప్రస్తుతం గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే తరహాలో ఇద్దరు సచివాలయ ఉద్యోగినులు జారిపడ్డారు. అదే సమయంలో వెనుకగా వస్తున్న కంటైనర్ వెంటనే బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఇదే తరహాలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా పరిమితికి మించి ఇసుకతో వస్తున్న లారీలపై నియంత్రణ లేకపోగా, కనీసం రోడ్డుపై పడిన ఇసుకను కూడా తొలగించడంలేదు. అటు ట్రాక్టర్లలోనూ ట్రక్కుకు మించి గోడుగా పోసుకొస్తున్న ఇసుక రోడ్లపైకి జారిపోతోంది.

కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నారు..

కూలీలతో ఇసుక లోడ్ చెయ్యాల్సిన రీచ్‌లలో కూలీలు ఎక్కడా కనిపించడంలేదు. ఉచిత ఇసుక విధానం వచ్చినప్పటి నుంచి అనుమతి పొందిన ఏ రీచ్‌లోనూ కూలీలు ఒకటి, రెండు రోజులు మినహా తర్వాత నేరుగా ఎక్స్‌కవేటర్లనే దింపేశారు. ప్రస్తుతం గాజుల్లంక, ఇతర రీచ్‌లలో ఎక్స్‌కవేటర్లే ఉంటున్నాయి. ఇటు ఉమ్మడి గుంటూరు జిల్లా, అటు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో గాజుల్లంక దగ్గర, పక్కనే శ్రీకాకుళం దగ్గర ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. బుధవారం పగలు, రాత్రి తేడా లేకుండా గాజుల్లంక రీచ్‌లో నాలుగు ఎక్స్‌కవేటర్లు, శ్రీకాకుళం రీచ్‌లో ఐదు ఎక్స్‌కవేటర్లు విరామం లేకుండా ఇసుక తవ్విపోస్తున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో దిబ్బలను తవ్వుతున్నారా అంటే అదీ లేదు. నీరు ఉబికివచ్చేలా తవ్వేస్తున్నారు. రాత్రి వేళల్లో నీటితో నిండిన ఇసుకను వాహనాలకు నింపేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ నీటితో తడిచి బురదగా మారుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పట్టాలెక్కనున్న.. వైకుంఠపురం బ్యారేజి

(1వ పేజీ తరువాయి)

నదిపై మూడు కిలోమీటర్ల నిడివిలో నిర్మాణం జరగనున్నది. 2019 జనవరి 12న శంకుస్థాపన జరిగిన ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే అటు హైదరాబాద్, జగదల్‌పూర్ హైవేలను, ఇటు ఎన్-10 రోడ్డు ద్వారా అనంతపూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నేరుగా రాజధాని అమరావతితో కనెక్ట్ చేసి ఉండేది. కేవలం రాజధాని అమరావతి కోణంలోనే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల వారికి కూడా ఈ ప్రాజెక్టుతో పెద్ద మేలు జరిగి ఉండేది. ఈ బ్రిడ్జి కమ్ బ్యారేజి నిర్మాణం వలన మున్నేరు, వైరా వంటి ఉపనదులతోపాటు మరికొన్ని వాగుల నుంచి వచ్చే వరద జలాలను ఈ జలాశయంలో నిల్వ చేసే అవకాశం కలుగుతుంది. రమారమి 10 టీఎంసీలకు పైగా నిల్వ చేయవచ్చునని జలవనరులశాఖ అంచనా వేసింది. ఫలితంగా కృష్ణానది వెంబడి మళ్లీ త్వరితగతిన జరీభూములు ఏర్పడే అవకాశాలు మెరుగవుతాయి. అలాగే జలరవాణాకు మంచి అవకాశం ఏర్పడుతోంది. పర్యాటకంగా కూడా ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది. ఈ బ్యారేజి నుంచి రాజధాని అమరావతికి ఎత్తిపోతల సాయంతో రోజుకు 350 క్యూసెక్కుల నీటిని తరలించాలని కూడా నిర్ణయించారు.

గరటయ్య, వెంకటేష్ ప్రత్యేక పూజలు

అద్దంకి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, చీరాల వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజల అనంతరం వారిని సత్కరించారు.

రైళ్లలో దోపిడీ ముఠా అరెస్టు

● ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలు

● మత్తు మందు ఇచ్చి బంగారు ఆభరణాలు అపహరణ

● రైల్వే సీఐ మౌలాషరీఫ్ వెల్లడి

ఒంగోలు క్రైం, మార్చి13(ఆంధ్రజ్యోతి): రైళ్లలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడే ముఠాను అరెస్టు చేసినట్లు రైల్వే సీఐ ఎస్‌కే.మౌలాషరీఫ్ తెలిపారు. ఈ ముఠాలో ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు చెందిన ముగ్గురు సభ్యులు కాగా కాజల్‌వర్మ, విజయేందర్‌లను అరెస్టు చేశామని, ఇంకా రచీత్‌శర్మ పరారీలో ఉన్నారని చెప్పారు. గురువారం ఒంగోలులో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ పై ముగ్గురు నిందితులు రైళ్లలో తిరుగుతూ ఒంటరిగా ప్రయాణం చేస్తున్న మహిళల పక్కన కూర్చొని వారికి మత్తుమందు ఇస్తారు. అనంతరం వారి వద్ద ఉన్న బంగారం ఆభరణాలను అపహరిచుకెళతారని తెలిపారు. గత ఏడాది నవంబరు 8న పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై నుంచి చీరాలకు టి.అనురాధ బయలుదేరారు. దోపిడీ ముఠాలో కాజల్‌వర్మ ఆమె పక్కన కూర్చొని కర్చీఫ్‌లో మత్తు మందు చల్లి దానిని ఆమె ముక్కు వద్ద పెట్టాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిన తరువాత మెడలోని సుమారు 120 గ్రాముల బంగారం గొలుసును చోరీ చేశాడు. ఈ మేరకు బాధితురాలు చీరాల రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సాంకేతిక పరిజ్ఞానంతో ఇరువురుని అరెస్టు చేశారు. కాజల్‌వర్మను రాయపూర్ ఎయిర్‌పోర్టులో జనవరి 22 అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ ముఠాలో విజయేందర్‌ను హర్యానాలో అరెస్టు చేసినట్లు వివరించారు. ఇంకా రచీత్‌శర్మ పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చీరాల రైల్వే ఎస్సై కొండయ్య, కానిస్టేబుల్ ఖాదర్‌బాషా, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఫలితాలలో మార్టూరు యువకుల ప్రతిభ

● ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు


కనిశెట్టి లీలా అవినాష్


ముక్తిపాటి శ్రీకాంత్

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలు 2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. మార్టూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు లభించాయి. వారిలో కనిశెట్టి లీలా అవినాష్‌కు 9వ ర్యాంకు, ముక్తిపాటి శ్రీకాంత్ 818వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా లీలా అవినాష్‌కు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ అధికారిగా, ముక్తిపాటి శ్రీకాంత్‌కు ఢిల్లీలో సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీస్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. వారిలో లీలా అవినాష్ తండ్రి కనిశెట్టి లక్ష్మయ్య గతంలోనే చనిపోగా తల్లి చంద్రమధులత ప్రస్తుతం ఇడుపులపాడులో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నారు. మార్టూరులోని శ్రీహర్షిణి విద్యాసంస్థలో 10 వతరగతి, ఇంటర్ చదవగా జేఎన్‌టీయూ నరసరావుపేటలో సీఎస్‌ఈలో బీటెక్ చేశారు. అదేవిధంగా మార్టూరు నేతాజీనగర్‌కు చెందిన శ్రీకాంత్ తండ్రి ముక్తిపాటి సుబ్బారావు ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. శ్రీకాంత్ 10 వతరగతి వరకు దర్శిలో, ఇంటర్ విజయవాడ నారాయణ కాలేజీలో, గుంటూరులోని ఆర్‌వీఆర్ జేసీ కాలేజీలో బీటెక్ సీఎస్‌ఈ కోర్సు చేశారు. ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన ఇద్దరు యువకులకు చెందిన మార్టూరు గ్రామంలోని వారి కుటుంబాలలో ఆనందాలు వెల్లి విరిశాయి. బంధువులకు, స్నేహితులకు వారి కుటుంబసభ్యులు మిఠాయిలు పంచిపెట్టారు. అంతేగాకుండా పలువురు వారిద్దరి కుటుంబ సభ్యులను అభినందించారు.


నాగాంజనేయులును సత్కరిస్తున్న ప్రతినిధులు

మిజోరం సెంట్రల్ వర్సిటీ ఈసీ విభాగాధిపతిగా చీరాలవాసి

చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మిజోరం సెంట్రల్ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాధిపతిగా చీరాలకు చెందిన పంచల వేంకట నాగాంజనేయులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా గురువారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, స్థానికులు ఘన సత్కారం నిర్వహించారు. చీరాల నుంచి ఇతర ప్రాంతాల్లో వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ ప్రాంత ఘనత చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గుద్దంటి చంద్రమౌళి, ఉగ్గిరాల మార్కండేయులు, గుర్రం వెంకటేశ్వర్లు, జిలానీ, షేక్ అబ్దుల్ సలామ్, డా. మోహన్ చంద్, కుమార్ పాల్గొన్నారు.


సాగర తీరంలో పూజలు చేస్తున్న వేద పండితులు

శివుని అనుగ్రహంతో అందరూ ఆనందంగా జీవించాలి

వాడరేవు(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజలందరూ శివుని అనుగ్రహంతో ఆనందంగా జీవించాలని హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు తాడివలస దేవరాజ్, బండారు జ్వాలా నరసింహం అన్నారు. గురువారం రాత్రి వాడరేవు సముద్రతీరంలోని ఆంజనేయుని విగ్రహం సమీపంలో సాగర హారతి నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు నగేష్‌కుమార్, వెంకటేష్, కార్తీక్ శర్మ, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా గుంటూరు ఆర్‌ఎస్ఎస్ విభాగ్ సంపర్క్ కృష్ణ మోహన్ హాజరయ్యారు. ప్రతిపౌర్ణమికి సాగర హారతి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పిక్కి నారాయణ, గురవయ్య, రామకృష్ణ, టీడీపీ గ్రామ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు రమాదేవి

ఫిషింగ్ హార్బర్‌తో ఉపాధి అవకాశాలు

వాడరేవు(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు తీరంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటైతే నిరుద్యోగులకు, మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. గురువారం తీరంలో మత్స్యకారులు, గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐక్యంగా ఉండి హార్బర్ ఏర్పాటు కోసం పోరాడదామన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి ఎన్. బాబూరావు, గ్రామస్థులు ఎరిపిల్లి రమణ, ధోని కనకరాజు, ఓసిపల్లి ఏసు, గంగిరి ఏసుబాబు, అర్జిలి సత్తిబాబు, శ్రీను, గాలి, బాబ్జీ మత్స్యకారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● ఏడుగురు జూదరుల అరెస్ట్ ● రూ.42,480 నగదు స్వాధీనం

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని బోయినవారిపాలెం వాదకు ఆనుకుని ఉన్న పొలాల్లో ఏడుగురు పేకాట రాయుళ్లు దర్జాగా ఆట ఆడుతున్నారు. దీంతో సమాచారం అందుకుని దాడులు నిర్వహించారు. వారి వద్ద రూ.42,480 నగదు స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్ట్ చేశారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ రోడ్డులో ప్రమాదాలు



అమరావతి నూలు మిల్లు దగ్గర జొన్నతాళి వైపు ఏర్పాటు చేసిన బారికేడ్లు


మార్టూరు వైపు రోడ్డులో పక్కకు నెట్టేసి ఉన్న బారికేడ్లు

- అడ్డుకట్టకు బారికేడ్ల ఏర్పాటు
- నెలరోజులుగా వాటిని పక్కన పడేసిన వైనం
- మళ్లీ తరచూ ఘటనలు

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు నుంచి జొన్నతాళి సెంటర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. దాంతో గతంలో పోలీసులు అమరావతి నూలు మిల్లు నుంచి కార్మికులు బయటకు వచ్చే ప్రధానమైన గేట్ వద్ద సర్వీసు రోడ్డులో మార్టూరు వైపు, జొన్నతాళి సెంటరు వైపు నాలుగు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాహనదారులు ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా నిదానంగా వెళ్లేందుకు అనుకూలంగా పోలీసులు రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే గత నెల రోజుల నుంచి మార్టూరు వైపు వచ్చే బారికేడ్లను రోడ్డు పక్కన పెట్టేశారు. జొన్నతాళి వైపు వెళ్లే బారికేడ్లను మాత్రం రోడ్డుపై అదేవిధంగా ఉంచారు. దానికి తోడు రాత్రి సమయంలో బారికేడ్లపై రేడియం స్టిక్కర్లు కూడా లేకపోవడంతో అక్కడ బారికేడ్లు ఉన్నాయనే విషయాన్ని వాహనదారులు మర్చిపోయి వేగంగా వాహనాలను నడుపుతున్నారు. వాస్తవంగా రాత్రి సమయంలో బారికేడ్లు కూడా వాహనదారులకు కనిపించలేదని పలువురు వాహనదారులు అంటున్నారు. గత వారం రోజులు కిందట కూడా ఒక ద్విచక్రవాహనదారుడు లారీని ఢీకొని ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఈ బారికేడ్లకు కొద్ది దూరంలోనే జరిగింది. గతంలో చాలా రోడ్డు ప్రమాదాలు ఈ సర్వీసురోడ్డులో జరుగుతుండడంతో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల కారణంగా చాలావరకు రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. మరలా ప్రస్తుతం ఈ సర్వీసురోడ్డులో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇటీవల మార్టూరు గ్రామానికి చెందిన యువకుడు స్కూటీపై వెళుతూ బారికేడ్ల సమీపంలోనే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు బారికేడ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిపై రాత్రి సమయంలో వాహన చోదకులకు కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను కూడా ఏర్పాటు చేస్తే, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వైభవంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవం

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వేంచేసిఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి 13వ బ్రహ్మోత్సవాలు కమిటీ ప్రతినిధులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం పొన్నమాను సేవ, ఎదురుకోల మహోత్సవం రాత్రికి స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అలాగే గురువారం తలంబ్రాల సేవ, సాయంత్రం రథోత్సవాన్ని మేళ తాళాల నడుమ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ, స్వామి ఏకాంత సేవ జరిపారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ముక్తేశ్వరంలో విద్యుత్ వైర్లు తగిలి కాలిపోతున్న వరి గడ్డి

వరిగడ్డి దగ్ధం

కరెంట్ వైర్లు తగలడంతో ప్రమాదం

బల్లికురవ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నేల జారి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి పొలం నుంచి ట్రాక్టర్‌పై తెస్తున్న వరి గడ్డి దగ్ధమైంది. అందిన సమాచారం మేరకు అరిపినేని శేషయ్య అను రైతు వరి పంట నూర్పిడి చేసి ట్రాక్టర్‌పై వరి గడ్డిని ఇంటికి తీసుకు వస్తుండగా గ్రామంలో వచ్చే సరికి సీసీ రోడ్లపై ఉన్న స్తంభాలు డౌన్ అయి వైర్లు నేల జారి ఉండి ట్రాక్టర్‌పై ఉన్న గడ్డికి తగిలి మంటలు చెలరేగాయి. వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ ట్రక్కును పైకి లేపి గడ్డిని కింద పడేశారు. ఈప్రమాదంలో రెండు ఎకరాల్లో వరి గడ్డి పూర్తిగా కాలిపోయింది. మంటలు వ్యాపించకుండా స్థానికులు మోటార్ల సహాయంతో కొంత అదుపు చేయగా అద్దంకి నుంచి వచ్చిన అగ్ని మాపకయంత్రం వచ్చి మంటలను ఆర్పివేసింది.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలకు గురై విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిన్నెకంటి అమరనాథ్ (33) అనే యువకుడు బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ సైదా గురువారం తెలిపారు. అమరనాథ్‌కు భార్య ఉన్నారు. మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన అమరనాథ్ గత నెల 25వతేదీ అర్ధరాత్రి మార్టూరు నుంచి నాగరాజుపల్లి గ్రామంలోని ఇంటికి మోటారుబైక్‌పై వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.దాంతో అతనిని కుటుంబసభ్యులు మార్టూరు, చిలకలూరిపేట, గుంటూరు,విజయవాడలలోని ప్రవేటు ఆస్పత్రులలో చికిత్స చేయించగా, బుధవారం రాత్రి అతనిని విజయవాడ నుంచి నాగరాజుపల్లి గ్రామానికి తీసుకువస్తుండగా మార్టూరు వద్ద మృతి చెందారు. భార్య స్నేహ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టమ్ చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదా తెలిపారు.

దాడి చేశారని సచివాలయ ఉద్యోగి ఫిర్యాదుపై కేసు

మార్టూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం ఉదయం దివ్యాంగుడైన సచివాలయ ఉద్యోగి దేశెట్టి వెంకట సూర్యకుమార్‌పై గ్రామానికి చెందిన మూకిరి డానియేలు దాడిచేసి గాయపరచినట్లు గురువారం స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ వివరాలు ఇలావున్నాయి. వలపర్ల గ్రామ సచివాలయంలో గతంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేసిన సూర్యకుమార్ ప్రస్తుతం జె.పంగులూరు మండలానికి బదిలీ అయ్యారు. అయితే గతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ పనుల నిమిత్తము బిల్లులు పుస్తకాలు ఇవ్వలేదనే ఆగ్రహంతో ఉదయం సూర్యకుమార్ ఇంటి వద్దకు వెళ్లిన డానియేలు పరుషపదజాలంతో అవమానకరంగా మాట్లాడడంతోపాటు, సైకిలు చైన్‌తో సూర్యకుమార్‌పై దాడి చేసిగాయపరచారు. ఈ మేరకు సూర్యకుమార్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

జాగ్రత్తలు పాటించకుంటే చర్యలు

వాహనదారులకు ఆర్టీవో రామకృష్ణారెడ్డి హెచ్చరిక


టార్పాలిన్ పట్టా లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌కు చలానా విధిస్తున్న ఆర్టీవో రామకృష్ణారెడ్డి

చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆర్టీవో రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గురువారం జాతీయ రహదారిలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇసుక రవాణా చేస్తూ టార్పాలిన్ పట్టలు కప్పకుండా అజాగ్రత్తగా ఉన్న పలు ట్రాక్టర్‌లకు చలానాలు విధించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు వెంట ఉండాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. తనిఖీలలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ రవి నాయక్, రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు.

45 మందికి కంటి పరీక్షలు

బల్లికురవ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ వైద్య బృందం గురువారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 25 మంది కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం అని గుర్తించారు. వారికి వెంటనే శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలతో ఉన్న చిన్నారులతో విద్యాశాఖ అధికారులు

బాలల్లో నైపుణ్యాలను గుర్తించాలి

వేటపాలెం(చీరాల), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బాలల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం వలన ఉన్నతంగా ఎదుగుతారని విద్యాశాఖ అధికారులు సుబ్బయ్య, పురుషోత్తం అన్నారు. గురువారం మనో వికాసం - లోక్ కళాకార్ దివస్ కార్యక్రమం వేటపాలెం ప్రాథమిక పాఠశాల(ఓఆర్ఎస్)లో నిర్వహించారు. మంగళ, బుధ, గురువారం వరకు నిర్వహించిన బాలల నైపుణ్యాల వర్క్‌షాప్‌లో నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు చిత్రలేఖనం, చేతిరాత, వక్తృత్వం, ఏక పాత్రాభినయం పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మంజులాదేవి, యాపిల్ గ్రేస్, మల్లేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శివకుమారి, సరళ, వెంకటేశ్వర్లు, బీ వెంకటేశ్వర్లు, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బోల్తా .. ఇద్దరికి తీవ్రగాయాలు


మూడివారిపాలెం వద్ద జాతీయ రహదారిపై తిరగబడిన కారు

పంగులూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో ఇరువురు వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం జాగర్లమూడివారిపాలెం ఫ్లైవోవర్ సపమీపంలోని సురభి డెయిరీ ఎదురు జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు తిరుపతి నుండి విజయవాడ వైపు కారు వేగంగా వెలుతూ ఎదురుగా వెలుతున్న వాహనాన్ని బలంగా ఢీకొని డివైడర్ దాటి ఒంగోలు రోడ్డులో పడిపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కార్తీక్, హైమావతికి తీవ్ర గాయాలు కాగా, హిమజకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఒంగోలు సంఘమిత్ర వైద్యశాలకు తరలించినట్లు అంబులెన్స్ వైద్య సహాయకులు కోటేశ్వరరావు, మధుబాబు తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించాలి

- బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ జనరల్ సెక్రటరీ చెంచుపున్నయ్య
- ఎన్టీఆర్ క్రీడా స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన


పర్చూరు ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న చెంచు పున్నయ్య

పర్చూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలను మరింత పోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ జనరల్ సెక్రటరీ కరణం చెంచు పున్నయ్య అన్నారు. కేవలం విద్యపై దృష్టిపెట్టడంతో పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పర్చూరులో రూ.2కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను పోత్సహించాలన్న సంకల్పంతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన అనేక క్రీడా ప్రాంగణాలు గత వైసీపీ పాలనలో నిరాధరణకు గురయ్యాయన్నారు. కొద్దిపాటి నిధులతో వినియోగంలోకి వచ్చే క్రీడా ప్రాంగణాలను కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావడంతోపాటు క్రీడాకారులకు తోడ్పాటునందించాలన్న లక్ష్యంతో ముందకు సాగుతుందన్నారు. పర్చూరు క్రీడాప్రాంగణం అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషిని అభినందించారు. గ్రామీణ క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు తీర్చి దిద్దేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తంగెళ్ల మల్లికార్జునరావు, ప్రకాశం జిల్లా మాజీ బ్యాడ్మింటన్ సెక్రటరీ షాహీద్, పఠాన్ బాజీ పాల్గొన్నారు.

కనులపండువగా స్వామివార్ల కల్యాణం


ఉప్పుటూరు ఆలయంలో స్వామివార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఉప్పుటూరు(పర్చూరు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలం ఉప్పుటూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత అమరేశ్వర స్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు సారథ్యంలో కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. గురువారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం, రథోత్సవాన్ని చేపట్టారు. వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకుల సారథ్యంలో పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు, ఎదరుకోల ఉత్సవాలు నిర్వహించారు. గ్రామ నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్ల కల్యాణాన్ని తిలకించి పరవశించారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలి మృతి


చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని వృద్ధురాలు(65) ఈపూరుపాలెం - స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ మధ్య మృతి చెందారు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమె తెలుపు, బులుగు రంగు నైటీ ధరించి ఉన్నట్లు తెలిపారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలన్నారు.


మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

ఘనంగా మొల్ల జయంతి వేడుకలు

చీరాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గురువారం పట్టణంలో టీడీ పీ కూటమి ఆధ్వర్యంలో ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వే డుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రతినిధులు పట్టణంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కవయిత్రిగా మొల్ల రచించిన రచనలు సామన్యులకు సైతం అర్థమయ్యేవని వివరించారు. సంస్కృత, తెలుగు రచనలు రచించి ప్రజల గుండెల్లో మొల్ల చిరస్థాయిగా నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకి టౌన్ : కవయిత్రి మొల్లమాంబ జయంతిని శింగరకొండలోని శాలివాహన అన్నదాన సత్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్లమాంబ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సత్రం అధ్యక్షుడు కొడిమెల వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.



16న శ్రీపొట్టి శ్రీరాములు జయంతి

నెల్లూరు (హరనాథపురం) : అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఈ నెల 16న నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటలకు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తామని తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : 6.24
సహరి (శనివారం) : 5.02

- వేసవిలో విద్యుత్ అంతరాయం కలగనివ్వం
- 'ఆంధ్రజ్యోతి'తో విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

'కోత'ల్లేని కరెంటుకు ప్రత్యేక ప్రణాళిక

వేసవిలో ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కోతలు, అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేసేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

? వేసవిని ఎలా ఎదుర్కొంటారు

! వేసవిలో కరెంటు వినియోగం భారీగా పెరుగుతుంది. రానున్న రెండు నెలల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున దానిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం. ముఖ్యంగా నగరం, పట్టణాలతో పాటు మండలకేంద్రాల్లో లోటల్టేజీ, అధికలోడ్ ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తిస్తున్నాం. రాత్రిపూట అధికలోడ్ నమోదవుతున్న అన్ని ప్రాంతాల్లో రీడింగ్ తీయిస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడం ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నాం.

? పరికరాల కొరత ఉందా

! వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు కండక్టర్‌లు, ఇతర పరికరాల అవసరం ఎక్కువ ఉంటుంది. అవసరమైన పరికరాలను ఇప్పటికే స్టోర్‌లో ఉంచాం. దీంతో పరికరాల కొరత ఎదురయ్యే అవకాశం లేదు.



? సింగిల్ ఫేస్ లైన్ల పరిస్థితి ఏమిటి

! సింగిల్‌ఫేస్ లైన్‌తో కొంతమేర అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రాధాన్యత గత ప్రాంతాలను గుర్తించి దాదాపు 70 కి.మీ మేర త్రీఫేస్‌గా మార్చుతున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలపై లైన్‌మన్‌ల ఫోన్ నెంబర్లు రాయిస్తున్నాం. వాటికి ఫోన్ చేయవచ్చు.

? డిమాండ్‌కు తగ్గ కోటా ఉందా

! వేసవిలో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు వాడకం పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా జిల్లాకు కోటా ఉంది. కేవలం సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తప్ప వేసవిలో కోతలు ఉండవు. అలాగే సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకోవడం ద్వారా వేసవిలో విద్యుత్తు సమస్యను మరింతగా అధిగమించే అవకాశం కలుగుతుంది.

- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)


ఆంధ్రజ్యోతి

రాగూర్ సినిమా చూశారా!? అందులో హాస్పిటల్ సీన్ మీకు గుర్తుందా!? కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సంబంధించిన ఆ సీన్ ఎలా మరచిపోతారులే.

కానీ..

ఇలాంటి రాగూర్ సినిమాలు ఊరూరా కనిపిస్తున్నాయి. అయితే కథలో కొంచెం తేడా అంతే. ఆ సినిమాలో చనిపోయిన రోగిని బతికిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది డ్రామాలు ఆడతారు. ఇక్కడ కొంతమంది మోసగాళ్లు లేని వైకల్యం ఉన్నట్లు నటిస్తూ బోగస్ పింఛన్ల ఏరివేతకు వెళ్లిన డాక్టర్లకు నయా రాగూర్ సినిమాలను చూపిస్తున్నారు.

ఆ సినిమాలో చేయని చికిత్స చేస్తున్నట్లు డాక్టర్లు నటించారు. ఇక్కడ లేని రోగం ఉన్నట్లు చూపడానికి లబ్ధిదారులు నటించారు. ఎలాగైతేనేం నిజమే గెలిచింది. దొంగ నటుల గుట్టును డాక్టర్ల బృందం రట్టు చేసింది. వీరి పింఛన్ల రద్దు కోసం ప్రభుత్వానికి సిఫారసు చేసింది.



ఛ.. నిజంగా!

- బోగస్ పింఛన్ల వెరిఫికేషన్‌లో 'రాగూర్' సన్నివేశాలు
- లేని వైకల్యం ఉన్నట్టు చూపించే ప్రయత్నం
- బెడ్‌రిడన్ పింఛనుదారుల్లో 70 శాతం అనర్హులే
- కంగుతింటున్న విచారణాధికారులు
- ప్రభుత్వానికి చేరిన నివేదిక
- రాజకీయ జోక్యంతో భ్రష్టుపట్టిన మానవీయ పథకం

బోగస్ పింఛన్ల ఏరివేతకు నిర్ణయించుకున్న కూటమి ప్రభుత్వం తొలుత అనారోగ్యం, అంగవైకల్యం పేరుతో పింఛన్లు పొందుతున్న వారిని పరిశీలించడానికి డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో జనరల్ ఫిజీషియన్ (ఎండీ), ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్ల) డాక్టర్లను ఒక బృందంగా ఏర్పాటు చేసింది. ఒక్కో బృందానికి ఒక్కో నియోజకవర్గ పరిధిలోని పింఛనుదారుల వెరిఫికేషన్ బాధ్యత అప్పగించింది. జిల్లా పరిధిలోని తొమ్మిది నియోజకవర్గాలకు తొమ్మిది బృందాలను ఏర్పాటు చేసి విచారణకు వదిలిపెట్టింది. ఈ డాక్టర్ల బృందానికి గ్రామ సచివాలయ సిబ్బందిని సహాయకులుగా నియమించింది. లబ్ధిదారుల చిరునామాలు చూపడం వీరిపని. ఇలా మొదలైన ఈ సర్వేలో డాక్టర్లకు కనిపించిన సీన్లు ఎలా ఉన్నాయంటే..!!

'బెడ్‌రిడన్' కేసులు

బెడ్‌రిడన్ కేసులంటే పూర్తిగా మంచానికే పరిమిత మైన వారు. వీరు మంచం మీద నుంచి లేవలేరు. భోజనమైనా, ఒకటైనా, రెండయినా అన్నీ మంచం మీదే. వీరి అవసరాల కోసం ఎప్పుడూ ఒక మనిషి పక్కన ఉండాలి. ఇలాంటి వారికి నెలకు రూ.15వేల పింఛను ఇస్తారు. ఇలాంటి వారు జిల్లాలో 1,274 మంది బెడ్‌రిడన్ కింద పింఛన్లు పొందుతున్నారు. నిజంగా వీరు మంచానికే పరిమితం అయ్యారా!? లేదా!? అనే పరిశీలనకు వెళ్లినప్పుడు డాక్టర్ల కళ్లకు రకరకాల నటనలు కనిపించాయి. చాలా సందర్భాల్లో విచారణకు వెళ్లిన బృందం కూడా అంతే తెలివిగా నటించి బోగస్ పింఛనుదారుల గుట్టు రట్టు చేసింది.

స్థలం.. సన్నివేశం
కావలి నియోజకవర్గం

డాక్టర్ల బృందం ఒక లబ్ధిదారుని ఇంటికి వెళ్లిన సమయంలో ఒకతను మంచం మీద కూర్చొని ఉన్నాడు.

ఇక్కడ పింఛన్లు తీసుకునేది ఎవరండీ! అని అడిగారు డాక్టర్లు.

నేనే సార్.. అంటూ సమాధానం ఇచ్చాడు ఆ మంచం మీద కూర్చున్న వ్యక్తి.

నీకు పింఛను కాగితాలు, డాక్టర్ సర్టిఫికెట్లు చూపిస్తావా.. అని అడిగారు డాక్టర్లు

ఇప్పుడే ఇస్తాను ఉండండి సార్! అని గబగబాలేచి వెళ్లి కాగితాలు తెచ్చాడా లబ్ధిదారుడు

ఇంకేముంది.. అతను బోగస్ పింఛనుదారుడని, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అప్పటి డాక్టర్లు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారని తేలిపోయింది.

రీల్ నెం.2

ఈ ఇంట్లో పింఛను తీసుకునేది ఎవరండి అని అడిగారు డాక్టర్లు.

ఇప్పుడే బయటకు వెళ్లాడు సార్.. పిలుచుకొని వస్తానన్నాడు ఆ కుటుంబ సభ్యుడు.

రీల్ నెం.3

డాక్టర్లు విచారణకు వస్తున్నారు, మాట్లాడినా, మంచం మీద నుంచి పైకి లేచినా పింఛను ఆగి పోతుందనే సమాచా రం ముందే తెలిసిన లబ్ధిదారుడు డాక్టర్లు ఇంటికి వచ్చే సరికి గబగబ వెళ్లి మంచం మీద పడుకుంది.

వ్యవస్థలు పతనానికి పరాకాష్ట

జగన్ పాలనలో వ్యవస్థలు పతనం అయ్యాయని ప్రతిపక్ష నాయకుడి హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు చాలా సార్లు ఆరోపించారు. ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మాటలను అప్పుడు తేలిగ్గా తీసుకున్న వారికి ఇప్పుడు పింఛన్లలో వెలుగుచూస్తున్న అనర్హుల సంఖ్యను చూసి చంద్రబాబు అన్న మాటలు నిజమే కదా అంటున్నారు. దివ్యాంగుల పింఛన్లు కావాలంటే అందుకు డాక్టర్ల సర్టిఫికెట్ (సదరన్ సర్టిఫికెట్) అవసరం. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో ఈ సర్టిఫికెట్లు ఇస్తారు. ఇంత పకడ్బందీగా ఉన్న వ్యవస్థలో ఇంత భారీ స్థాయిలో అనర్హులకు ఎలా సర్టిఫికెట్లు ఇచ్చారంటేనే వ్యవస్థ ఎంత పతనం అయ్యిందో అర్థం అవుతుంది. వైసీపీ నాయకులకు డాక్టర్లే కాదు ఏ అధికారం ఎదురు సమాధానం చెప్పే రోజులు కావవి. ఆ కారణంగానే మానవీయ కోణంతో ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్లు రాజకీయ పార్టీల కార్యకర్తలకు జీతాలు ఇచ్చే పథకంగా మారిపోయింది.

• దివ్యాంగుల పింఛన్లలోనూ అనర్హులే

60 శాతం అంగవైకల్యం దాటిన వారు మాత్రమే దివ్యాంగుల పింఛన్లకు అర్హులు. కానీ కత్తిగాటు పడినవారు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు.. ఇలా ఎవరు పడితే వారు దివ్యాంగులుగా పింఛన్లు తీసుకొంటున్నారు. జిల్లాలో 32,718 మంది దివ్యాంగ పింఛన్లు తీసుకొంటుండగా ఇందులో సుమారుగా 10 వేల మంది అనర్హులుగా డాక్టర్ల విచారణలో గుర్తించబడ్డారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

క్లైమాక్స్ సీన్..

"నీ పేరేమిటయ్యా అడిగాడు డాక్టర్. సమాధానం లేదు. నీకు పింఛన్ వస్తోందా!? సమాధానం లేదు. నీ వేలిముద్ర వేసుకోవాలి చెయ్యి ఇలా ఇవ్వు. ఉలుకు లేదు.. పలుకు లేదు.

డాక్టర్లకు అర్థమయ్యింది. ఇది బోగస్ అని ముందే పక్కింటి వారు సమాచారం ఇచ్చి ఉండటంతో వీరు పరీక్షలకు దిగారు. ఆర్థోపెడిక్ డాక్టర్ సంచిలోంచి కమ్మిలాంటి పరికరం తీసి పడుకొని ఉన్న అతని అరికాలి మీద గీకాడు. జివ్వు మనడంతో చాపుకున్న కాలు కాస్త సరామని వెనక్కు లాగాడు.

కాళ్లు క్లియర్ అని అర్థం చేసుకున్న డాక్టర్ చెయ్యి మడిచి మోచేతి మీద రబ్బరు సుత్తితో సున్నతంగా కొట్టాడు. చెయ్యి కండీషన్‌లోకి వచ్చేసింది. ఇంక చాలు లే లే అన్నా అనగానే ఆ లబ్ధిదారుడు లేచి కూర్చున్నాడు. నిలబడన్నా ఒక ఫొటో తీసుకుందాం అంటే లేచి నిలబడ్డాడు. ఫొటో తీసి డాక్టర్ మొబైల్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా డీసీహెచ్ఎస్ కార్యాలయానికి రిపోర్టు పంపాడు. ఇక వస్తాం అన్నా అంటూ వెనక్కు తిరిగారు.

డాక్టరు గడప దాటుతుండగా నోరు తెరిచాడా లబ్ధిదారుడు. సార్.. నా పింఛను ఉంటుందా!! ఊడుతుందా!!!! అని

నవ్వుతూ వెళ్లిపోయారు డాక్టర్లు.

70 శాతం ఇంతే.. అంతా బోగస్సే!!

బెడ్‌రిడెన్ కింద జిల్లాలో 1,274 మంది పింఛన్లు తీసుకొంటుండగా వారిలో 70 శాతం మంది ఇలాగే అనర్హులైన లబ్ధిదారులు ఉన్నట్లు లెక్క తేలింది. 5 శాతం మంది అనారోగ్యంతో ఉన్నా బెడ్‌రిడెన్ కాదు. వికలాంగుల పింఛనుకు అర్హులవుతారు. నలుగురు ఎప్పుడో చనిపోయారు. ఇక మిగిలింది 25 శాతం మంది మాత్రమే ఈ పథకం కింద నెలకు 15వేల రూపాయల పింఛన్లకు అర్హులుగా లెక్కతేలింది.





హనుమపై రంగడి దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారానికి ఐదవ రోజుకు చేరాయి. ఉదయం వెణ్ణత్తాళి పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం విశేష పుష్పాలం కారణ, పూజలు జరిగాయి. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరిన రంగనాథస్వామి భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. ఈ సంద ర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

గృహ నిర్మాణ శాఖలో రూ.60లక్షల అవినీతి

ఏఈ, ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై వేటు

మనుబోలు (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో రూ. లక్షల్లో అవినీతికి పాల్పడిన ముగ్గురు అధికారులపై కలెక్టర్ ఆనంద్ గురువారం వేటు వేశారు. 2019-24 మధ్య కాలంలో మనుబోలు మండలంలో పాత ఇళ్లకు ఇసుక, సిమెంట్, స్టీలు సరఫరా చేయడంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీనిపై కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాలతో గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో దాదాపు రూ.60 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లు ధ్రువీకరించి నివేదికను అధికారులు కలెక్టర్‌కు అందించారు. దీంతో అప్పటి ఏఈ ఎస్.రవికుమార్‌ను, ఆయనకు సహకరించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మహేష్, మహేంద్రలను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



కౌన్సిల్ సమావేశంలో వాదులాడుకుంటున్న కార్పొరేటర్లు

నువ్వెంత.. ఆ నువ్వెంత!?

నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఎప్పటిలాగే సభ్యుల మధ్య వాగ్వివాదం, తోపులాటలతో రసాభాసగానే జరిగింది. నువ్వెంత అంటే... నువ్వెంత అంటూ టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు కూర్చున్న సీట్లలో నుంచి పైకిలేచి ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వల్ప ఉద్రిక్తతల నడుమ సాగిన సర్వసభ్య సమావేశంలో 91 అజెండా అంశాలకుగాను 89 ఆమోదించారు. అజెండాలో చేర్చినవన్నీ ముందస్తు అనుమ తులతో పనులు పూర్తి చేసి కౌన్సిల్లో పెట్టడంపై ప్రతిపక్ష కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. కాగ కాంట్రాక్టర్లకు నిలిచిపోయిన ఆర్థిక చెల్లింపులు, సచివాలయాల ఉద్యోగులకు జారీ చేస్తున్న షోకాజు నోటీసులపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై చర్చ సాగింది.

టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల వాగ్వివాదం, తోపులాట
రసాభాసగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం
91 అంశాలకు 89 ఆమోదం

నెల్లూరు(సిటీ), మార్చి13 (ఆంధ్రజ్యోతి) : అజెండా అంశాల్లో చేర్చిన అభివృద్ధి పనులపై చర్చ సాగిస్తూ అభ్యంతరాలను నివృత్తి చేయాలని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మేయర్ పోట్లూరి స్రవంతిని కోరారు. ఈ మేరకు కార్యదర్శి శ్రీలక్ష్మి అజెండా మొదలుపెట్టగా వైసీపీ సభ్యుడు బొబ్బల శ్రీనివాస యాదవ్ జోక్యం చేసుకుని డివిజన్లలోని సమస్యలను లేవనెత్తారు. అజెండా అయ్యాకే సమస్యలు వివరించాలని రూప్ జోక్యం చేసుకోగా ఇరువురి మధ్య వాగ్వివాదంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బొబ్బలకు మరో వైసీపీ కార్పొరేటర్ నాగార్జున్ తోడవడంతో రూప్ పక్షాన టీడీపీ కార్పొరేటర్ రాజశేఖర్ జోక్యం చేసుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఒకానొక దశలో తమ సీట్లలోనుంచి ముందుకు దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తోపులాట చోటుచేసుకుంది. బయట ఉన్న పోలీసులు సైతం కౌన్సిల్ హాల్లోకి వచ్చారు. అజెండా అంశాలన్నీ పూర్తయ్యాక సమస్యలు వివరించిన 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఇంతలో జోక్యం చేసుకున్న వైసీపీ కార్పొరేటర్ మహేష్ తన వద్దనున్న సమస్యలు వివరిస్తానని పట్టుపట్టారు. కమిషనర్ వివరణ అయ్యాక మాట్లాడాలని కర్తం సూచించినా ఆయన వినకపోవడంతో తన సీటు నుంచి కోపంగా దూసుకుని రావడంతో మరోసారి కౌన్సిల్లో ఉద్రిక్తత నెలకొంది.

• ముందస్తు అనుమతులపై అభ్యంతరం

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో 91 అంశాలను పొందు పరిచి అందులో 89 అంశాలను ఆమోదించారు. ఇవన్నీ మేయర్ ముందస్తు అనుమతులతో పనులు పూర్తి చేసి ఆపై కౌన్సిల్ తీర్మానం కోసం అజెండాలో చేర్చారంటూ వైసీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్లో చర్చ జరగకుండా, కార్పొరేటర్ల దృష్టికి పనులు తీసుకురాకుండా, డివిజన్లలో వాస్తవ పరిస్థితులు అధ్యయనం చేయకుండానే ర్యాటిఫికేషన్‌తో అజెండాలో చేర్చడం పురపాలక చట్టంలో లేదని, విపత్కర పరిస్థితుల్లోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలేతప్ప సాధారణ పరిస్థితుల్లో కాదని వారంతా వారించారు.

• ఆంధ్రజ్యోతి కథనాలపై చర్చ

నెల్లూరులో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు కార్పొరేషన్ నుంచి సుమారుగా రూ.45 కోట్ల వరకు బకాయిలు అందాల్సి ఉందని పేర్కొంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం పరిశోధనాత్మక కథనం వెలువడింది. దీనిపై కౌన్సిల్లో ప్రస్తావనకు తీసుకువచ్చిన కార్పొరేటర్ కర్తం పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకపోతే ఎలా? అంటూ ప్రశ్నించారు. అనంతరం సచివాలయాలకు వరుస షోకాజులతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారంటూ 'సర్వేలతో సతాయింపు' శీర్షికను ఆంధ్రజ్యోతిలో ఇటీవల వచ్చిన కథనంపైనా కార్పొరేటర్ బొబ్బల చర్చకు పట్టుపట్టారు. వీటిపై స్పందించిన కమిషనర్ సూర్యతేజ కాంట్రాక్టర్లకు ఆర్థిక చెల్లింపులు సిద్ధం చేస్తున్నామని, ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని బట్టి షోకాజులు నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. 'నగరంలో ఎలాగూ మనం దోమలను నిలువరించలేము. కనీసం వాటి సైజునైనా తగ్గించండి.' అంటూ 3, 5 డివిజన్ల కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, ఓజిలి రవిచంద్ర అధికారులను కోరారు. కాగ గత ఎంహెచ్‌వో వెంకటరమణయ్యపై ఆడిట్ నివేదిక ఆధారంగా రికవరీ ఎంత వరకు చేశారని కార్పొరేటర్ బొబ్బల కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఏ ఉద్యోగికైన బదిలీ సాధారణమన్న విషయం గుర్తించాలని సూచించారు. కౌన్సిల్లో జనసేన పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నూనె మల్లిఖార్జున యాదవ్ మాట్లాడుతూ నెల్లూరులో హోటళ్లపై తనిఖీలు లేవని, తద్వారా ప్రజల ఆరోగ్యం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

• స్టడీ టూరుకు పచ్చ జెండా

దేశంలో అభివృద్ధి చెందిన నగరాలను పరిశీలించేందుకు కార్పొరేటర్లను స్టడీ టూర్‌కు తీసుకెళ్లాలని డిప్యూటీ మేయర్ రూప్ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మేయర్, కమిషనర్లు త్వరలో స్టడీ టూర్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో రూ.60 కోట్లతో సోలార్ ఏర్పాటు, మరో రూ.25 కోట్లతో ఎన్ఎంసీ ఖాళీ స్థలాలకు ప్రహరీల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈ నెల నుంచి అమలు చేస్తున్న ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు కఠినంగా ఉంటాయని కౌన్సిల్లో తీర్మానించారు.



దేవేరులతో కలిసి తెప్పపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

లాహిరి లాహిరి లాహిరిలో..

బిట్రగుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదవరోజు గురువారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కాగా, ఉదయం నుంచే భక్తులు తరలిరాగా, గోవిందనామస్మరణలతో కొండ మారుమోగింది. సాయంత్రం స్వామివారికి చందనాలంకరణ జరిగింది. ఆలయ ఉత్తర ద్వారం ద్వారా ఉత్సవర్లను మేళతాలాతో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. ఎంతో అందంగా తీర్చిదిద్దిన తెప్పపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. రాత్రి గజ వాహనంపై స్వామివారు ఊరేగారు.

శ్రీవారికి హనుమంత సేవ



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కచ్చేరిమిట్టలోని శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి.రాత్రికి హోమం పూజల అనంతరం శ్రీవారు హనుమంతు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి నరహరి హరిబాబు-అమ్ములు, నరహరి సుబ్బరాయుడు - బుజ్జమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యానారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు , అర్చక బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆగిన ఇళ్లకు అదనపు నిధులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ మాధవ తదితరులు

కొండాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): నిధులు చాలక ఆగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేస్తుందని హౌసింగ్ ఈఈ ఎస్.మాధవ అన్నారు. మండలకేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఆగిన ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. 2014 నుంచి మంజూరయిన ఇళ్ల నిర్మాణాలు, గతంలో కేటాయించిన నిధులు సరిపోక ఆగిన నిర్మాణాలకు అదనపు నిధులు ఇస్తామన్నారు. జూన్‌లో గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కావలి రూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పాలీసెట్ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలీసెట్ ఎంట్రెన్స్‌కు ఏప్రిల్ 15 తుది గడువని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు రూ.100, ఓసీ, బీసీలు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 30న ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9949022772, 8328095743 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు. కాగా ఏప్రిల్ ఒకటి నుంచి పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాల, రుద్రకోటలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలీసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ కోత

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల తొలగింపు కోసం మహదేవపురం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని కొండికందుకూరు, బొడపాటివారి కొష్టాలు, శ్రీనివాసకాలనీ, మహదేవపురం, కాకిబంగారుపాలెం గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని, ఈ ప్రాంతంలోని వ్యవసాయ మోటార్లకు కూడా మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో 12 మందికి ఉద్యోగాలు

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. మదర్‌సన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొని ఎంపికలు నిర్వహించారు. 12మంది మూడురౌండ్ల క్వాలిఫైంగ్ టెస్టులు పాసై ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టీవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీ సురేష్, ఏవో రమేష్, ఈసీ విభాగాధిపతి వేణు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో అకడమిక్ ఆడిట్

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాలలో బోధన, అభ్యసన, పరిశోధనతో పాటు అవస్థాపన సౌకర్యాలు, విద్యార్థుల పురోగతి, పరిపాలన, హరితావరణం తదితర కార్యకలాపాలపై ఆడిట్ జరిగింది. కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టరు జయకుమారి, ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టరు మాణిక్యరావు కళాశాలలో ఆయా అంశాలను పరిశీలించారు. పరిశోధనల్లో పురోగతి సాధించాలని వారు సూచించినట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

అసంపూర్తిగా సచివాలయ పనులు

● పచ్చాకు కూలీలకు ఆవాసంగా భవనం ● పాలవెల్లువ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది



మాలకొండరాయునిపాలెంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయంలో కాపురముంటున్న పచ్చాకు కూలీలు



పాలవెల్లువ కేంద్రంలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

లింగసముద్రం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లక్రితం పనులు చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం అది పచ్చాకు కూలీలకు ఆవాసంగా మారింది. దీంతో సచివాలయ సిబ్బందంతా గ్రామంలోని పాలవెల్లువ కేంద్రంలో పని చేస్తున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2020లో మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం గ్రామాలకు కలిపి సచివాలయాన్ని మంజూరు చేశారు. దీంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.అయితే ప్రభుత్వం రూ.40 లక్షలతో ఈ గ్రామానికి సచివాలయ భవనం మంజూరు చేశారు.దీంతో కాంట్రాక్టరు భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. సగం పూర్తయ్యాక ప్రభుత్వం కాంట్రాక్టరుకు రూ.25 లక్షలు విడుదల చేసింది.దీంతో నిర్మాణ పనులను మరికొంత పూర్తి చేశారు.కానీ విద్యుత్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు ఇతర పనులు పూర్తి చేయాల్సి ఉంది.కానీ కాంట్రాక్టరుకు నిధులు విడుదల కాలేదు.దీంతో పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి.కాగా ప్రతిఏటా ఈ గ్రామానికి వచ్చే 10, 12 కుటుంబాల పచ్చాకు కూలీలకు ఇది ఆవాసంగా మారింది.

● పాలవెల్లువ కేంద్రంలోకి మార్పు

సచివాలయ సిబ్బందిని అద్దె ఇంటి నుంచి అధికారులు ఏడాది క్రితం అదే గ్రామంలోని పాలవెల్లువ కేంద్రంలోకి మార్చారు.దీంతో ఏడుశాఖల సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. వీరంతా ఒకే గదిలో, ఒకే ఫ్యాను కింద ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం



కావలి : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి13(ఆంధ్ర జ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ఎన్నో అనర్థాలు, రోగాలు వచ్చే ప్రమాదాలు ఉన్నందున, దాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం పట్టణంలోని వ్యాపారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తో కలిగే నష్టాలను తెలియచేస్తూ ప్రత్యామ్నాయంగా బయోడిగ్రబుల్ కవర్లు, జూట్‌బ్యాగుల వినియోగం గురించి వివరించారు. అనంతరం పాతూరు మున్సిపల్ హైస్కూల్, జడ్పీ ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు ప్లాస్టిక్, కాలుష్య నివారణ చర్యలపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ప్లాస్టిక్ వినియోగంలో కచ్చితమయిన నిబంధనలు పాటించాలని కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. కమిషనర్ కార్యాలయంలో ప్రజలకు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులకు గురువారం స్వచ్ఛాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 120 మైక్రాన్‌లకు మించిన కవర్లను వినియోగించాలని, లేనిపక్షంలో రూ.2000 నుంచి రూ.5000 వరకు జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదకొండూరులో భూ వివాదంపై వాగ్వాదం



క్లియరెన్స్ పనులు అడ్డుకుంటున్న కాలనీ వాసులు

కలిగిరి, మార్చి 13(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెదకొండూరులో భూవివాదంపై గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు, పెదకొండూరు సర్వే నెం760-1రులో 3.54 ఎకరాల్లో గతంలో తమకు ఇళ్లపట్టాలుగా మంజూరు చేసినట్లు, తమ పూర్వీకులు అక్కడ నివాసం ఉన్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. గ్రామానికి ఆ ప్రాంతం దూరంగా ఉండటంతో అక్కడ నివాసం ఉండటానికి ఎవరూ వెళ్లకపోవడంతో అక్కడ చిల్లచెట్లు పెరిగిపోయాయి. కానీ భూమి ఫెయిర్ అడంగల్ రికార్డు ప్రకారం పట్టాభూమిగా నమోదై ఉండటంతో సంబంధీకులు ఆన్‌లైన్ ఎక్కించుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. ఆ భూమిలో గురువారం క్లియరెన్స్ పనులు చేపట్టడంతో కాలనీవాసులు అడ్డుకోవడంతోపాటు విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై శుక్రవారం రెవెన్యూ కోర్టు నిర్వహిస్తామని, ఇరువర్గాలు రికార్డులతో తహసీల్దారు కార్యాలయానికి చేరుకోవాలని, రికార్డులు పరిశీలించాక భూమిపై నిర్ణయం తగిన విధంగా తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దారు రవీంద్రబాబు తెలిపారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమ్య

కావలి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వచ్చే ప్రాణాంతక వ్యాధి తలసేమియా వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్. రమ్య తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాక్రిష్ణన్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తలసేమియా వ్యాధిపై అవగాహన, ఉచిత రక్తగ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎం ఎం. సుగుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నెలల వ్యవధిలోనే బయటపడే ఈ వ్యాధి వల్ల పిల్లల ఆరోగ్యపరిస్థితి దయనీయంగా మారుతోందన్నారు. తలసేమియా వ్యాధి ఉన్నపిల్లలకు అండగా ఉండేందుకు కావలి రెడ్‌క్రాస్‌లో డేకేర్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డేకేర్ సెంటర్ కన్వీనర్ కే. హరినారపరెడ్డి, డాక్టర్ మదన్, టీమ్ సేవియర్స్ ప్రణీత, ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించండి



ముత్యాలపాడులో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు

లింగసముద్రం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని తడి,పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు.గురువారం ఆయన చినపవని, పెదపవని, ముత్యాలపాడు గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కేంద్రాల్లో తయారైన వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించాలన్నారు.అనంతరం ఆయన ఆయా సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.ప్రజల నుంచి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు.సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.అనంతరం ఆయన లింగసముద్రంలో సిబ్బంది చేస్తున్న ప్రభుత్వ సర్వేలను పరిశీలించారు.

వసతిగృహం ఆధునికీకరణకు రూ.3.3 కోట్లు

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహం ఆధునికీకరణకు పీఎం అజయ్ పథకం కింద రూ. 3.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అధునాతన సౌకర్యాలతోపాటు నూతన భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక వంటశాల, ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ద్వారా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేసిన కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొండాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 17 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని వివరించారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. మేకపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశం కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన వారంతా ఇంటర్‌లో చేరేందుకు అర్హులని, ఈనెల 17 నుంచి మే 25 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.వివరాలకు 8106433746, 7986375798 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన రచయిత్రి మొల్లమాంబ జయంతిని గురువారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సంఘం నాయకులు మాట్లాడుతూ మొల్లమాంబ రచనల గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అద్దంకి సుబ్బారావు, కలికివాయి కృష్ణ, ఆముదాలపల్లి మాల్యాద్రి, ఉప్పుటూరి వెంకయ్య, ఉప్పుటూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఇంటింటికీ..

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామని సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం వెంగళరావునగర్‌లో పర్యటించి, సమస్యలు గుర్తించి స్థానిక సచివాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో ఏమూలకు పోయినా దోమలు, పందులు, ముందుకు కదలని మురుగు, కుక్కల బెడద సమస్యలు విపరీతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు..

● చిన్ని యశోవర్ధన్



చిన్ని యశోవర్ధన్‌ను సత్కరిస్తున్న సాయి భక్తమండలి సభ్యులు

కావలి, మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, చదువుకునే వయసు నుంచి ఓ ప్రణాళికతో ముందుకు వెళితే విజయం తప్పక వరిస్తుందని ఫైసీ వెంటోరియస్ గ్రూప్ సీఈవో చిన్ని యశోవర్ధన్ తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో గురువారం సాయి భక్త మండలి ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత గడ్డ నెల్లూరుపై ఉన్న అభిమానంతో నెల్లూరు ఇండస్ట్రియల్ జోన్‌లో గ్రీన్ టెక్నాలజీ ఉపయోగించుకోవాలనే కోరికతో టెర్రినోవా గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని స్థాపించి, ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించానన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలి సభ్యులు అనుమలశెట్టి రామక్రిష్ణ, జీవీఎస్ ప్రసాద్, కేవీఎన్ కుమార్, కేవీ క్రిష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో గురువారం పేద మహిళకు పోలిశెట్టి శ్రీనివాసులు, సునీత దంపతులు కుట్టుమిషన్ అందించారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు మాట్లాడుతూ పేద మహిళకు కుట్టు మిషన్ అందించడం ద్వారా ఆ కుటుంబం ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి బ్రిడ్జికి మహర్దశ

● వైసీపీ పాలనలో అష్టకష్టాలు
● కూటమి పాలనలో తొలగిన వైనం

కావలి,మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెనకు మహర్దశ పట్టింది. గుంతలు మిట్టలుగా ఉన్న తారురోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతుండగా, దానిపై తారు రోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించారు. అలాగే వంతెన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ కూడ దెబ్బతిని పాదచారులకు ఇబ్బందికరంగా మారగా, వాటిని కూడా తొలగించి చదును చేయటానికి సిద్ధమవుతున్నారు. అది కూడా పూర్తి అయితే ఉదయగిరి బ్రిడ్జిపై వాహనచోదకులతోపాటు, పాదచారుల కష్టాలు పూర్తిగా తొలగనున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు, వాహనచోదకులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే వంతెన మార్గంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వాహనాలు రయ్..రయ్ మంటూ తిరుగుతున్నాయి.ఫుట్‌పాత్ నిర్మాణం కూడా చేపట్టడంతో త్వరలో పాదచారుల సమస్యలు కూడా తొలగనున్నాయి.



వంతెనపై కొత్తగా వేసిన తారురోడ్డు

వీవీపాలెంలో తరచూ గొర్రెల చోరీ

● ఇప్పటివరకు పదుల సంఖ్యలో అపహరణ ● ఆందోళనలో పెంపకందారులు

వలేటివారిపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో గుర్తు తెలియని దుండగులు గొర్రెలను అపహరించుకు పోతున్నారు. దీంతో పెంపకందారులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. పగలంతా మండుటెండలో గొర్రెలను మేపుకొని, రాత్రికి దొడ్లో తోలి నిద్రిస్తున్న సమయంలో దొంగలు గొర్రెలను అపహరించుకుపోతున్నారు. వారం వ్యవధిలో అయ్యవారిపల్లెకి చెందిన దండెబోయిన వేణుకు చెందిన 25 గొర్రెలను దుండగులు అపహరించుకపోయాయి. ఇది జరిగిన రెండు రోజులకే చుండిలో గొర్ల పున్నయ్యకు చెందిన 20 గొర్రెలను, ఓ పొట్టేలును దుండగులు అపహరించుకపోయారు. ఈ చోరీ జరిగిన జరిగిన మరుసటిరోజే కూనిపాలెంనకు చెందిన మిత్తుకుళ్ల శ్రీనివాసులుకు చెందిన 8 గొర్రెలు, ఒక పొట్టేలను దుండగులు చోరీ చేశారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని గొర్రెల పెంపంకందారుల్లో ఆందోళన నెలకొంది. చోరీకి గురైన గొర్రెలు విలువ సుమారు రూ.10 లక్షలకు పైగానే ఉంటుందని పెంపకందారులు చెబుతున్నారు. దుండగులను గుర్తించి వెంబడిస్తే మోటారుబైకులపై దొరక్కుండా వెళ్తున్నట్లు గొర్రెల పెంపకందారులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం పోలీసులకు చెబితే ఆ దొంగలను పట్టుకురండి... చర్యలు తీసుకొంటాం... లేదా మీరే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి. అప్పుడు సులభంగా దొంగలను పట్టుకోవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో పెంపకందారులంతా మూకుమ్మడిగా కలెక్టర్ వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

మిల్లర్లూ.. రైతులను ఆదుకోండి !



అల్లూరు : సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్, చిత్రంలో తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

అల్లూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): మిల్లర్లంతా రైతులకు సహకరించి ధాన్యం కొనుగోలు చేయాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరులో గురువారం రైతులు, మిల్లర్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమ కంటే ఎక్కువగా ఉండే ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని మిల్లర్లను కోరారు. కిలో చొప్పున అదనంగా ధాన్యాన్ని 18 శాతం తేమ ఉంటే కొనుగోలు చేయాలని, 19 శాతం ఉంటే మరో కిలో అదనంగా తీసుకోవాలన్నారు. మిల్లర్లు స్పందిస్తూ ఆ విధంగా తాము సేకరణ చేయలేమని, మరింత అధికంగా ధాన్యం ఇస్తే కొనుగోలు చేస్తామన్నారు. దీంతో రైతులు మిల్లర్ల మధ్య రసాభాస నెలకొంది. ఈ విషయంపై జాయింట్ కలెక్టరును సంప్రదించి, సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్తామని చెప్పి సభను ముగించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● దళారుల ప్రమేయం లేకుండా కొనుగోళ్లు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్నీ చర్యలు చేపట్టామని రాష్ట్ర సివిల్‌సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పండించిన ధాన్యం కొనుగోలు చేసి రైతు వాట్సప్ ద్వారా అన్నీ వివరాలు అందచేస్తామన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, అమ్మిన ధాన్యం నగదు 24 గంటల్లో వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, సివిల్ సప్లై అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మనుబోలు : హైవేపై లైట్ల వెలుగుల్లో వాహనాల రాకపోకలు

రాపూరు : పెంచలస్వామి ఆలయాన్ని కప్పేసిన మంచు



ఎనిమిదైనా.. ఎండ రాదే!

మార్చిలోనూ మంచు ఎఫెక్ట్!

సమయం ఉదయం ఎనిమిది కావస్తోంది. అయినా మంచు దుప్పటి వీడలేదు. భవనాలు, రోడ్లు, పొలాలు, కాలువలు ఇలా అన్నిటినీ మంచు కప్పేసింది. దీంతో రహదారులపై వాహనాలు లైట్ల కాంతిలో రాకపోకలు సాగించాయి. శివరాత్రి దాటాక చలి తగ్గినా.. మంచు మాత్రం మార్చి నెల సగం గడిచినా వీడలేదు. దీంతో కోతల



సంగం : పొలాల్లో దట్టంగా వ్యాపించిన పొగ మంచు

దశల్లో ఉన్న పైర్లకు తెగుళ్ల బాధ తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతు న్నారు. ఇక రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసిం హుడి ఆలయాన్ని మంచు కప్పేసింది. ఉదయం 9 గంటల వరకు మంచు పెంచలకోన క్షేత్రాన్ని కనువిందు చేసింది.

- మనుబోలు/సంగం/రాపూరు

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలలో 43 మంది విద్యార్థులకు గాను 36 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలలో 8217 మంది విద్యార్థులకు గాను 7717 మంది హాజరయ్యారు. కాగా, నెల్లూరులోని జెనేస్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

టెన్త్ ఇన్విజిలేషన్ బాధ్యత ఎస్‌ఏలదే!

- బాలికల కోసం మహిళా ఇన్విజిలేటర్లు
- పరీక్షల నిర్వహణపై శిక్షణ

నెల్లూరు(విద్య), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తున్న ట్లు జిల్లా అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఎస్‌ఏలకే పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నామని, దీనికోసం నిబద్ధత, విలువ లు కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఆరోపణలు ఉన్నవారిని, విధులు సక్రమంగా నిర్వహించని వారికి బాధ్యత లు అప్పగించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమిస్తుమన్నారు. ఈ మేరకు కసరత్తు పూర్తయిందని తెలిపారు. అలాగే ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకుల సంఖ్యను కూడా పరిగణలోకి తీసుకుని నియామకాలు చేపడుతున్నారు. బాలికల ను పరీక్షించేదుకు ప్రతి కేంద్రానికి ఒకరు లేదా ఇద్దరు మహిళా ఇన్విజి లేటర్లను నియమిస్తున్నారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ అందించగా, పరీక్షల సమయం ఆసన్నమవుతుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహించాల్సిన బాధ్య తలపై సమావేశాలు నిర్వహిస్తూ సంసిద్ధులను చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ప్రజల్లారా.. పట్టాలు అందుకోండి!

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం
- 150 గజాల్లోపు ఉంటే ఉచితంగా పట్టా
- నగరంలో వేలాదిమంది పేదలకు ఉపయోగం
- అపోహలతో వెనకడుగు వేస్తున్న అర్హులు

నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకొని ఉన్నా చాలా మంది పేదలు పట్టాలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఎప్పుడొచ్చి ఇళ్లను ఖాళీ చేయమంటారోనని కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం శుభవార్త అందించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ ద్వారా పట్టాలు అందించాలని నిర్ణయించింది. 2019, అక్టోబరు 15వ తేదీకి ముందు ఇళ్లు నిర్మించుకున్న వారందరినీ అర్హుల జాబితాలోకి చేర్చింది. ఇటువంటి వారు నెల్లూరు నగరంలో వేల మంది ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. వీరందరూ స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు, ఇంటిపన్ను, నీటి పన్ను వంటి ఆధారాలను చూపిస్తే వాటిని పరిశీలించాక అధికారులు అర్హులని తేలితే పట్టా మంజూరు చేస్తారు. అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ రెగ్యులరైజేషన్ పథకం వర్తిస్తుంది. లేఅవుట్‌లో ఓపెన్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ ప్రాంతాలు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లోని నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన ఇతర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే అటువంటి వాటిని క్రమబద్ధీకరించరు. 150 చదరపు గజాల్లోపు ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి ఎటువంటి చార్జీలు లేకుండా ఉచితంగా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేసి పట్టాను అందిస్తారు.



150 గజాలకుపైగా..

అయితే ఆపైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి కూడా ప్రభుత్వం ఒక అవకాశం కల్పించింది. ఈ స్థలాలను కూడా నిర్ణీత రుసుమును కట్టించుకొని క్రమబద్ధీకరించనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 150 నుంచి 300 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉంటే అటువంటి వారు భూమి బేసిక్ దరలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం భరించాలి. ఈ కేటగిరిలో దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. 300 నుంచి 450 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉన్న బీపీఎల్ కుటుంబాలు భూ విలువలో వంద శాతం చెల్లించడంతోపాటు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాలి. అదే ఉన్నత వర్గాలకు చెందిన వారు భూ విలువలో 200 శాతం చెల్లించడంతోపాటు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును భరించాల్సి ఉంటుంది. ఇక 450 గజాలకు మించి ఎవరు ఆక్రమణలో ఉన్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు కట్టడంతో పాటు వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలి. క్రమబద్ధీకరించి పట్టా అందించిన రెండేళ్ల తర్వాత వీరికి యాజమాన్య హక్కులు లభిస్తాయి. నెల్లూరులోనే ఎక్కువగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్నారు. ఇటువంటి వారందరికీ ఈ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఎంతో మేలు చేస్తుంది. అయితే ప్రభుత్వం మంచి అవకాశాన్ని ఇచ్చినా.. కొన్ని అపోహలతో పేదలు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి నెల రోజులు దాటినా ఇప్పటికి నెల్లూరు నగర పరిధిలో పదికి మించి దరఖాస్తులు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే ఎవరూ ఎటువంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించు కొని ఉన్న పేదలకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించింది. వారు ఆక్రమించుకొని ఉన్న స్థలాన్ని క్రమబద్ధీకరించుకొని పట్టా పొందేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎటువంటి అపోహలకు పోకుండా 2019 అక్టోబరు 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారు స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- లాజరస్, నెల్లూరు రూరల్ తహసీల్దార్

భూ సమస్యలపై సంయుక్తంగా సర్వే చేయండి

- అటవీ, రెవెన్యూ శాఖల సమీక్షలో కలెక్టర్ ఆనంద్



అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడు తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వ రపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అనేక భూసమస్యలపై అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం అటవీ, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. భూ వివాదాల విషయమై స్వయంగా తనిఖీలు చేప ట్టాలని, రీసర్వే జరుగుతున్న గ్రామాలను అధి కారులు సందర్శించి సమస్యలను పరిష్కరిం చాలని సూచించారు. ఆక్రమణలకు గురైన అటవీ భూముల విషయంలో కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. నగరవనాల అభివృద్ధి వేగంగా చేపట్టాలన్నారు. ఈ సమవే శంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా, రేంజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల చిన్నారికి నోబుల్ వరల్డ్ రికార్డ్

- కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామిపల్లి గ్రామానికి చెందిన ఆరు నెలల బాలుడు వీర శ్రీయాన్ మేధస్సుకు నోబుల్ వరల్డ్ రికార్డ్స్ వారు సర్టిఫికెట్ అంద చేశారు. ఈమే రకు గురువారం జిల్లా కలెక్టర్ ఆనంద్ తన కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు నోబుల్ సర్టిఫికెట్ అందచేశారు. గ్రామానికి చెందిన చందలూరి వీరు, ఊహ దంపతుల కుమారుడు వీర శ్రీయాన్ వయస్సు ఆరు నెలలు. ఏకసంతాగ్రహి. పలు రకాల కూరగాయలు, పండ్లు, జంతువుల ఫోటోగ్రఫీ ముందు పెడితే వాటిని గుర్తిస్తాడు. దీన్ని గమనించిన బాలుడి తల్లిదండ్రులు ఈ విషయాన్ని నోబుల్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల వారు నిర్వహించిన పరీక్షలో నెగ్గాడు. దీంతో ఆ బాలుడి ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్, మెడల్స్ అందచేశారు. ఈమేరకు నోబుల్ సర్టిఫికెట్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ బాలుడి తల్లిదండ్రులకు అందచేశారు. బాలుడి తల్లిదండ్రులను జిల్లాకలెక్టర్‌తో పాటు పలువురు అభినందించారు.



చిన్నారి తల్లిదండ్రులకు నోబుల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందచేస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి ఓ ప్రకటనలో కోరారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కోచింగ్‌కు అర్హులైన వారు ఈనెల 15లోగా వెబ్ ఆప్షన్ నమోదు చేసుకో వాలని సూచించారు. పూర్తి వివరాలకు 958 1630003 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఏటీఎం సేవలు బంద్

- చేతులెత్తేసిన నగదు నింపే కాంట్రాక్టర్
- ఏప్రిల్ 1 వరకు డబ్బులకు కటకట

నెల్లూరు (హరనాథపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆటోమెటిక్ టెల్లర్ మిషన్ (ఏటీఎం) సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడు తోంది. దాదాపు అన్ని కేంద్రా ల్లోని యంత్రాల్లో కరెన్సీ నోట్లు అయిపోవడమే ఇందుకు కారణమవుతోంది. జిల్లాలో 250కిపైగా ఏటీఎం కేంద్రాలు ఉన్నాయి. జాతీయ బ్యాంకులతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు కూడా ఉన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇతర జాతీయ బ్యాంకులకు సంబంధించి నగదును నింపే బాధ్యతలను ఏజీఎస్ కంపెనీ అనే సంస్థకు అప్పగించారు. అయితే, కాలపరిమితి ముగియడంతో నెల రోజుల నుంచి ఆ సంస్థ తన కార్యకలాపాలు నిలిపివేసింది. జిల్లావ్యాప్తంగా నగదు అయిపోయిన ఏటీఎం యంత్రాంలోకి తిరిగి కరెన్సీ నింపే వారు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నగదు కోసం ఏటీఎంలకు వెళుతున్న వినియోగదారులు తిరిగి ఊసూరుమని వెనక్కి వస్తున్నారు. బ్యాంకులు ఉన్న భవనాల్లోని ఏటీఎంలను మాత్రం నగదును బ్యాంక్ అధికారులే పర్యవేక్షిస్తుంటారు. దీంతో అక్కడ నగదు పుష్కలంగా అందుబాటులో ఉంది. ఇతర చోట్ల ఏర్పాటు చేసిన ఏటీఎంల అన్నింటిలోనూ కరెన్సీ ఉండటం లేదు. ఈ సమస్య ఈనెలాఖరు వరకు ఉంటుందని బ్యాంకుల వర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులోగా కొత్త కాంట్రాక్టరును ఏర్పాటు చేసి ఏప్రిల్ 1 నుంచి అన్ని ఏటీఎంలో నగదును అందుబాటులోకి తేవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.



నకిలీ ఎస్‌ఐ అరెస్ట్

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురం గ్రామానికి చెందిన యువకుడు పోలీస్ శాఖలో ఉద్యోగం రాకపోవడంతో నకిలీ ఎస్‌ఐగా చలామణి అవుతూ మోసానికి పాల్పడడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వేణుగోపాల్ తెపారు. ఆమేరకు ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో నిందితుడ్ని హాజరు పరిచారు. ఆయన వివరాల మేరకు.. అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరుకు చెందిన నన్న హరీష్ అనే యువకుడు నకిలీ ఎస్‌ఐగా అవతారమెత్తి స్థానిక చెక్ పోస్టు సెంటర్‌లో వాహనాలు నిలిపి తనిఖీ చేస్తుండగా సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్‌లు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడు ధరించిన పోలీస్ యూనిఫాం, బెల్టు, పోలీస్ లోగో టోపీ, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

హోలీ పేరుతో హద్దులు దాటితే చర్యలు

నెల్లూరు(క్రైం, (ఆంధ్రజ్యోతి): హోలీ పేరుతో హద్దులు దాటి ఇతరుల స్వేచ్ఛకు భంగం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జీ కృష్ణకాంత్ హెచ్చరించారు. హోలీ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న భద్రతా చర్యలను గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరం, పట్టణాలు, ప్రధాన కూడళ్లలో 67 పికెట్లు, 41 మొబైల్ పార్టీలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంతోష వాతావరణంలో పండుగ జరుపుకోవాలని, ఇతరులపై బలవంతంగా రంగులు వేయకుండా మర్యాద పూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. అల్లర్లు, అసత్య ప్రచారాలు, మహిళలను వేధింపులకు గురి చేస్తే కేసులు పెడతామన్నారు.

ముగిసిన జూ.ఇంటర్ పరీక్షలు



యాహూ.. పరీక్షలు అయిపోయాయ్!

నెల్లూరు (విద్య), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రధాన పరీక్షలు గురువారం పూర్తయ్యాయి. ఈ నెల 1న జిల్లాలోని 79కేంద్రాల్లో ప్రారంభమైన పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఒకేషనల్, మైనర్ సబ్జెక్ట్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. గురువారం జరిగిన కెమిస్ట్రీ-1, కామర్స్-1, ఒకేషనల్ పరీక్షలకు 27,595 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 27,753 మందికి 792 మంది గైర్హాజరవగా 26,961 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు 738 మందికి 634 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్‌ఐఓ ఎ.శ్రీనివాసులు 5, డీవీఈఓ 3, డీఈసీ 6, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్స్ 32 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు రోడ్లపై కేరింతలు పెడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరికొంతమంది అలింగనం చేసుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. ఏడాదిపాటు హాస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు పరీక్షలు పూర్తవడంతో సొంతూళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ, రైల్వే స్టేషన్‌లకు చేరుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా కనిపించాయి.



బాలికల కేరింత..



బై.. మళ్లీ వస్తాం..!

17 వాహనాల బహిరంగ వేలం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ అధికారులు తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న వాహనాలను వాటి యజమానులు విడిపించుకోకపోవడంతో గురువారం వేలం వేశారు. నగరంలోని ఉపరవాణా కమిషనర్ కార్యాయలంలో 17 వాహనాలకు బహిరంగ వేలం వేశారు. ఇన్‌చార్జి ఆర్టీవో ఎం బాలమురళీకృష్ణ మాట్లాడుతూ వేలం ద్వారా రూ.1.72 లక్షల ఆదాయం వచ్చిందని, ఆ నగదును సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు.

సముద్రపు ఒడ్డున తవ్వకాలు

- యథేచ్ఛగా రాత్రిళ్లు ఇసుక తరలింపు
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ అధికారులు



హేచరీ నిర్మాణ స్థలంలో చదును చేసిన ఇసుక

ఉలవపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు సముద్రపు ఒడ్డున (చెలియలి కట్టలో) ఉన్న ఇసుకను కూడా వదలడంలేదు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధి టెంకాయచెట్లపాలెం ఎదురుగా ఉన్న సముద్ర తీరంలోని ఇసుకను అక్రమార్కులు రాత్రిళ్లు అక్రమంగా తరలిస్తూ భారీగా ధనార్జన సాగిస్తున్నారు. తీరప్రాంతంలో హేచరీల నిర్మాణం కొనసాగుతున్నాయి. వీటి నిర్మాణం చేపట్టే భూములు లోతట్టులో ఉండడంతో మట్టి లేక ఇసుకతో మెరక చేయాల్సిఉంది. ఈ క్రమంలో ఇసుక తరలించేందుకు హేచరీ యాజమాన్యాలు టెంకాయచెట్ల పాలేనికి చెందిన అధికారపార్టీ నాయకులతో ఒప్పందం కుదుర్చుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సముద్రం ఒడ్డుకు, హేచరీ నిర్మాణాలకు 300 మీటర్ల దూరం ఉంది. సముద్రపు ఒడ్డున మేట వేసిన ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి రాత్రిళ్లు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 600 విక్రయిస్తున్నారు. ఈ విషయమై గ్రామంలోని అధికారపార్టీ నాయకుల్లో విభేదాలు తలెత్తడంతో ఓ వర్గం వారు రెవెన్యూ అధికారులకు సమాచార మిచ్చారు. అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన హేచరీలన్నీ, ఇలా సముద్రపు ఒడ్డు ఉన్న ఇసుకను తరలించాయి.

పట్టించుకోని అధికారులు

సముద్రపు ఒడ్డున సరుగుడు చెట్లు ఆనుకొని ఇసుక తరలిస్తున్నా, అటవీ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇదంతా ఫారెస్టు, రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతుందని, వారికి అందాల్సిన ముడుపులు అందుతుండడంతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



టెంకాయచెట్లపాలెం సముద్రం ఒడ్డున ఇసుక కోసం తవ్వకాలు జరపగా ఏర్పడిన గోతులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8343
వెండి కిలో ధర	రూ. 101,200
వెండి ఒక గ్రాము	రూ.104.20